అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 2-5-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 122 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



నన్నే బెదిరిస్తారా?

కేసులకు భయపడేవాన్ని కాదు

- రాజ్యాంగాన్ని మార్చొద్దంటే తప్పా?
- గుజరాత్ ఆధిపత్యానికి తెలంగాణ పౌరుషమేంటో చూపుతాం
- ఖబడ్దార్ మోడీ, షా : సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- కోరుట్లలో కాంగ్రెస్ జనజాతరకు పెద్దఎత్తున తరలొచ్చిన జనం
- నిజామాబాద్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపు

నవతెలంగాణ - కోరుట్ల

'నేను కేసులకు భయపడేవాన్ని కాదు.. రాజ్యాంగాన్ని మార్చొద్దని మాట్లాడితే తప్పా? దమ్ముంటే అభివృద్ధి పేరు చెప్పి ఓట్లు అడగాలేగానీ.. రాముని ఫొటోతో కాదు.. నా ఊరికొచ్చి.. నా గడ్డ మీదనే నన్ను బెదిరిస్తావా? ఈ ఎన్నికల్లో మీకు పరాభవం తప్పదు. గుజరాత్ ఆధిపత్యానికి తెలంగాణ పౌరుషమేంటో చూపుతాం' అంటూ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై

...13లో

ఆ ట్విట్టర్ ఖాతా నాది కాదు

- అమిత్ షా ఫేక్ వీడియోపై ఢిల్లీ పోలీసులకు సీఎం రేవంత్ రిప్లై
- తాను తెలంగాణ సీఎంఓ, తన వ్యక్తిగత ఖాతాలు మాత్రమే వాడుతున్నట్లు వెల్లడి
- సీఎం రిప్లైను ఢిల్లీ పోలీసులకు అందజేసిన న్యాయవాది సౌమ్య గుప్తా

వివరాలు 13లో



హక్కుల సాధనకై నిప్పు కణికలై... ఊరూవాడా కదం తొక్కింది కార్మికలోకం. తమ బతుకులను హరిస్తున్న కాషాయ రక్కసిపై కన్నెర్ర చేసింది. కార్పొరేట్లకు ఎర్రతివాచీ పరుస్తూ.. తమ శ్రమను మరింతగా దోపిడీ చేసేందుకు కుట్రలు పన్నుతున్న పాలకవర్గాలపై భగభగలాడే సూరీడితో కలిసి భగ్గున మండింది. అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా సరికొత్త సమసమాజాన్ని స్థాపిస్తామంటూ ప్రతినబూనింది. తమ లక్ష్యాలు, ఆశయాలకు అడ్డుగా ఉన్న వారికి లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించింది. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన అరుణపతాకం అజరామరమంటూ నినదించింది.

సంపద పున:పంపిణీకి పోరాటాలు ఉధృతమవ్వాలి

- పదేండ్లలో అదానీ ఆస్తి రూ.16 లక్షల కోట్లకు ఎలా పెరిగింది?
- కార్మికులు, ప్రజల నుంచి కొల్లగొట్టింది కాదా?
- కార్పొరేట్ల సంపదపై పన్నులేసి ప్రజలకు మేలు చేయాలి : మేడే దినోత్సవంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దోపిడీకి వ్యతిరేకంగా, సంపద పున:పంపిణీ కోసం పోరాటాలు ఉధృతం చేయాలని కార్మికవర్గానికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అధ్యక్షతన మేడే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ.రాఘవులు అరుణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా దోపిడీ, జాతి, మత, కుల అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతమవుతున్న తీరును వివరించారు. నేడు విశ్వవిద్యాలయాలు పూర్తిగా స్తంభించిపోయి ఉన్నాయని చెప్పారు. పాలస్తీనాలో ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ

...6లో



కార్మికుల రక్తంతో తడిసిందే ఎర్రజెండా

బీజేపీ గెలిస్తే కార్మిక వర్గానికి బానిసత్వమే

- కార్పొరేట్ అనుకూల మతోన్మాద బీజేపీని ఓడిద్దాం
- రాజ్యాంగ రక్షణకు ఇండియా కూటమిని బలపరుద్దాం
- బీజేపీ ఒక్క సీటూ గెలవకుండా చూసే బాధ్యత రేవంత్‌రెడ్డిదే: సంగారెడ్డి మేడే సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

వివరాలు 5లో



కుల, మత వైషమ్యాలు పెంచే కుట్ర

ఇది ప్రజలకు విడమరిచి చెప్పాలి

- బీజేపీని ఓడించడమే కార్మికయోధులకు అర్పించే నిజమైన నివాళి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

వివరాలు 6లో

- ఎంహెచ్ భవన్‌లో ఘనంగా మేడే వేడుకలు

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

రాష్ట్రంలో 3,32,32,318 మంది ఓటర్లు

- 35, 809 పోలింగ్ స్టేషన్లు
- ఎన్నికల నిర్వహణకు 2.94 లక్షల మంది సిబ్బంది
- 155 కంపెనీల కేంద్ర పారామిలటరీ దళాలు
- 46 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి
- పోలింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత
- రూ.212 కోట్ల నగదు, ఇతర వస్తువుల స్వాధీనం : రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మొత్తం 3,32,32,318 ఓటర్లు ఉన్నారనీ, అందులో 1,65,28,365 మంది పురుష ఓటర్లు, 1,67,01,192 మంది మహిళా ఓటర్లు, 18 నుంచి 20 సంవత్సరాల

...13లో

మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేకి

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్

- సీపీఐ(ఎం) కార్యాలయంలో ఘనంగా మేడే



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేకి అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని (మేడే) పురస్కరించుకుని సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం (ఏకేజీ భవన్)లో బుధవారం ఘనంగా మేడేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌కరత్ ఎర్ర జెండాను

...13లో



వామ్మో..

- గూడపూర్‌లో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఈ పదాది ఇదే అత్యధికం
- మే మొదటి వారంలోనే 47కు చేరువలో
- సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం

వివరాలు 5లో

కేసీఆర్‌కు ఈసీ షాక్

48 గంటల నిషేధం

- కాంగ్రెస్ నేతలపై అసభ్య వ్యాఖ్యల పట్ల ఎన్నికల సంఘం సీరియస్
- ఎలాంటి రోడ్ షోలు, ఇంటర్వ్యూలు ఇవ్వొద్దని ఆదేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ అధినేత కే చంద్ర శేఖర్ రావు ఎన్నికల ప్రచారానికి కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) బ్రేక్ వేసింది. కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ఆ పార్టీ రాష్ట్ర నేతలు చేసిన ఫిర్యాదుపై చర్యలు చేపట్టింది. ఇతర రాజకీయ పార్టీలు, ఆ పార్టీల నేతలపై అసభ్యకర వ్యాఖ్యలు చేయకూడదన్న ఎన్నికల నియమావళిని కేసీఆర్ ఉల్లంఘించారని పేర్కొంది. అందుకు గాను ఆర్టికల్ 324 ప్రకారం బుధవారం రాత్రి 8 గంటల నుంచి తదుపరి 48 గంటలు ఎలాంటి రోడ్ షోలు, ఇంటర్వ్యూలు ఇవ్వొద్దని నిషేధం విధించింది. ఎలాంటి బహిరంగ సభలు, ప్రజల ఊరేగింపులు, ర్యాలీలు, షోలు, మీడియాలో ఇంటర్వ్యూలు, పబ్లిక్ ప్రచారాలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఈసీఐ ప్రిన్సిపల్ సెక్రెటరీ మలై మల్లిక్ నాలుగు పేజీల ఉత్తర్వులను విడుదల చేశారు. ఏప్రిల్ 5న సిరిసిల్లలో మీడియా సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ 'ప్రజలను బతకడానికి పావడాలు, నిరోధులు అమ్ముకోమని చెప్పడానికి కాంగ్రెస్ నేతలు కుక్కల కొడుకులా?. నీళ్లివ్వడం చేతకాని లత్కోర్లు రాజ్యమేలుతున్నరు. అసమర్థులు, చవటలు, దద్దమ్మలు ఈ రాజ్యంలో ఉన్నరు. అబద్దాలతో కేవలం 1.8 శాతం ఓట్లు సాధించి అధికారంలోకి వచ్చారు. పంటలకు

...13లో



రేవంత్ అడ్డగోలు మాటలపై చర్యలేవి..?

నా ప్రచారాన్ని 48 గంటలు నిషేధిస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు 96 గంటలు పనిచేస్తరు

- ఇదంతా బీజేపీ, కాంగ్రెస్ కుట్ర
- మోడీవి కల్లబొల్లి కబుర్లు
- మానుకోట జిల్లా రద్దుకు రేవంత్ కుట్ర : మానుకోటలో రోడ్‌షోలో బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్

వివరాలు 13లో

ప్రధాని మోడీ వ్యాఖ్యలు బాధాకరం

మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచిపెడతారనడం అన్యాయం

- ప్రజల ఆస్తులు సీపీఐ(ఎం), కాంగ్రెస్ లాక్కుంటున్నాయని మోడీ దుష్ప్రచారం
- ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్న బీజేపీని ఓడించండి
- దానం నాగేందర్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు : గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యకర్తల సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు
- త్యాగాలు, పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర వెలకట్టలేనిది
- అమిత్ షా వీడియోపై సీఎంకు నోటీసులివ్వడం దారుణం : సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళల మెడలో మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచి పెడతారని ప్రధాని మోడీ మాట్లాడటం అన్యాయమని, ప్రధాని తన స్థాయికి తగ్గట్టుగా వ్యవహరించట్లేదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. దశాబ్దాలుగా దేశాన్ని కాంగ్రెస్ పాలించిందని, మరి మహిళల మంగళసూత్రాలు లాగేసుకున్నదా? పుస్తెలతాడు, మంగళసూత్రం గురించి మోడీకి ఏమైనా అవగాహన ఉన్నదా? అనే అనుమానం కలుగుతోందన్నారు. కాంగ్రెస్ సికింద్రాబాద్

...6లో

రేవణ్ణ 'సెక్స్ కుంభకోణం'పై
పెదవి విప్పని మోడీ

- ప్రధాన మీడియాలోనూ కానరాని కథనాలు





న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయంలో కర్నాటకలో బీజేపీ భాగస్వామ్య పక్షమైన జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు దేశ రాజకీయాలను కుదిపివేస్తున్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనుమడు. హసన్ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి బరిలో దిగారు. అక్కడ ఇప్పటికే పోలింగ్ జరిగింది. కాగా రేవణ్ణ రాసలీలల వ్యవహారాన్ని గత డిసెంబరులోనే బీజేపీ నాయకత్వం తన మిత్రపక్షం దృష్టికి తెచ్చింది. అయినప్పటికీ జేడీఎస్ పెద్దలు ప్రజ్వల్‌ను హసన్ నుండి, ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణను మాండ్యా నుండి పోటీకి దింపారు. రాష్ట్రంలో జరిగిన ఓ ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోడీ వీరిద్దరికీ మద్దతు కూడా ఇచ్చారు.

ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ ఇప్పటి వరకూ ప్రధాని మోడీ కానీ, జాతీయ మహిళా కమిషన్ కానీ, కేంద్ర మహిళ, శిశుసంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ కానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మరోవైపు పలు జాతీయ ఛానల్స్‌లో ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల బాగోతం ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

న్యూస్18 ఇండియా ఛానల్‌లో యాంకర్ రుబికా లియాకత్ సోమవారం రాత్రి రెండు షోలు నిర్వహించారు. ఒక దానిలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై చర్చ జరిగింది. మరో దానిలో ఆ ఛానల్‌కు మోడీ ఇచ్చిన ఇంటర్వ్యూపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో మోడీపై రుబికా ప్రశంసలు కురిపించారు. మోడీని 'బీజేపీ కీ జీత్ కా బ్రహ్మాస్త్ర' అని అభివర్ణించారు. మోడీ మాట్లాడినప్పుడల్లా ఆయన ప్రత్యర్థులు దిగ్భ్రాంతితో మౌనం వహిస్తారని కొనియాడారు. ఇంకో ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఆ రోజు చోటుచేసుకున్న టాప్ 50 వార్తా కథనాలలో రేవణ్ణ ఉదంతానికి చోటే ఇవ్వలేదు.

ఇక ఆజ్‌తక్ న్యూస్ ఛానల్ యాంకర్లు చిత్రా త్రిపాఠీ, అంజనా ఓం కశ్యప్ తాము రూపొందించిన కార్యక్రమాలలో రేవణ్ణ ఉదంతాన్ని ప్రస్తావించనే లేదు. శ్వేతా సింగ్ మాత్రం సెక్స్ కుంభకోణం వార్తకు కేవలం రెండు నిమిషాలు కేటాయించారు. టైమ్స్ నౌ ఛానల్‌లో యాంకర్ నావిక కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫేక్ వీడియోపై కార్యక్రమాన్ని అందించారు. అయితే ఇంగ్లీషు కార్యక్రమంలో మాత్రం ఆమె రేవణ్ణ సెక్స్ కుంభకోణంపై పదిహేను నిమిషాల పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉదంతంపై కాంగ్రెస్, బీజేపీ నేతలను ప్రశ్నించారు.

నిరాధారం...కల్పితం

- ప్రబీర్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధం లేదు
- నిరసనకారులకు డబ్బు పంచలేదు
- విమర్శిస్తే దేశానికి వ్యతిరేకత అంటున్నారు
- ఢిల్లీ పోలీసుల చార్జిషీటుపై 'న్యూస్‌క్లిక్'వివరణ


(ఫైల్)

న్యూఢిల్లీ : పోర్టల్ పైన, ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ పైన ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన చార్జిషీటుకు సంబంధించి మీడియాలో వచ్చిన ఆరోపణలను న్యూస్‌క్లిక్ తోసిపుచ్చింది. తన వివరణ తీసుకోకుండానే చార్జిషీటులోని ఆరోపణలను ప్రచురించారని తెలిపింది. దీనిపై న్యూస్‌క్లిక్ పోర్టల్ ఇచ్చిన వివరణలు... మీడియా విచారణను కోరుకోవడం లేదని మేము ఎప్పటి నుండో చెబుతూనే ఉన్నాము. న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశాలను చర్చించాలని మేము భావించడం లేదు. న్యాయ ప్రక్రియపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. అయితే ఆరోపణల తీవ్రత, వాటిని కూడా తరచుగా చేస్తుండడం, అవి పూర్తిగా అసంబద్ధంగా ఉండడం వంటి పరిణామాల దృష్ట్యా మేము కొన్ని విషయాలను ప్రస్తావించాలని అనుకుంటున్నాము.

న్యూస్‌క్లిక్ పైన, ప్రబీర్ పుర్కాయస్థ పైన చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం. న్యూస్‌క్లిక్ కానీ, ప్రబీర్ కానీ ఎలాంటి ఉగ్రవాద చర్యకు పాల్పడలేదు. అందుకు తగిన ఆధారమూ లేదు. ప్రబీర్‌కు ఏ ఉగ్రవాద గ్రూపుతోనూ సంబంధాలు లేవు.

అవి విచారణాధికారి ఆరోపణలే

ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం, న్యాయపరమైన ప్రక్రియలను పెండింగులో ఉంచడమే వారి లక్ష్యం. అందుకు అనుగుణంగానే వారు ఈ సమయంలో ఇలాంటి వార్తలు వండి వారుస్తున్నారు. ఏప్రిల్ 30వ తేదీనే అభియోగాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం దాఖలు చేసిన చార్జిషీటును ఉద్దేశపూర్వకంగానే లీక్ చేశారు. విచారణాధికారి అభిప్రాయాలనే చార్జిషీటులో పొందు పరుస్తారు తప్ప మరేమీ కాదు. వాటినే ఆరోపణలుగా చూపుతారు. వీటిని న్యూస్‌క్లిక్, ప్రబీర్ దృఢంగా ఎదుర్కొంటారు. అంతా పబ్లిక్ డొమైన్‌లో ఉంది

ప్రబీర్‌కు సీపీఐ (ఎం)తో దీర్ఘకాల అనుబంధం ఉంది. ఆయన గత యాభై సంవత్సరాలుగా ఆ పార్టీలో సభ్యుడు. దీనర్థం ఏమంటే ఆయన ఎప్పుడూ మావోయిస్టులకు కానీ, లష్కరే తోయిబాకు కానీ లేదా హింసాత్మక, చట్టవ్యతిరేక ప్రణాళికలు ఉన్న ఏ ఇతర గ్రూపు, వ్యక్తులకు మద్దతు ఇవ్వలేదు. ఆర్థికంగా లేదా ఇతరత్రా సాయపడలేదు. ఆయన రాజకీయ ప్రమేయం, అభిప్రాయాలు ప్రజాక్షేత్రంలో కన్పిస్తూనే ఉంటాయి.

అనేక మీడియా సంస్థల మాదిరిగానే న్యూస్‌క్లిక్ కూడా దేశంలో జరిగే ప్రధాన పరిణామాలను ప్రజలకు అందిస్తుంది. రైతుల నిరసనలు, సీఏఏ-ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలు కూడా అందించింది. మా పాత్రికేయుల పనులు పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి. వాటిలో రహస్యమేమీ లేదు. న్యూస్‌క్లిక్ కానీ, ప్రబీర్ కానీ నిరసనకారులకు పంచేందుకు నగదు ఇవ్వలేదు. అల్లర్లను ప్రోత్సహించలేదు. న్యూస్‌క్లిక్ తన న్యూస్ బులెటిన్లు, వార్తల్లో మ్యాపులకు సంబంధించి అన్ని నిబంధనలను పాటిస్తోంది. అదంతా పబ్లిక్ డొమైన్‌లో ఉంది. కొవిడ్ కష్టకాలంలో నిపుణులతో చర్చించి, వారి వ్యాఖ్యలను ప్రచురించింది. కొవిడ్ వ్యాక్సినేషన్‌కు సంబంధించి న్యూస్‌క్లిక్‌లో వచ్చినదంతా ఆర్టికల్స్, వీడియోల రూపంలో పోర్టల్‌లో అందరికీ అందుబాటులోనే ఉంది.

స్వతంత్ర జర్నలిజం లక్ష్యంగా...

మా స్వతంత్ర జర్నలిజంను లక్ష్యంగా చేసుకొని ఢిల్లీ పోలీసులు, ఇతర సంస్థలు విచారణలు చేస్తున్నాయని మేము మరోసారి పునరుద్ఘాటిస్తున్నాము. ప్రభుత్వ విధానాలను విమర్శించినా, నిరసన వార్తలను అందించినా దానిని భారత్ వ్యతిరేక చర్యగా చిత్రిస్తున్నారు. మాపై మోపిన ఆరోపణలన్నీ నిరాధారమైనవి. కల్పితమైనవి. 'రక్షణ కల్పిస్తున్న సాక్షులు' ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా ఈ ఆరోపణలు చేస్తున్నారు. వీటిని న్యాయస్థానంలో నిరూపించాల్సి ఉంటుంది. వీటిని కోర్టుల్లో న్యూస్‌క్లిక్ తగిన సమయంలో ఎదుర్కొంటుంది. ప్రబీర్, న్యూస్‌క్లిక్, మా పాత్రికేయుల కృషి యావత్తూ సమర్థనీయమేనని మేము విశ్వాసంతో ఉన్నాము.



మేడే సందర్భంగా ఎల్‌ఐసీ కార్యాలయంలో..



మేడే సందర్భంగా ఆర్‌బీఐ కార్యాలయం వద్ద...

ఢిల్లీ పోలీసుల నోటీస్‌లో గీత పేరు లేదు
ఆమె ఫోన్ ఎందుకు సీజ్ చేశారు

- డీజీపీ సమాధానం చెప్పాలి : టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీస్‌లో కాంగ్రెస్ కార్యకర్త గీత పేరు లేదనీ, ఆమె ఫోన్ ఎందుకు సీజ్ చేశారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ప్రశ్నించారు. దీనిపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ అడ్వయిజర్ రామచంద్రారెడ్డి, సీనియర్ నేత కోదండరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమిత్‌షా మీద ఫేక్ వీడియో బీజేపీ సృష్టి అన్నారు. ఎన్నికల సమయంలో ఢిల్లీ పోలీసులు రాష్ట్రానికి వస్తుంటే, తెలంగాణ పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులను భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గీత ఇంటికి ఆడపోలీసులు కాకుండా మగ పోలీసులు ఎలా వెళతారని ప్రశ్నించారు. దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ రిజర్వేషన్ల రద్దు కుట్రపై మే 4న ధర్నా

రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్రలను తిప్పికొట్టేందుకు మే 4 ధర్నా నిర్వహిస్తామని మాజీ మంత్రి చంద్రశేఖర్ చెప్పారు.

మైనారిటీ గురుకులంలో పాలిట్రిక్స్!



డిప్యూటీ సీఎంకి ఓ ఇద్దరు లెక్చరర్ల బురిడీ

- బెదిరించి విద్యార్థుల చేత ఓ అధ్యాపకురాలిపై ఫిర్యాదు
- మైనారిటీ సొసైటీకి సైతం తప్పుడు నివేదికలు..!
- విచారణలో వెలుగుచూసిన వాస్తవాలు..
- మానసిక క్షోభతో బాధిత లెక్చరర్ అనారోగ్యం పాలు
- విషయం బయటకు రాకుండా ప్రిన్సిపాల్, ఆర్ఎల్‌సీ జాగ్రత్తలు!
- ఇదీ అశ్వారావుపేట మైనారిటీ గురుకుల కళాశాల తీరు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

అశ్వారావుపేట మైనారిటీ గురుకుల కళాశాలలో పని చేసే ఇద్దరు లెక్చరర్లు ఏకంగా డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్కనే బురిడీ కొట్టించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్)ని సైతం తప్పుదోవ పట్టించినట్టు తెలుస్తోంది. తమ స్వార్థం కోసం విద్యార్థులను బెదిరించి డిప్యూటీ సీఎంకు తప్పుడు కంప్లయింట్స్ రాయించారని సమాచారం. తాము చెప్పినట్టు చేయకపోతే ప్రాక్టికల్ మార్కులు వేయమని విద్యార్థినులను బెదిరించినట్టు విచారణలో వెలుగు చూసింది. ఈ ఘటనతో బాధిత లెక్చరర్ మానసిక క్షోభతో తీవ్ర అనారోగ్యానికి గురై.. కొద్దిరోజుల పాటు కోమాలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుండటంతో అసలు విషయాలు బయటకు వస్తున్నాయి. దాంతో విషయం బయటకు రాకుండా ప్రిన్సిపాల్, ఆర్ఎల్‌సీ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం.

ఏమి జరిగింది..

అశ్వారావుపేట మైనారిటీ గురుకుల కళాశాలలో తెలుగు లెక్చరర్, వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న కవితపై వ్యక్తిగత కక్షతో అదే కళాశాలలో ఇంగ్లీష్, ఫిజిక్స్ లెక్చరర్లు పి.స్వప్న, బి. నీరజ కళాశాలలో కొంతమంది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులతో జనవరి 6న డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కవిత తమను వేధింపులకు గురిచేస్తోందని, అనరాని మాటలు అంటోందని తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని భట్టివిక్రమార్కకు విద్యార్థినుల చేత లేఖ రాయించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం లెక్చరర్ కవితపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీఎంఆర్ఈఐఎస్‌ను ఆదేశించారు. దాంతో రంగంలోకి దిగిన టీఎంఆర్ఈఐఎస్ అధికారులు అశ్వారావుపేట గురుకుల కళాశాలలో విచారణ నిర్వహించారు. ఈ విచారణలో విద్యార్థినులు విస్తుగొల్పే విషయాలను అధికారులకు వివరించారు.

బెదిరించి ఫిర్యాదు చేయించారు..!

వైస్ ప్రిన్సిపాల్ కవిత తమను ఎప్పుడూ వేధించలేదని, ఎటువంటి ఇబ్బందీ పెట్టలేదని రాతపూర్వకంగా రాసిచ్చారు. విద్యార్థినుల విచారణను అధికారులు వాయిస్ రికార్డు సైతం చేశారు. ఇంగ్లీష్ లెక్చరర్ స్వప్న, ఫిజిక్స్ లెక్చరర్ నీరజ ఇద్దరూ తమపై ఒత్తిడి తెచ్చి, బెదిరించి లెటర్ రాయించారని చెప్పారు. తమకు రాయటం రాకపోతే వాళ్లే రాసి దాన్ని చూసి తమ హ్యాండ్ రైటింగ్‌తో రాయమని చెప్పారని, లేకపోతే తమను కాలేజీ నుంచి పంపించి వేస్తామని.. ఎగ్జామ్స్‌లో ఫెయిల్ చేస్తామని బెదిరించారని విద్యార్థులు అధికారులకు చెప్పారు.

చేసేది లేక వాళ్లు చెప్పిన విధంగా ఫిర్యాదు రాసి ఇచ్చామని చెప్పారు. తాము రాసిన కంప్లయింట్ కాపీలను ఇంగ్లీష్ లెక్చరర్ స్వప్న, ఫిజిక్స్ లెక్చరర్ నీరజ ఎవరికి పంపారో తమకు తెలియదని విద్యార్థినులు అధికారుల ఎదుట వాపోయారు. ఇంగ్లీష్, ఫిజిక్స్ లెక్చరర్లు తమను ఎలా బెదిరించారో విద్యార్థినులు లిఖితపూర్వకంగా ఖమ్మం ఆర్ఎల్‌సీ అరుణకుమారికి అందజేశారు.

మానసిక క్షోభతో
తెలుగు లెక్చరర్ అనారోగ్యం పాలు..

ఈ ఊహించని పరిణామంతో కళాశాల తెలుగు లెక్చరర్, వైస్ ప్రిన్సిపాల్ కవిత తీవ్ర భయభ్రాంతులకు గురై అనారోగ్యం పాలయ్యారు. విజయవాడలో ప్రముఖ మానసిక వైద్యులు కవితను పరీక్షించి మానసికంగా కృంగిపోవడంతో బ్రెయిన్, మెడ, వెన్నుపూస సంబంధిత భాగాలు దెబ్బతిన్నాయని వివరించారు. ఇప్పుడిప్పుడే ఆమె అనారోగ్యం నుంచి కోలుకుంటున్నారని తెలిపారు.

అన్ని ఆధారాలున్నా
చర్యలు తీసుకోని అధికారులు..

ఇంగ్లీష్, ఫిజిక్స్ లెక్చరర్లు విద్యార్థినులను పక్కదోవ పట్టించి ఫిర్యాదు చేయించినట్టు అన్ని ఆధారాలున్నా మైనార్టీ సొసైటీ అధికారులు ఇప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ సమయంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఉండటంతో 'మార్చి 14 వరకు ఆగండి మీకు న్యాయం చేస్తామని' సొసైటీ అధికారులు కవితకు హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

ఇద్దరు లెక్చరర్‌లను ప్రిన్సిపాల్ సంగీత మార్చి 14న రిలీవ్ చేసి కళాశాల నుంచి బయటకు పంపించి వేశారు. రిలీవ్ చేశాను కాబట్టి ఎటువంటి చర్యలు తీసుకోలేమని ప్రిన్సిపాల్ చెప్తుండటాన్ని కవిత తప్పు పట్టారు. ఈ విషయంలో తనకు తగు న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు.

రిజైన్ చేసి వెళ్లారు..
ఇక ఎలాంటి చర్యలు తీసుకోలేము..
- అరుణకుమారి, ఆర్ఎల్సీ, ఖమ్మం

ఈ ఘటనకు కారణమైన ఇంగ్లీష్ లెక్చరర్ ఇప్పటికే రిజైన్ చేసి వెళ్లారు. ఫిజిక్స్ అధ్యాపకురాలి పాత్ర నామమాత్రంగా ఉన్నట్టు విచారణలో తేలింది. దీనిపై సెక్రెటరీ విచారణ నిర్వహించారు. ప్రధానంగా ఇంగ్లీషు లెక్చరర్ మాత్రమే మాపై ఒత్తిడి చేశారని.. ఫిజిక్స్ లెక్చరర్ ఆ సమయంలో అక్కడ ఉండి.. ఆమెకు అనుకూలంగా మాట్లాడుతూ వచ్చారు కానీ మమ్మల్ని ఎలాంటి ఇబ్బంది పెట్టలేదని విద్యార్థులు చెప్పారు. అయినప్పటికీ ఆమె కూడా రిలీవ్ అయినట్టు సమాచారం ఉంది.

దిశ కమిషన్ రిపోర్టు అమలుపై హైకోర్ట్ స్టే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దిశ అత్యాచారం, హత్య కేసు నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసులకు హైకోర్టులో బుధవారం ఊరట లభించింది. సుప్రీంకోర్టు నియమించిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక అమలుపై స్టే విధించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే విధిస్తున్నట్లు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ప్రకటించారు. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలనీ, హత్యానేరం కింది కేసు నమోదు చేయాలని 2022లో కమిషన్ ఇచ్చిన నివేదికను ఇన్స్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్, ఇతర పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు సవాల్ చేశారు. ఎస్‌హెచ్‌ఓ, తహసీల్దార్‌ల విషయంలో కమిషన్ నివేదికను అమలు చేయరాదని స్టే ఆదేశాలు ఇచ్చారు. మరో ఏడుగురు పోలీసుల విషయంలో కఠిన చర్యలు తీసుకోరాదని ఆదేశించారు. విచారణను రెండు నెలల తర్వాత చేపడతామని ప్రకటించారు. ఈలోగా ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.


ఇద్దరు ఎమ్మెల్యేలకు నోటీసులు

జనగాం, మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాడ్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు అనుమతిచ్చింది. ఈ మేరకు జస్టిస్ శ్రీనివాస్‌రావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చెల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వజ్రేష్‌యాదవ్ సవాల్ చేశారు. బ్యాంకు ఖాతా లేకపోయినా ఐటీ రిటర్న్ ఎలా దాఖలు చేశారని పిటిసన్‌లో పేర్కొన్నారు. జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి(బీఆర్ఎస్) ఎన్నికల సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) దాఖలు చేసిన పిటిషన్‌లో కూడా ఎమ్మెల్యేకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ రెండు వ్యాజ్యాలపై విచారణను జూన్,6,14 తేదీలకు వాయిదా పడ్డాయి.

అణచివేతల భారతం

ముస్లిం సమాజంపై పెరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు

- గో రక్షణ, లవ్ జిహాద్ పేరుతో దాష్టీకాలు
- దిగజారుతున్న మైనారిటీల ఆర్థిక పరిస్థితులు
- క్రైస్తవులనూ వేధిస్తున్న హిందూత్వ శక్తులు



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ పాలనలో ముస్లింలు, క్రైస్తవులు, దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల వారు అన్ని రకాలుగా అణచివేతకు గురయ్యారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 14.2 శాతం మంది ముస్లింలు ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ వంటి పెద్ద పెద్ద మాటలు ఎన్ని చెబుతున్నప్పటికీ వారి అణచివేత స్పష్టంగా కన్పిస్తోంది.

బీజేపీలో ఒక్క ముస్లిం ఎంపీ లేరు

ప్రస్తుతం పార్లమెంట్ ఉభయసభల్లో బీజేపీకి 395 మంది సభ్యులు ఉన్నారు. అయితే వీరిలో ఒక్క ముస్లిం కూడా లేరు. మోడీ క్యాబినెట్‌లోని 57 మందిలో ఒక్కరు కూడా ముస్లిం మంత్రి లేరు. ఇక గత పది సంవత్సరాల్లో ముస్లింలపై జరిగిన దౌర్జన్యాల విషయానికి వస్తే 2019లో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన హింసను ప్రధానంగా ప్రస్తావించాలి. అప్పుడు నూతన పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ ప్రకారం ఆ నిరసన అనంతరం చెలరేగిన హింసాకాండలో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 38 మంది ముస్లింలే.

లెక్కే లేని 'లవ్ జిహాద్' ఉదంతాలు

ఇక 'లవ్ జిహాద్' ఉదంతాలకైతే లెక్కే లేదు. హిందూ బాలికలను వివాహం చేసుకున్న ముస్లిం యువకులు, వారి కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. బీజేపీ ప్రభుత్వం హిందూ జాతీయతావాద గ్రూపులకు పెత్తనం ఇచ్చిందని, అవి ముస్లింలను బెదిరించడం, వేధించడం, వారిపై దాడి చేయడం వంటి చర్యలకు పాల్పడ్డాయని హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ తెలిపింది. పోలీసులు, న్యాయస్థానాలు వంటి స్వతంత్ర సంస్థలు కూడా అధికార పార్టీ చెప్పినట్లు నడుచుకున్నాయని ఎత్తిచూపింది.

గో రక్షణ పేరుతో...

మాంసం రవాణా, విక్రయాలు చేసిన ముస్లింలపై గో సంరక్షణ పేరిట దేశంలో పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. దాద్రీ నుండి జునాయిడ్ వెళుతున్న ఓ రైలులో ఓ వ్యక్తిపై దాడి చేసి హింసించారు. ఆ తర్వాత ఇలాంటి కేసులు సుమారు వంద వరకూ నమోదయ్యాయి. ఇలాంటి దాడుల్లో 97 శాతం నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చిన తర్వాతే జరిగాయని బిజినెస్ స్టాండర్డ్ పత్రిక తెలిపింది. గో సంబంధమైన 63 కేసులు నమోదైతే వాటిలో 32 ఘటనలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చోటుచేసుకున్నవేనని ఆ పత్రిక వివరించింది.

దిగజారిన ఆర్థిక స్థితిగతులు

మైనారిటీ ముస్లింల ఆర్థిక పరిస్థితులను గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. మోదీ పాలనలో వారి ఆర్థిక స్థితిగతులు బాగా దిగజారాయి. 2006లో రాజేందర్ సచార్ కమిటీ ముస్లింల ఆర్థిక పరిస్థితిని ఓ పద్ధతి ప్రకారం మదింపు చేసింది. ఆ కమిటీ ఏం చెప్పిందంటే...దేశంలో ముస్లింలు అత్యంత పేదరికంలో జీవిస్తున్నారు. మొత్తం మీద వారి పరిస్థితి ఎస్సీ, ఎస్టీల కంటే కొంచెం మెరుగ్గా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మాత్రం దారుణంగా ఉంది.

ఎన్‌ఎస్‌ఎస్‌ఓ గణాంకాల ప్రకారం 2004-05లో దేశ జనాభాలో 22.7 శాతం మంది అంటే 25.1 కోట్ల మంది పేదలే. ఎస్సీ, ఎస్టీల్లో 35 శాతం మంది, ముస్లింలలో 31 శాతం మంది పేదరికంతో బాధపడుతున్నారు. అన్ని మతాల వారు జీవించే ప్రాంతాల్లో ముస్లింలకు నివాస గృహాలు దొరకడమే కష్టమవుతోంది'... 2006 కంటే ఇప్పుడు పరిస్థితులు మరింత దిగజారాయని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

హిందూత్వ శక్తుల ఆగడాలు

క్రైస్తవ సమాజం కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. 1999లో గ్రహం స్టీవర్ట్ స్టెయిన్స్ అనే పాస్టర్‌ను సజీవ దహనం చేశారు. ఒడిషాలోని కాంధమాల్‌లో 2008లో అత్యంత క్రూరమైన ఘటనలు జరిగాయి. హిందూత్వ శక్తులు బరితెగించి క్రైస్తవ సమాజంపై దాడి చేశాయి. దీనిపై విచారణ కోసం రిటైర్డ్ న్యాయమూర్తి ఏపీ షా నేతృత్వంలో నేషనల్ పీపుల్స్ ట్రిబ్యునల్ ఒక జ్యూరీని నియమించింది. కాంధమాల్‌లో జరిగిన ఘటనలు దేశానికే తలవంపులు తెచ్చాయని, అక్కడ మానవత్వం పూర్తిగా మంటగలిసిందని జ్యూరీ తెలిపింది. ఆ హింసాకాండలో సుమారు 100 మంది క్రైస్తవులు ప్రాణాలు కోల్పోగా 300 చర్చిలు ధ్వంసమయ్యాయి.

23 రాష్ట్రాల్లో ఈ తరహా హింసాత్మక ఘటనలు జరిగాయని, మూడు రాష్ట్రాల్లోని 13 జిల్లాల్లో భయానక వాతావరణాన్ని సృష్టించారని, క్రైస్తవాన్ని ఆచరించాలంటేనే భయపడే పరిస్థితి కల్పించారని సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ సంస్థ తెలిపింది. క్రైస్తవులు నివసించడానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన దేశాల్లో భారత్ 10వ స్థానంలో ఉన్నదని ఓపెన్ డోర్స్ సంస్థ చెప్పింది.

బుజ్జగింపు రాజకీయాలు

క్రైస్తవుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు ప్రధాని మోడీ గత సంవత్సరం బుజ్జగింపు ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు క్రైస్తవ మత గురువులను డిసెంబర్ 25న ఆహ్వానించి వారితో చర్చలు జరిపారు. క్రైస్తవ సమాజం చేస్తున్న సేవలను కొనియాడారు. దేశంలో అట్టడుగు వర్గాల వారిని వలలో వేసుకోవడానికి బీజేపీ పలు అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసింది. దళితులను ఆకర్షించడానికి ఏర్పాటు చేసిన సామాజిక్ సంరాష్ట్ర మంచ్ వాటిలో ఒకటి. ముస్లింలలోని షియాలు, పస్మందాలు, సూఫీ తెగల వారి ఓట్ల కోసం రాష్ట్రీయ ముస్లిం మంచ్ అనే సంస్థను కూడా స్థాపించింది. బీజేపీ నేతలు ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ అట్టడుగు వర్గాల వారు వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వారి ఆగ్రహం లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



70 లక్షల మంది మహిళల పేర్లు మిస్సింగ్

- పెండ్లి అయ్యాక.. యూపీ ఓటర్ల జాబితా నుంచి ఓట్లు గల్లంతు
- వివాహం తర్వాత పలు ఆంక్షలు, సమస్యలు
- ఓటరు ఐడీ కోసం అత్తింటి వారి అనుమతి అవసరం

లక్నో : యూపీలో ఓటరు జాబితా నుంచి పెండ్లైన మహిళల ఓట్లు గల్లంతవుతున్నాయి. ఇలా దాదాపు 70 లక్షల మంది మహిళల పేర్లు ఓటరు జాబితాలో లేకపోవటం చర్చనీయాంశంగా మారుతున్నది. ఓటు వేయటానికి వారు అర్హులే అయినప్పటికీ.. ఓటరు జాబితాలో వారి పేర్లు కనిపించటం లేదు. దీంతో సదరు మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

పెండ్లైన తర్వాత మహిళలపై పలు ఆంక్షలు వస్తున్నాయి. సమస్యలూ ఉంటున్నాయి. అత్తమామల అనుమతితోనే వారు ఓటరు ఐడీలను పొందాల్సి వస్తున్నది. "పెండ్లికి ముందు, నేను నా సోదరులను ఓటింగ్ అడిగినప్పుడల్లా, వారు నాకు పెండ్లి తర్వాత ఓటు వేయాలని చెప్పారు. నాకు పెండ్లయ్యాక అధికారులు మా ఇంటికి స్వయంగా వెళ్లి ఓటరు గుర్తింపు కార్డు ఇస్తారని నా భర్త చెప్పేవాడు. కానీ ఎప్పుడూ అలా జరగలేదు. నా కుటుంబంలో, ఓటు వేయాలనే నా కోరికను ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. కానీ ఈ సంవత్సరం ఓటు గురించి నేనే బాధ్యత తీసుకున్నాను. ఓటర్ ఐడీ కార్డును ఎలా పొందాలో తెలుసుకున్నాను. జనవరిలో పని నుంచి ఒక రోజు సెలవు తీసుకున్నా. నగరంలోని ఒక ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, చివరకు దానిని పొందాను" అని పశ్చిమ యూపీకి చెందిన నిర్మల అనే మహిళ ఒకరు తెలిపారు.

2011 జనాభా లెక్కల ప్రకారం యూపీలో 18 ఏండ్లు పైబడిన మహిళలు దాదాపు 7.7 కోట్ల మంది ఉన్నారు. అయితే భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) గణాంకాల ప్రకారం రాష్ట్రంలో కేవలం 7 కోట్ల మంది మహిళా ఓటర్లు మాత్రమే నమోదయ్యారు. అంటే, దాదాపు 70 లక్షల మంది మహిళా ఓటర్ల పేర్లు గాయబ్ అయ్యాయి. యూపీలోని ఒక్కో నియోజకవర్గం నుంచి సగటున 87,500 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు. ప్రణయ్ రాయ్, దొరబ్ ఆర్ సోపరివాలా రాసిన ది వెర్డిక్ట్ అనే పుస్తకంలో మహిళా ఓటర్ల మిస్సింగ్ విషయం కూడా ప్రస్తావించబడింది. పుస్తకం డేటా ప్రకారం.. 2019 ఎన్నికలకు ముందు, భారత్ అంతటా 2.1 కోట్ల మంది మంది మహిళా ఓటర్లు జాబితా నుంచి మిస్స య్యారు. ఇందులో యూపీ నుంచి అధికంగా ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (23 లక్షలు), రాజస్థాన్ (12 లక్షలు), బీహార్ (8 లక్షలు), మధ్యప్రదేశ్(80 లక్షలు)లు ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలలో జాతీయ సగటు పరంగా పురుషులు, మహిళా ఓటర్లలో దాదాపు సమాన శాతం పోలింగ్ నమోదు కాగా.. యూపీ వంటి కొన్ని రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయి.

యూపీలో ఓటర్ల సంఖ్య 2021లో 14.71 కోట్ల నుంచి 15.02 కోట్లకు పెరిగింది. ఇందులో దాదాపు 7 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2022లో, అప్పటి యూపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అజయ్ కుమార్ శుక్లా మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాల సవరణ సమయంలో మహిళలు పెద్ద సంఖ్యలో నమోదు చేసుకోవడం వల్ల లింగ నిష్పత్తి 11 పాయింట్లు మెరుగుపడిందనీ, నవంబర్ 1, 2021 నాటికి 1,000 మంది పురుష ఓటర్లకు 857 మంది మహిళలు ఉన్నారనీ, డిసెంబర్ 5, 2021 నాటికి అది 868కి చేరిందని వివరించారు.

"నా ఓటరు గుర్తింపు కార్డును నా భర్త పొందాడు. ఒకరోజు నా ఆధార్ కార్డు తీసుకుని దరఖాస్తు చేశాడు. నేను ఏ రాజకీయ పార్టీకి లేదా గుర్తుకు ఓటు వేయాలో అర్థం కావడం లేదు. ఆయన సూచించే పార్టీకే నా ఓటు వేస్తాను" అని కవిత(25) అన్నారు. ఓబీసీలు అధికంగా ఉండే యూపీలోని ఖేరా గ్రామంలో అమత కశ్యప్(35) మాట్లాడుతూ.. ఒక పంచాయతీ సభ్యుడు తన మామగారిని తట్టి లేపిన తర్వాతే తనకు ఓటరు ఐడీ కార్డు వచ్చిందని చెప్పారు."ఇక్కడి మహిళలు, అత్తమామలు అనుమతించిన తర్వాతే ఓటరు గుర్తింపు కార్డులు పొందడం ఆనవాయితీ. మేము వెళ్లి దానిని ఎలా డిమాండ్ చేస్తాము?" అని ఆమె వాపోయారు.

'మాకు రోడ్డు ఎందుకు లేదు?'

బాగ్‌పత్ గ్రామాల్లోని మహిళా ఓటర్లకు, మద్యపానం నుంచి మహిళల భద్రత వరకు సంక్షేమ పథకాల పంపిణీ వరకు అన్నీ సమస్యాత్మకంగానే ఉన్నాయని అక్కడి స్థానికులు చెప్తున్నారు. ఖేరాకు చెందిన ఒక ఇంటి పనిమనిషి(40) డాలీ కశ్యప్ మాట్లాడుతూ.. బాగ్‌పత్‌లో అక్రమ మద్యం కారణంగా ఇటీవల నలుగురు మరణించారని చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో, యూపీ ఎక్సైజ్ ఆదాయంలో ఆల్ టైమ్ హై రికార్డ్‌తో కర్నాటకను అధిగమించింది. 2017లో రూ.14,000 కోట్ల నుంచి రూ.42,250 కోట్లకు చేరుకున్నది. "మా ప్రాంతంలో మద్యం దుకాణాలు పెరుగుతున్న కారణంగా ఎక్కువ మంది పురుషులు దానికి బానిసలవుతున్నారు. గత ఆరు నెలల్లో నలుగురు వ్యక్తులు మరణించారు. భర్త చనిపోయిన తర్వాత ఇంటి నిర్వహణ భారం భార్యదే. కానీ వచ్చే కొద్దిపాటి సంపాదనతో పిల్లలను ఎలా చదివించగలుగుతాం?" అని డాలీ ప్రశ్నించారు.

మల్కాపూర్‌లోని ఇటుక బట్టీల వద్ద ఉన్న మహిళలు కొందరు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం తమకు ఇంకా అందలేదని మల్కాపూర్ గ్రామస్తులు చెప్పారు. "పోలింగ్ రోజున, మా గ్రామం నుంచి ఒక ట్రాక్టర్ పోలింగ్ బూత్‌కు వెళ్తుంది. కానీ అది పురుషులతో నిండి ఉంటుంది. మేము వారితో ఎలా ప్రయాణించగలం? ఇది మమ్మల్ని ఓటు వేయకుండా నిరుత్సాహపరుస్తుంది" అని మహిళా ఓటర్లు వాపోయారు.

ఖాస్పురా గ్రామంలో మహిళలు కనెక్టివిటీ సరిగా లేదని కొందరు మహిళలు ఫిర్యాదు చేశారు.లక్ష్మి త్యాగి అనే 65 ఏండ్ల వృద్ధుడు మాట్లాడుతూ.. గ్రామాన్ని పోలింగ్ స్టేషన్‌కు కలిపే రహదారి లేదు అని చెప్పాడు. వైశాలి త్యాగి అనే యువతి(24) మాట్లాడుతూ.. "ఈ గ్రామంలోని చాలా మంది యువతులలాగే నేను కూడా గ్రాడ్యుయేట్. కానీ రవాణా సౌకర్యం లేకపోవడంతో కెరీర్‌ను కొనసాగించలేక పోతున్నాం. అలాంటప్పుడు మన చదువు వల్ల ఉపయోగం ఏమిటి? మోడీ ప్రభుత్వం మాలాంటి మహిళల కోసం ఎందుకు రహదారిని నిర్మించలేదు?" అని సదరు యువతి ప్రశ్నించారు.



అమేథీ, రాయ్‌బరేలీ అభ్యర్థులపై 24 గంటల్లో నిర్ణయం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే రెండు దశల ఎన్నికలు ముగిసాయి. అయినప్పటికీ కాంగ్రెస్ రాయబరేలీ, అమేథీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటివరకూ ఈ స్థానాల్లో అభ్యర్థుల్ని ఖరారు చేయకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాల అభ్యర్థుల పేర్లను 24 గంటల్లో ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే చెబుతున్నారు. ఈ విషయంలో ఎవరూ భయపడొద్దని ఆ పార్టీ నేత జైరాం రమేష్ తెలిపారు. కాగా 2019లో అమేథీలో రాహుల్‌గాంధీని బిజెపి నేత స్మృతి ఇరానీ ఓడించారు. ఈసారి కూడా స్మృతి ఇరానీ ఈ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ మరోసారి ఈ స్థానం నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నారు. అమేథీ స్థానానికి ఐదో దశలో మే 20న ఎన్నికలు జరగబోతున్నాయి.

అనంత్‌నాగ్ ఎన్నిక వాయిదాపై విమర్శల వెల్లువ

- ఓటింగ్ సరళిని మార్చేందుకే .. : ముఫ్తీ, ఒమర్
- ఈసీ విశ్వసనీయతనే దెబ్బ తీస్తుంది : సీపీఐ(ఎం)

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానం ఎన్నికను ఇసి వాయిదా వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 7న జరగాల్సిన అనంత్‌నాగ్ లోకసభ ఎన్నికను ఈ నెల 25కు ఇసి మంగళవారం వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈసీ నిర్ణయాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. అనంత్‌నాగ్ ఎన్నికను వాయిదా వేయిడం ఇసి విశ్వసనీయుతను దెబ్బతీస్తుందని సీపీఐ(ఎం) నాయకులు ఎం.వై. తరిగామి విమర్శించారు. అలాగే ఈసీ నిర్ణయంపై పీడీసీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఒమర్ అబ్దుల్లా అనేక ప్రశ్నలు సంధించారు. ఓటింగ్ సరళిని మార్చే లక్ష్యంతోనే ఈసీ ఈ ఎన్నికను వాయిదా వేసిందని విమర్శించారు. 'అనేక పార్టీల విజ్ఞప్తి మేరకు అనంత్‌నాగ్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు ఈసీ ప్రకటించింది. అయితే ఇది బీజేపీ కుట్ర. ఎన్నిక వాయిదా విషయంలో అభ్యర్థులకు, ఓటర్లుకు సంబంధం లేదు. బీజేపీ దాని మిత్రపక్షాలు మాత్రమే వాయిదా గురించి మాట్లాడుతున్నాయి. మేలో ఎగువ ప్రాంతాలకు వలస వెళ్లే ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనకుండా చేయడానికే ఎన్నికను వాయిదా వేశారు. అయితే ఓటింగ్‌లో పాల్గొన్న తరువాతే వారంత వలస వెళతారని నేను నమ్ముతున్నాను' అని అబ్దుల్లా తెలిపారు. అలాగే, రాజౌరిలో ఎన్నికల సభలో ముఫ్తీ మాట్లాడుతూ 'బీజేపీ, దాని మిత్రపక్షాలకు అనుకూలంగా ఓటు వేసేందుకు, ఓటు హక్కు వినియోగించుకోకుండా ప్రజలను భయపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగానే ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు' అని ముఫ్తీ విమర్శించారు.ఈసీ నిర్ణయానికి వ్యతిరేకంగా శ్రీనగర్‌లో బుధవారం పీడీపీ వీధి నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ నిరసనలో పార్టీ సీనియర్ నాయకులు నయీమ్ అక్తర్ మాట్లాడుతూ ' ఇది ఎన్నికలకు ముందు జరిగిన రిగ్గింగ్. తనకు వ్యతిరేకంగా పరిస్థితి ఉందని బీజేపీ గుర్తించింది. దురదృష్టవశాత్తు బీజేపీకి ఈసీ సాధనంగా మారింది. ఏ నివేదిక ఆధారంగా ఎన్నికలను వాయిదా వేశారో ఆ నివేదికను బహిర్గతం చేయాలి' అని డిమాండ్ చేశారు.

అయితే ఈసీ నిర్ణయాన్ని బీజేపీ, జమ్ముకాశ్మీర్ అప్నీ పార్టీ (జేకేఏపీ), జమ్ముకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్, గులాం నబీ అజాద్‌కు చెందిన డెమొక్రాటిక్ ప్రొగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) స్వాగతించాయి.

ఇది నయవంచక పాలన ...!

- మోడీ ఏలుబడిలో మహిళల బతుకులు దుర్భరం
- పెరిగిపోతున్న లైంగిక వేధింపులు, హింస, అవమానాలు
- రాజకీయ రిజర్వేషన్లపై దాటవేత... మహిళా బిల్లుపై మౌనం
- మైనారిటీ మహిళల అభివృద్ధికి చట్టం అవసరం
- వారిది ఆది నుండీ పురుషాధిక్య సిద్ధాంతమే

నరేంద్ర మోడీ పాలనలో మహిళల బతుకులు దుర్భరంగా మారాయి. వారిపై అకృత్యాలు, అఘాయిత్యాలు, దాష్టీకాలు నానాటికీ పెరిగిపోయాయి. బీజేపీ నాయకులే ఈ అమానుష చర్యలకు తెగబడుతున్న ఉదంతాలు కోకొల్లలు. పురుషాధిక్య సిద్ధాంతాన్ని ప్రవచించే బీజేపీ నేతలు మహిళలు చెప్పు కింద తేలు మాదిరిగా పడి ఉండాలని కోరుకుంటున్నారు. ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా పచ్చి మోసానికి పాల్పడుతున్నారు. లైంగిక మైనారిటీల హక్కులను కూడా కాలరాయాలని చూస్తున్నారు.

న్యూఢిల్లీ :'మహిళా సమ్మాన్', 'బేటీ బచావ్...బేటీ పడావ్' వంటి నినాదాలతో మహిళా లోకాన్ని ఆకర్షించి వారి ఓట్లను కొల్లగొట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఉద్యోగావకాశాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తానంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పింది. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తానని ఊరించింది. లైంగిక మైనారిటీల అభివృద్ధికి చట్టాన్ని తీసుకొస్తానంటూ తీయని కబుర్లు చెప్పింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలన్నింటినీ గాలికి వదిలేసింది. వాస్తవానికి మోడీ ప్రభుత్వ పాలనలో మహిళల బతుకులు మరింత దుర్భరమయ్యాయి. మహిళలు, బాలికలపై లైంగిక దాడులు నిత్యకృతమయ్యాయి.

చెప్పిందేమిటి?

8

మోయలేని భారం

కుటుంబ బాధ్యతలను మోస్తున్న మహిళలపై ద్రవ్యోల్బణం కారణంగా తీవ్రమైన ఒత్తిడి కలుగుతోంది. నిరుద్యోగం, వలసలు పెరిగిపోతుండడంతో మహిళలపై బాధ్యతల భారం పెరుగుతోంది. చాలీచాలని వనరులతో కుటుంబ బాధ్యతలను తలపై వేసుకోవాల్సి రావడంతో మహిళలు పౌష్టికాహారలోపంతో అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రపంచంలోని 126 దేశాల్లో పౌష్టికాహారలోపంపై అధ్యయనం నిర్వహించగా భారత్ 107వ స్థానంలో నిలిచింది.

ఉద్యోగాలు లేవు... ఉన్నా వేతనాలు అంతంతే


ఉద్యోగుల్లో మహిళల సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గిపోతోంది. ఒకవైపు ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతుంటే మరోవైపు ఉన్న ఉద్యోగాల కోసం తీవ్రమైన పోటీని ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో ఉద్యోగుల్లో మహిళల సంఖ్య పడిపోతోంది. మహిళలు ఎక్కువగా అనధికారిక, అసంఘటిత రంగాల్లో పనిచేస్తుంటారు. దీంతో వారికి అత్యంత తక్కువగా వేతనాలు లభిస్తున్నాయి. సేవలకు సంబంధించిన రంగాల్లో మహిళలు ఎక్కువగానే పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు వారిని అగౌరవపరిచేలా ఉంటున్నాయి. వీరికి సగటున నెలకు కేవలం ఐదు వేల రూపాయలు మాత్రమే లభిస్తున్నాయి.

పెచ్చరిల్లిన దాష్టీకాలు

గడచిన పది సంవత్సరాల కాలంలో అంటే మోడీ ప్రభుత్వ హయాంలో మహిళలపై లైంగిక వేధింపులు, హింస, దూషణలు పెరిగిపోయాయి. 2011లో ఇలాంటి కేసులు 2,28,650 నమోదు కాగా 2022 నాటికి ఆ సంఖ్య 4,28.278కి పెరిగింది. అంటే ఈ తరహా కేసుల సంఖ్య గణనీ యంగా పెరిగిపోయిందని అర్థమవు తోంది. 'ఇండియా స్పెండ్' అనే సంస్థ నిర్వహించిన ఓ అధ్య యనం ప్రకారం గత ఐదు సంవత్సరాల కాలంలో లింగ మైనారిటీలపై హింసాత్మక ఘటనలు నాలుగున్నర శాతం పెరిగాయి.

రాజకీయ రిజర్వేషన్లు ఏవి?

రాజకీయ సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటన చేసినప్పటికీ దాని అమలును 2034 వరకూ వాయిదా వేశారు. ఇలా చేయడం ఎన్నికల సమయంలో మహిళలను మోసం చేయడమే అవుతుంది. కాగా లైంగిక మైనారిటీలు వ్యతిరేకించినప్పటికీ ట్రాన్స్‌జెండర్ చట్టాన్ని, నిబంధనలను శాసనసభలో ఆమోదించారు.



బీజేపీ నేతలూ దోషులే

మహిళలపై బీజేపీ నేతలు వేధింపులకు పాల్పడిన కేసులు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఉన్నావ్ కేసులో కుల్‌దీప్ సింగ్ సహా ఆరుగురు బీజేపీ సభ్యులకు ప్రమేయం ఉంది. ఓ చిన్నారిపై ఆటవికంగా అత్యాచారం జరిపి, హత్య చేసిన కేసులో ఏడుగురు బీజేపీ అనుబంధ వ్యక్తులు నిందితులు. గుజరాత్‌లో వెలుగు చూసిన బిల్కిస్ బానో కేసులో బీజేపీతో సంబంధమున్న ఏడుగురు వ్యక్తులు దోషులుగా తేలారు. మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతం దేశంలో పెను సంచలనమే రేపింది. వీరందరికీ బీజేపీ బాసటగా నిలిచింది. వారికి బహిరంగంగా మద్దతు తెలిపింది. పైగా వారిని ప్రశంసించింది కూడా. మణిపూర్‌లో మహిళలను బహిరంగంగా వేధించి అవమానిస్తే ప్రధాని మోడీ మౌనం వహించారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలపై లైంగిక వేధింపులు, నేరాలకు పాల్పడే దుండగులు ఎందుకు భయపడతారు?

మహిళా బిల్లుపై మోసం

మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో అంగీకారం తెలిపిన తర్వాత, ప్రజల నుండి డిమాండ్ పెరిగిన నేపథ్యంలో దానిని అమలు చేస్తానని నమ్మబలికిన తర్వాత బీజేపీ తన వైఖరిని మార్చుకుంది. అది కూడా ఎన్నికలు ముగిసిన తర్వాత. 2034 తర్వాతే బిల్లును అమలు చేస్తానని చెప్పి చివరికి ప్రజలను మోసం చేసింది.

మైనారిటీ మహిళలపై చిన్నచూపు

మైనారిటీ మహిళల హక్కులకు 'నల్సా తీర్పు' ఓకే చెప్పింది. ప్రభుత్వానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే దానిని అమలు చేయాల్సిన ప్రభుత్వం, లోక్‌సభలో బిల్లును ఆమోదించి అందుకోసం అంగీకారం పొందింది. అయితే దానికి ఇప్పటి వరకూ రాజ్యసభ ఆమోదం లభించ లేదు. మైనారిటీ మహిళలకు చెందిన సంఘాలన్నీ దీనిని వ్యతిరేకించాయి. ఎందుకంటే లింగ గుర్తింపును ప్రభుత్వ అధికారులే సరిచూడాలని అవి డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ చర్య' మైనారిటీ మహిళలను కించపరిచేలా, వారిని అణచివేసేలా ఉంది. అంతేకాక వివాహం, దత్తత, వారసత్వ ఆస్తికి సంబంధించి ఆ తరగతికి చెందిన వారికి ఉన్న హక్కులను ఈ బిల్లు తోసిపుచ్చుతోంది. మహిళలు, లైంగిక మైనారిటీల సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ వాస్తవానికి వారిని వంచిస్తోంది. వారి జీవితాలను అణచివేస్తోంది.

వారిది పురుషాధిక్య సిద్ధాంతం

బీజేపీ, సంఘ్ పరివార్ ప్రాథమికంగా పురుషాధిక్యతను కోరుకుంటాయి. అంబేద్కర్ ప్రతిపాదించిన హిందూ కోడ్ బిల్లు వంటి మహిళల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన బిల్లులను సైతం వ్యతిరేకించిన చరిత్ర వాటికి ఉంది. మహిళలు పురుషుల అధీనంలో ఉండాలని, పిల్లలను సాకడం, పెంచడమే వారి ఏకైక బాధ్యత అని అవి సిద్ధాంతీకరించాయి.

మీరు వాయిదాలు వేయొచ్చుకానీ, కాలం
మీ కోసం వాయిదాలు వేసి కూర్చోదు - బెంజిమన్ ఫ్రాంక్లిన్

వచ్చారు సరే.. తెచ్చిందేమిటి...?


సంపాదకీయం

సారొచ్చారు.. అలా వచ్చి ఇలా వెళ్లారు. త్వరలోనే ఆయన మళ్లీ వస్తారు. ఎందుకంటే ఇది ఎన్నికల సీజన్ కాబట్టి. కానీ ఆయన ఎన్నిసార్లు రాష్ట్రానికి వచ్చినా ఇప్పటిదాకా మనకేం ఇచ్చారో, భవిష్యత్‌లో ఏం ఇవ్వబోతారో చెప్పరు గాక చెప్పరు. ఎందుకంటే ఇప్పటిదాకా ఇచ్చిందే లేదు. మున్ముందు ఇవ్వబోయేది కూడా ఏమీ ఉండదు కాబట్టి. మోడీ తాజాగా మెతుకు సీమకు వచ్చారు. త్వరలో వరంగల్, వేములవాడ, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో కూడా ఆయన పర్యటించనున్నారు. ఎలక్షన్ల క్యాంపెయిన్ సందర్భంగా

> రిజర్వేషన్లకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు తీర్పులు, వివిధ కమిషన్ల సిఫారసులు, వీటన్నింటికీ మించి అత్యున్నతమైన రాజ్యాంగం, దాని దిశా నిర్దేశంలో నడిచే పార్లమెంటు... ఇలా అనేక వ్యవస్థలున్నప్పుడు వాటిని కాదని ఓట్ల కోసం ఏకోన్ముఖంగా అడ్డగోలు వ్యాఖ్యలు చేయటం ప్రధానికే చెల్లింది. ఇలాంటి టక్కుటమారా గజకర్ణ గోకర్ణ విద్యలకు చైతన్య వంతమైన తెలంగాణ సమాజం లొంగబోదనే విషయాన్ని బీజేపీ పరివారం గ్రహిస్తే మంచిది.

రాష్ట్రానికి ఆయన రావొచ్చును, పోవచ్చును, తన పార్టీ తరపున ప్రచారం చేసుకోనూ వచ్చును. కానీ గత పదేండ్ల నుంచి గద్దె మీద కూర్చున్న పార్టీగా బీజేపీ తెలంగాణకు ఏం చేసింది? ఏమిచ్చిం దనేది చెప్పటం ప్రధానిగా ఆయన కనీస బాధ్యత, ధర్మం. కానీ పొద్దున లేస్తే దేశం కోసం.. ధర్మం కోసమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో ఊదరగొట్టే ఆ పెద్ద మనిషి...తన కర్తవ్యాన్ని, బాధ్యతను విస్మరించారు. మరోసారి రాష్ట్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి రేవంత్ పైనా విమర్శలు గుప్పించేందుకే పరిమితమయ్యారు. 'ఆర్‌ఆర్ (రేవంత్ రెడ్డి) ట్యాక్స్' అంటూ సరికొత్త పదాన్ని జనం మీదికి వదిలి, తన తప్పిదాల గురించి 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ...' అనే లెవల్లో ఫోజుకొట్టారు. షరా మామూలుగా ముస్లింలకు సంబం ధించిన రిజర్వేషన్లపై మరోమారు తన అక్కసును వెళ్లగక్కటమనేది ఆ అంశంపై బీజేపీ విధానాన్ని తేటతెల్లం చేసింది.

దేశవ్యాప్తంగా ఇటీవల చర్చనీయాంశమైన అంశం ఎలక్టోరల్ బాండ్లు. ఈ రూపేణా వచ్చిన ఫండులో సగానికి (రూ.8,268 కోట్లు) పైగా కాషాయ పార్టీ ఖాతాలోకే వెళ్లాయన్నది దేశ ప్రజలందరికీ తెలిసిందే. అలా ఇవ్వని




కంపెనీలపై ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులతో దాడులు చేయించింది ఆ పార్టీ. ఈ దాడులు జరిగిన మరుసటి రోజే కమలం ఖాతాలోకి అప్పనంగా సొమ్ములొచ్చి పడ్డాయనేది ప్రజలందరికీ తెలుసు. దీన్నిబట్టే బీజేపీకి, కార్పొరేట్ సంస్థలకు మధ్య ఎంత బలమైన బంధముందో విదితమవుతున్నది. ఇలాంటి వాస్తవాలన్నింటినీ మరుగుపరిచి, మసిపూసి మారేడుకాయ చేయటం మోడీకే చెల్లింది. ఆర్‌ఆర్ ట్యాక్స్ రూపంలో హస్తం పార్టీకి కొందరు గుత్తేదారులు వెనుక దర్వాజా ద్వారా నుంచి సొమ్ములు పంపుతున్నారన్నది ఆయన మెదక్‌లో చేసిన ఆరోపణ.

ఆ రకంగా వచ్చిన డబ్బు సంచులను ఆర్‌ఆర్ ఢిల్లీకి (కాంగ్రెస్ అధిష్టానం) పంపుతున్నారనేది పీఎం వాదన. ఈ ఆరోపణలు, వాదనల గురించి మాట్లాడాల్సి వస్తే... అసలు గత పదేండ్ల నుంచి కమలం పార్టీ చేసిందేమిటి..? సంపన్నులకు, పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల మేర రాయితీలిచ్చి కార్పొరేట్ల గరిసెలను నింపింది మోడీ కాదా..? ఆర్‌ఆర్ ట్యాక్స్ అంటూ ఎద్దేవా చేస్తున్న ఆయన 'ఒకే దేశం-ఒకే పన్ను' పేరిట జీఎస్టీని తీసుకొచ్చి చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతీ సరుకు మీద పన్ను విధించింది వాస్తవం కాదా...? జీఎస్టీ ద్వారా వచ్చే పన్నులో 64 శాతం పేదలు, మధ్య తరగతి ప్రజానీకం నుంచే వసూలవుతుండగా, కేవలం మూడు శాతం మాత్రమే దేశంలోని టాప్ పది మంది ధనవంతుల నుంచి వస్తోన్నట్టు ఆక్స్‌ఫామ్ తన నివేదికలో స్పష్టం చేసింది. 'కమల నాథులు' మాత్రం దీనిపై నోరు విప్పరు గాక విప్పరు.

అదే మెదక్ సభా వేదిక నుంచి రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, హామీల గురించి ప్రస్తావించని ప్రధాని... మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు మాత్రం శతవిధాలా ప్రయత్నించారు. అసందర్భ ప్రేలాపనలాగా... 'ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను నేను బతికున్నంతకాలం ముస్లింలకు ఇవ్వబోను...' అని బల్లగుద్ది మరీ చెప్పటం దేనికి సంకేతం. ఆయన అలా చెప్పటం ద్వారా దేశ ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలిచారు...? ఆ రిజర్వేషన్లకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు తీర్పులు, వివిధ కమిషన్ల సిఫారసులు, వీటన్నింటికీ మించి అత్యున్నతమైన రాజ్యాంగం, దాని దిశా నిర్దేశంలో నడిచే పార్లమెంటు... ఇలా అనేక వ్యవస్థలున్నప్పుడు వాటిని కాదని ఓట్ల కోసం ఏకోన్ముఖంగా అడ్డగోలు వ్యాఖ్యలు చేయటం ప్రధానికే చెల్లింది.

ఇలాంటి టక్కుటమారా గజకర్ణ గోకర్ణ విద్యలకు చైతన్య వంతమైన తెలంగాణ సమాజం లొంగబోదనే విషయాన్ని బీజేపీ పరివారం గ్రహిస్తే మంచిది. సాయుధ రైతాంగ పోరాట వారసులుగా ఆ చైతన్యాన్ని మనం ఇప్పుడు ప్రదర్శించాల్సిన తరుణం ఆసన్నమైంది.

మోడీ గ్యారంటీలు - ప్రచారార్భాటం



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

18వ లోక్‌సభ ఎన్నికలు 2024 ఏప్రిల్ 19 నుంచి జూన్ 2 వరకు 7 విడతలుగా పోలింగ్ జరుగుతున్నది. తిరిగి 3వ సారి అధికారం చేపట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బీజేపీ కూటమి 'మోడీ గ్యారంటీల' పేరుతో విస్తృత ప్రచారం గావిస్తున్నది. ప్రచార, ప్రసార సాధనాలను వినియోగించడమేకాక సొంత సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారం వెగటు పుట్టిస్తున్నది. గత పదేండ్లలో జరగని కృషిని జరిగినట్లు చెప్పడంతో పాటు 2047 నాటికి 'వికసిత భారత్' ఏర్పాటు చేస్తామని చెబుతున్నది. ప్రస్తుతం దేశం 'ఆత్మ నిర్భర్ భారత్'(స్వయం పోషకత్వ దేశం)గా మారిందని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. 144 కోట్ల జనాభాలో నేటికి దారిద్ర్యరేఖకు దిగువన 30శాతం మంది ప్రజలున్నట్లు ఆర్‌బిఐ మాజీ అధ్యక్షులు రంగారాజన్ కమిషన్ చెబుతుండగా, మోడీ ప్రభుత్వం తమ పదేండ్ల పాలనలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖనుంచి ఎగువకు తెచ్చామని చెప్పింది. అదే సందర్భంలో 81 కోట్ల మందికి రానున్న ఐదేండ్లకు నెలకు 5 కిలోల చొప్పున ఉచిత ఆహార పంపిణీ చేస్తామని వాగ్దానం చేసింది. ఈ పథకం ద్వారా పరోక్షంగా దారిద్ర్యం ఉన్నట్లు అంగీ కరించడమే. బీజేపీ పాలనలో ఒకశాతం కార్పొరేట్లకు 40 శాతం దేశ సంపద పోగుబడినట్లు, 50శాతం అట్టడుగు జనాభా చేతిలో మూడు శాతం సంపద మాత్రమే ఉందని 'ఆక్స్‌ఫామ్' నివేదిక వెల్లడించింది. 2020 నాటికి దేశంలో శతకోటీశ్వరులు 102 నుంచి 1695కు పెరి గారు. దేశ ఆర్థిక సంపద కార్పొరేట్‌ల చేతులలో బందీ అయిందని చెప్పడానికి ఇంతకన్నా ఉదహరణ అవసరం లేదు. మోడీ గ్యారంటీల పేరుతో జరిగిన అభివృద్ధి పట్టికలో చూడొచ్చు.



డబుల్ ఇంజన్ సర్కార్ పేర బీజేపీ పాలిత రాష్ట్రాలలో అభివృద్ధి బాగా జరిగినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. దారిద్ర్యం, నిరుద్యోగం పెరగడమేకాక శాంతి-భద్రతల సమస్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో భాగంగా 'వాషింగ్ మిషన్' విధానాన్ని అమలు జరుపుతున్నది. అనగా వేలకోట్ల అవినీతిపరులు తమపార్టీలోకి రావడంతో వారి అవినీతి అరోపణలను తొలగించి వేస్తున్నారు. అశోక్ చౌహాన్(కార్గిల్ ఇండ్ల కుంభకోణం), అజిత్ పవార్ (రూ.25 వేల కోట్లు), నవీన్ జిందాల్ (ఎన్నికల బాండ్లు), గాలిజనార్ధన్‌రెడ్డి (వేల కోట్ల ఐరన్ ఒర్), తపస్ రాయ్, సువేందర్‌రాయ్ లాంటి 60 మందికి వాషింగ్ మిషిన్ పథకం కింద అవినీతి నేరాలను తొలగించారు. ఇప్పటికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్‌సొరేన్‌తో పాటు అనేకమంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా జైలులో పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి మధుకోడాను అక్రమ గనుల కేసులో అరెస్టు చేసి అతని భార్యను బీజేపీలో చేర్చుకుని కేసు ఉపసంహరింప జేశారు.

రాజ్యాంగ హననం

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాజేసి, ప్రథమిక హక్కులను హరించివేస్తున్నారు. 370 అర్టికల్ సవరణతో శాసన సభను రద్దు చేసి కాశ్మీర్ రాష్ట్రాన్ని, లడక్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చారు. రాష్ట్రాల పన్ను ఆదాయాన్ని తగ్గించడానికి, ముఖ్యంగా బీజేపీయేతర రాష్ట్రాల ఆధాయాన్ని దెబ్బకొట్టడానికి ఒకే పన్ను విధానం 'జిఎస్‌టి' తెచ్చింది. బ్యాంకులకు వేల కోట్లు ఎగనామం పెట్టిన కార్పొరేట్లకు తిరిగి రుణాలు ఇవ్వడానికి బ్యాంకుల సవరణ చట్టం ద్వారా 27 బ్యాంకులను 12 గ్రూపులుగా మార్చారు. అక్రమ లావాదేవిలతో అధిక ఆదాయాన్ని ప్రకటించిన అదాని కార్పొరేట్‌పై అమెరికా సంస్థ హిండెన్ బర్గ్ సంస్థ చేసిన పరిశోధనలను పార్లమెంట్‌లో చర్చించడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం రాజ్యాంగ విరుద్ధంగా కొనసాగిస్తున్నది. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే టారిఫ్, ఒకే ఛానల్ పేరుతో విద్యా విధానాన్ని, విద్యుత్‌చ్ఛక్తిని, మీడియాను కేంద్రం అదీనంలోకి తీసుకుంది. త్రిశూలం పేర ఈడి, ఐటి, సిబిఐ సంస్థలతో ప్రతిపక్షాలపై దాడులు సాగిస్తున్నది. ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది. అక్రమంగా ఉపాచట్టం కింద మేధావులను అరెస్టు చేయడమేకాక, తమకు వ్యతిరేకంగా రాసిన 60 మంది జర్నలిస్టులను హత్యలకు గురయ్యారు. న్యూస్ క్లిక్ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్తను జైళ్లో పెట్టారు. రాష్ట్రాల హక్కులను కాజేసే విధంగా రాజ్యాంగ చట్ట సవరణలు చేశారు.

పౌరసత్వ సవరణ చట్టం చేసి అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వ హక్కులు అమలు చేస్తున్నారు. ముస్లింలకు గల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్నారు. ఇప్పటికే దళిత, గిరిజన, మహిళా ఇతర మైనార్టీలపై భౌతిక దాడులకు దిగుతున్నారు.మోడీ మళ్లీ వస్తే ముస్లిం పర్సనల్‌లాను రద్దు చేయడంతో మైనార్టీలతో పాటు ఎస్సీ,ఎస్టీ, ఇతరులకు కల్పించే రిజర్వేషన్ హక్కులను కూడా రద్దు చేస్తారు. పార్లమెంట్‌ను రాజ్యాంగబద్ధంగా నిర్వహించ కుండా బిల్లులన్నీ మూజువాణి ఒటుతో అంగీకరింప చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశ కాలాన్ని సగానికి కుదించారు. మూడోసారి బీజేపీ అధికారానికి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, అధ్యక్షతరహా పాలన తేస్తామని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్నది. గవర్నర్ల వ్యవస్థ ద్వారా బీజేపీయేతర రాష్ట్రాలలోని శాసనసభలలో ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా పెండింగులో పెట్టారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ గవర్నర్ల

వివరం	2014	2024
పెట్రోల్ లీటర్	రూ.71	రూ.102
క్రూడాయిల్ బ్యారల్	దాలర్లు 113	83
దాలర్‌తో రూపాయి విలువ	రూ.62	రూ.86
వంట గ్యాస్	రూ.410	రూ.1160 (855)
దేశ రుణాలు(లక్షలకోట్లు)	రూ.55.85	రు.155.31
పెద్దనోట్ల రద్దు	రూ.1000,2000 నోట్ల రద్దు వలన 99 శాతం బ్యాకులకు నోట్లు వచ్చినప్పటికి 'బ్లాక్‌మని' రాలేదు	
ఉద్యోగాలు	యేటా రూ.2 కోట్లు ఇస్తాం, కానీ గత ప్రభుత్వ ఉద్యోగాలలో 50 శాతం కోత పెట్టారు.	
దేశ ఉద్యోగిత	18-64సం॥ల వారు 46.3 శాతం మాత్రమే. ప్రపంచంలో అతితక్కువ ఉద్యోగిత	
ధరలు	నిత్యావసరసరుకుల ధరలు పెరగడం వలన ఆకలిలో దేశం 111 వ స్థానానికి చెరింది.	
మహిళ రక్షణ చట్టం	మణిపూర్ హత్యలు, బ్రిజ్‌బూషణ్‌చే రెజ్లింగ్ క్రిడాకారులపై లైంగిక దాడులు	
అవినీతి 	రూ.16 వేల కోట్ల ఎన్నికల బాండ్లలో బీజేపీకి రూ.8250 కోట్లు వచ్చాయి. ఇచ్చిన వారికి లైసెన్స్‌లు, కాంట్రాక్ట్‌లు 'క్విడ్-ప్రోకో'గా సహకరించారు.	
ఇడీ కేసులు 	ఈడి పెట్టిన కేసులలో 0.42 శాతం మాత్రమే పరిష్కారం జరిగాయి. 140 రకాల నేరాలకు విస్తరించారు. 2014, 22 మధ్య 121 మంది రాజకీయ నాయకులలో 115 మంది ప్రతిపక్షనేతలే అరెస్టు అయ్యారు.	
ఎన్నికల్లో ధనప్రవాహం 	2024 ఏప్రిల్ 17 నాటికి దేశంలో రూ.4,600 కోట్లు పట్టుకున్నారు. సగటున రోజుకు 100 కోట్లు పట్టుకోవడం జరిగింది. పట్టుబడని డబ్బు ఇంతకు నాలుగురేట్లు ఓటర్లకు చేరవేయడానికి పాలక వరాలు ప్రయత్నిస్తున్నాయి.	

> పౌరసత్వ సవరణ చట్టం చేసి అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వ హక్కులు అమలు చేస్తున్నారు. ముస్లింలకు గల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్నారు. ఇప్పటికే దళిత, గిరిజన, మహిళా ఇతర మైనార్టీలపై భౌతిక దాడులకు దిగుతున్నారు.మోడీ మళ్లీ వస్తే ముస్లిం పర్సనల్‌లాను రద్దు చేయడంతో మైనార్టీలతో పాటు ఎస్సీ,ఎస్టీ, ఇతరులకు కల్పించే రిజర్వేషన్ హక్కులను కూడా రద్దు చేస్తారు. పార్లమెంట్‌ను రాజ్యాంగబద్ధంగా నిర్వహించకుండా బిల్లులన్నీ మూజువాణి ఒటుతో అంగీకరింపచేసుకున్నారు. పార్లమెంట్ సమావేశ కాలాన్ని సగానికి కుదించారు. మూడోసారి బీజేపీ అధికారానికి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, అధ్యక్షతరహా పాలన తేస్తామని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్నది.

వ్యవస్థలో ఎలాంటి మార్పు రాలేదు. ఎన్నికల కమిషన్ ఏర్పాటుకు ప్రధాని ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు జడ్జితో కలిసి త్రిసభ్య కమిటీ రికమండేషన్ చేయాల్సి ఉండగా సుప్రీంకోర్టు జడ్జిని తొలగించి కేంద్ర కేబినెట్ మంత్రితో త్రిసభ్య కమిటీ వేసి ప్రస్తుత ఎన్నికల కమిషన్‌ను రికమండ్ చేసి భారత అధ్యక్షునిచే ఆమోదింపజేసుకున్నారు.

ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

దేశాన్ని 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగే విధంగాను ప్రపంచంలో 3వ ఆర్థిక వ్యవస్థగాను తెస్తామని ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వ బీజేపీ నిరంతరం ప్రచారం చేస్తున్నది. ప్రపంచంలో 1వ స్థానంలో అమెరికా 26 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, 2వ స్థానంలో చైనా 17.57 ట్రిలియన్ డాలర్లతో, 4.23 ట్రిలియన్‌డాలర్లతో జర్మనీ, 4.21 ట్రి.డాలర్లతో జపాన్ దేశాలు ఉన్నాయి. ప్రస్తుత దేశ ఆర్థిక వ్యవస్థ 3.7 ట్రిలియన్ డాలర్లుతో 5వ స్థానంలో ఉంది. 3, 4 స్థానాలను అధిగమించ లేని దేశ ఆర్థిక పరిస్థితి 2వ స్థానంలోని చైనా ఆర్థిక వ్యవస్థకు చేరుకోగలమా? అయినా మోడీ ప్రభుత్వం కుహనా ఆర్థికవేత్తల ద్వారా 3వ స్థానానికి ఎదగగలమని ప్రచారం చేస్తున్నది. తలసరి ఆదాయంలో ప్రపంచంలో 120 స్థానంలో ఉన్నాం. కానీ జనాభాలో మొదటి స్థానంలో ఉన్నాం.

ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ద డానికి అంగీకరించని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద చర్యలను రెచ్చగొట్టి ప్రజలలో విభజనలు తెస్తున్నది. 5 వందల సంవత్స రాల పోరాట ఫలితంగా రామజన్మ ప్రాణప్రతిష్ట జరపడానికే వేల కోట్ల రూపాయలు వ్యయం చేసినట్లు చెబుతున్నారు. మతాల మధ్య ఘర్షణ సృష్టించి 3వ సారి గెలవడానికి ఎన్నికల గ్యారంటీలను ప్రచారం చేస్తున్నది. పదేండ్ల అనుభవం తరువాత 'మోడీ గ్యారంటీలు' అభూతకల్పనలేనన్న అభిప్రాయానికి వచ్చిన ఓటర్లు ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లువేస్తారని గమనించాలి.

విద్వేష వాక్కుల వీరంగం

పోలింగ్ ముగిసిన రెండు రోజుల తర్వాత ప్రధాన మంత్రి చేసిన పైత్యప్రకోపిత ప్రసంగం దేశంలోనూ విదేశాల్లోనూ తీవ్ర ఖండనలకు గురైంది. ముస్లింలపై ఆయన వాడిన విద్వేష భాష, అలాగే వారి పట్ల బుజ్జగింపు ధోరణి అనుసరిస్తున్నట్లుగా ఆయన ఆరోపిస్తున్న పార్టీలపై వేసిన నిందలు ఆయన గుజరాత్ రోజులను గుర్తుచేస్తున్నాయి. 2002లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న ఆయన 2002 జాతి హత్యాకాండ తర్వాత ఇదే విధమైన రెచ్చగొట్టుడుకు పాల్పడ్డారు. ఇప్పుడు ఎన్నికల పోరాటం తొలి దశలోనే మళ్లీ ఆ భాషకు దిగాలని ఆయన ఎందుకు భావించాల్సి వచ్చిందనేది ఇక్కడ కీలకంగా విశ్లేషించ వలసిన అంశం.

ఏప్రిల్ 19న 120 సీట్లకు పోలింగ్ జరిగింది. ఇందులో 40 తమిళనాడు, పాండిచ్చేరిలో వున్నాయి. వీటిలో బీజేపీకి వచ్చే సీట్లు శూన్యం. మిగిలిన వాటిలో రాజస్థాన్‌లో 12,



ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, ఉత్తరాఖండ్-మహారాష్ట్ర-అస్సాంలలో ఐదేసి చొప్పున, బీహార్‌లో 4, పశ్చిమ బెంగాల్‌లో 3, ఈశాన్యంలో 6, చత్తీస్‌గఢ్‌లో 1, జమ్ము కాశ్మీర్‌లో 1 వున్నాయి. గతసారి బీజేపీ ఈ రాష్ట్రాల్లో విజయం సాధించింది. కానీ ఈసారి ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో పరిస్థితి అంత సానుకూలంగా వున్నట్టు కనిపించడం లేదు. అదే నిజమైతే మూడో దఫా అధికారంలోకి రావాలనే ఆ పార్టీ కల కలగానే మిగిలిపోతుంది. అది నెరవేరడం అసాధ్యమవుతుంది.

తమ పట్ల పెరుగుతున్న ఈ విస్తృత నిరసన మింగుడు పడని ఫలితమే ముస్లింలపై, వారిని బుజ్జగిస్తాయని ఆరోపించే పార్టీలపై ద్వేషం మరింత పెంచిన ప్రధాని స్పందనకు కారణం. ఇది ఆయనకు అలవాటైన పాత విద్యే. రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో ఆయన చేసిన ప్రసంగం అందుకే. కొద్ది మాసాల కిందట జరిగిన ఎన్నికలలో బీజేపీకి రాజస్థాన్ మంచి విజయాన్నే అందించింది. అలాంటి చోట ఏప్రిల్ 19 తొలి దశ పోలింగ్‌లో పరిస్థితి మారడం ఇందుకు కారణమైంది. దాంతో ప్రధాని కాంగ్రెస్‌పై దురుద్దేశపూరితమైన అసత్య ప్రచారానికి దిగారు. ముస్లింలు చొరబాటుదారులనీ ఎక్కువగా పిల్లలను కంటారనీ ఆరోపిస్తూ కాంగ్రెసు సంపద కట్టబెట్టేందుకు మొదటి అవకాశం ఇస్తుందని అభాండం వేస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ మేరకు వాగ్దానం చేశారని పచ్చి అవాస్తవం చెప్పేస్తున్నారు. కాంగ్రెస్‌ను గనక ఎన్నుకుంటే హిందూ మహిళల మంగళసూత్రాలను కొల్లగట్టి అందులోని బంగారం అత్యధికంగా ముస్లింలకు ధారాదత్తం చేస్తారని ఆరోపిస్తున్నారు. ఇది హిందూ మహిళలను రెచ్చగొట్టేందుకు చేసిన ప్రయత్నం. ఇక అదే రాజస్థాన్‌లో మరో తప్పుడు ఆరోపణ తెచ్చారు. కాంగ్రెస్ వస్తే దళితులు, గిరిజనుల రిజర్వేషన్లు తీసేసి ముస్లింలకు ఇస్తారని మాట్లాడారు. తన విధానాలను వ్యతిరేకించే పేద వర్గాలలో చీలికలు పెంచే పాచికే ఇది.

బీజేపీ అధికారంలోకి రావాలంటే హిందీ రాష్ట్రాలే కీలకం. కనుక ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఇలాంటివే మరిన్ని జరుగుతాయని భావించవచ్చు. ఇప్పటికే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆ పని మొదలెట్టేశారు కూడా. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే షరాయిత్ చట్టం అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు.

ప్రధాని ప్రసంగాలు బీజేపీ నిబద్ధ ఓటర్లలో అత్యుత్సాహ పూర్వకమైన స్పందన తెచ్చాయి. ఇప్పటికిప్పుడు జరిగే ఎన్నికల్లో ప్రయోజనం కోసం తమ మౌలిక భావజాలానికి తిరిగి వెళ్లడం వారికి నచ్చింది. అంతేగాక తమ విధానాలపై పెరుగుతున్న నిరసనను ఎదుర్కోవడానికి కూడా ఇది ఉపయోగమని వారి ఆలోచన. ఆస్తుల పున:పంపిణీని, కుబేరులపై అదనపు పన్ను విధింపును కచ్చితంగా వ్యతిరేకిస్తూ ప్రధాని మాట్లాడినదానికి దేశంలోనూ వెలుపలా కార్పోరేట్ ప్రపంచంలో కొందరు కూడా ఉత్సాహపడిపోయారు. ఆర్థిక అసమానతల తగ్గింపు కోసం ఇలా చేయాలనే యోచనను ప్రధాని పూర్తిగా తోసిపుచ్చడం వారికి నచ్చింది.

ప్రధానమంత్రి మాట్లాడిన తీరుపై సీపీఐ(ఎం), ఇతర ప్రతిపక్షాలు, దీనిపై ఆందోళన చెందిన పౌరులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రజల్లో వివిధ తరగతుల మధ్య మనస్పర్థలు సృష్టించే ఈ ప్రసంగం రాజ్యాంగ విరుద్ధమని, ఎన్నికల నియమావళికి వ్యతిరేకమని తెలిపాయి. ఈ ప్రసంగంపై ఎన్నికల సంఘం మొదట ఏమీ స్పందించలేదు. తర్వాత ఫిర్యాదును అధ్యయనం చేస్తున్నట్టు చెప్పింది. ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగ బాధ్యత ఏ మేరకు నిర్వహిస్తుందనే దానిపై లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. అది ఆ విషయంలో విఫలమైతే ప్రజాస్వామ్యానికి అనర్థం. ఈ విషయంలో ఏం జరుగుతుందనేదాన్ని బట్టి ఎలక్షన్ కమిషన్ ఏ మేరకు మచ్చిక అయిందనేది తెలుసుకోవచ్చు. (ఇందులో సందేహించినట్టే ఎన్నికల కమిషన్ బీజేపీ అధ్యక్షుడు జె.పి. నడ్డాకు మాత్రమే..అది కూడా పైపై మాటలతో మొక్కు బడిగా తాఖీదు ఇచ్చి సరిపెట్టింది) మోడీ విద్వేష ప్రసంగాలు సన్నగిల్లిపోతున్న ఆ పార్టీ అవకాశాలను ఏ మేరకు మెరుగుపరుస్తాయి? అధిక ధరలు, నిరుద్యోగం, అవినీతి వంటి సమస్యలు ఓటర్లను చాలా ఆందోళన పరుస్తున్నాయని అనేక సర్వేలు చెబుతున్నాయి. నిజంగా అదే నిజమైతే వారిని పక్కదోవ పట్టించే ఇలాంటి తంతాలు వృధానే అవుతాయి. అయినా అవి ఖండనపాత్రమే.

(ఏప్రిల్ 24 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ప్రకృతి క్షేత్రం

"అమ్మా నేనెవరికి పుట్టాను?"
"నేను వేశ్యను నాయనా"
"మళ్ళీ అడుగుతున్నా;
నా తండ్రి ఎవరు?"
"ఎలా చెప్పగలను తండ్రీ...
ఆకలి నా అవసరం
మృగకామం వాడి అవసరం
అవసరానికి కులం ఏమిటి?
మతం ఏమిటి?
అవసరం అవసరమే
ఏ రేణువు కారణమో
ఎలా చెప్పగలను తండ్రీ..!"
"భయపడకమ్మా
నేను పరశురాముడ్ని కాను
ఈ కాలపు కొడుకును
కడవరకు నిన్ను కాసుకుంటా..
నవ మాసాలు మోసావు
పాలిచ్చి పెంచావు
ఈ జన్మకు జీవితానికి
సాక్షిగా నన్ను నిలిపావు"
"ధన్యుడిని తండ్రీ
గుర్తించావు
ఆకలికి కామానికి
తండ్రి గొడవెందుకు నాయనా?
మళ్ళీ మళ్ళీ చెబుతున్నా...
నీ జన్మ స్థానం
కుల మతాతీతమైన
ప్రకృతి క్షేత్రం.
తల్లి వాస్తవం
తండ్రి నమ్మకం
జన్మ జన్మల రహస్యం
ఇదేకద నాయనా..!"

-కె. శాంతారావు
9959745723

దేశ భవిష్యత్తుకు ఓ.. హెచ్చరిక



ఎన్ అజయ్ కుమార్

అక్కడ జరుగుతున్న సభ నక్సల్స్‌ది కాదు, పాకిస్తాన్ నుంచి అక్రమంగా చొరబడిన టెర్రరిస్టులది అంతకన్నా కాదు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు రచిస్తున్న ప్రణాళిక కూడా కానే కాదు. ఎక్కడో ఆడవి లోనో, రహస్య ప్రదేశంలో పెట్టుకున్న సమావేశం కూడా కాదు. దేశంలో అంతరిస్తున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవాలనే ధృడ సంకల్పంతో కలాలు, గళాలు ఒక్కటైన వేళ.. వరంగల్ నగరం నడిబొడ్డున కాకతీయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసుకున్న 'సమూహ' లౌకిక వేదికది. దేశాన్ని మనువాదంతో పాలించాలనుకునే ఆరెస్సెస్ పరివారానికి చెందిన ఏబీవీపీ ఈ సభపై దాడి చేయడం హేయమైన చర్య. దేశంలో ఇలాంటి దారుణాలు, మారణహోమాలు, విద్వేషపూరిత ఘర్షణలు జరగకుండా ఉండేందుకు, సమాజంలో లౌకిక స్ఫూర్తిని పెంపొందించే దృక్పథంతో అభిప్రాయాల్ని పంచుకుంటున్న సభపైనే ఈ దాడి జరగడం అత్యంత శోచనీయం. ఇలాంటి ఘటనలు చూస్తుంటే దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? లేదా అనే అనుమానం కలుగుతున్నది. సగటు మనిషిగా హృదయం ఆవేదనతో రగిలిపోతున్నది.

దేశాన్ని మనువాదంతో పాలించాలను కుంటున్న బీజేపీకి ఇలాంటి సభలు, సమావేశాలు రుచిం చడం లేదు. 'సమూహ' సభపై జరిగిన దాడే కాదు, ఇటీవల హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ లో కూడా ప్రగతిశీల భావాలు గల కార్యకర్తలపై ఏబీవీపీ నాయకులు దాడికి పూనుకున్నారు. ఈ మధ్య అక్కడ జరిగిన ఎన్నికల్లో ఏబీవీపీపై ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించిన విషయం విదితమే. సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం సందర్భంగా వాల్‌పోస్టర్లు, బ్యానర్లు కడుతున్న కార్యకర్తలపై ఇలాగే ఘర్షణకు దిగారు. వారిపై కట్టెలతో దాడి చేయడంతో ఒకరి తలపగిలి ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది.ఇలాంటి ఘటనలు మొదలు కాదు, ముగింపు కాదు. నిత్యం ఏదోఓ చోట జరుగుతున్నవే. గతేడాది భారత నాస్తిక సమాజం అధ్యక్షుడు బైరి నరేష్‌పైన కూడా ఇలాంటి దాడే జరిగింది.

నిజామా బాద్ జిల్లా కోటగిరిలో ఓ ఉపాధ్యాయుడు గణేష్ చందా ఇవ్వనందుకు హిందూ దేవతల్ని అవమానిం చాడని కొంత మంది విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఆందోళన చేసి అతన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో క్షమాపణ చెప్పించారు. ఇలా బీజేపీ-ఆరెస్సెస్ అనుబంధ సంఘాలైన ఏబీవీపీ, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, రెచ్చిపోయి దాడులకు తెగబడటం, తద్వారా ఘర్షణా పూరిత వాతావరాణాన్ని నెలకొల్పి ఉద్వేగాలను రెచ్చగొట్టడం పరిపాటిగా మారింది. దీన్ని అడ్డుకట్ట వేసేందుకు వారి నాయకత్వం చొరవ తీసుకోకపోవడం చూస్తుంటే హింసను ప్రేరేపించ డంలో భాగమే ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తోందనే అభిప్రాయానికి రావాల్సి వస్తున్నది.

'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో 'లౌకిక విలువలు-సాహిత్యం' అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సుపై వ్యూహాత్మకంగానే దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఈ సదస్సుకు సంబంధించి చాలా రోజుల ముందు నుంచే కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, సోషల్ మీడియాలో ప్రచా రం జరిగింది. సెనెట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పలు జిల్లాల నుంచి లౌకిక వాదాన్ని బలపరిచే మేధావులు, విద్యావంతులు, కవులు, రచయితలు హాజరయ్యారు. వారంతా



> భిన్నభిప్రాయాలు కలిగి ఉండేదే ప్రజాస్వామ్యం. విమర్శల్ని స్వీకరించి పాలనలోని లోపాలను సరిచేసుకోవాల్సిన బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రశ్నించేవారిని వేధిస్తున్నది. ఉపా చట్టం కింద నిర్బంధి స్తున్నది. చాలామందిని హతమారుస్తుననది. నిలదీసే వారిని దేశద్రోహులుగా ముద్రవేసి ప్రజాస్వామ్యపు గొంతు నులిమేస్తున్నది. వారి ఆగడాలకు, దుశ్చర్యలకు ఎవరూ అతీతులు కాదు. జర్నలిస్టులు, పౌర హక్కుల నాయకులు, ప్రొఫెసర్లు, రైటర్స్ అందరూ బాధితులే. వారి బారినపడి జైళ్లలో మగ్గుతున్నవారే. మరి ఇలాంటి దారుణ ఘటనలు జరుగుతుంటే ప్రజలు ఎంతకాలమని భరిస్తారు? ప్రశ్నకు సమాధానం, సమస్యకు పరిష్కారం కూడా దొరకని ఈ రాజ్యంలో ఎంతకాలం స్వేచ్ఛను కోల్పోతారు? ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే దేశంలో మతోన్మాదులు ఆ విలువల్ని నడిరోడ్డుపై గొయ్యితీసి పాతరేస్తుంటే ప్రజాస్వామ్యానికి ఇక దిక్కెవరు?

రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణకు చేయాల్సిన కృషిపై ప్రసంగిస్తుండగా అడ్డుకుని దాడిచేశారు. బ్యానర్లు, ఫ్లెక్సీలు చింపివేశారు. డాక్టర్ పసునూరి రవీందర్‌తో సహా ముగ్గురు కవులకు గాయాలయ్యాయి. ఇలాంటి భౌతికదాడులు ఒకప్పుడు రాజకీయ పార్టీల్లోనే కనిపించేవి. కానీ బీజేపీ మతోన్మాద అరాచక పాలనపై సాహిత్యం ఉద్యమిస్తూ, సామాన్యులను కూడా ఆలోచింపజేస్తున్న తరుణంలో కవులు, రచయితల సభలపైన మనువాద మూక దాడులు పెరిగాయి.

భిన్నభిప్రాయాలు కలిగి ఉండేదే ప్రజాస్వామ్యం. విమర్శల్ని స్వీకరించి పాలనలోని లోపాలను సరిచేసుకోవాల్సిన బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రశ్నించేవారిని వేధిస్తున్నది. ఉపా చట్టం కింద నిర్బంధి స్తున్నది. చాలామందిని హతమారు స్తుననది. నిలదీసే వారిని దేశ ద్రోహులుగా ముద్రవేసి ప్రజాస్వామ్య పు గొంతు నులిమేస్తున్నది. వారి ఆగడాలకు, దుశ్చర్యలకు ఎవరూ అతీతులు కాదు. జర్నలిస్టులు, పౌర హక్కుల నాయకులు, ప్రొఫెసర్లు, రైటర్స్ అందరూ బాధితులే. వారి బారినపడి జైళ్లలో మగ్గుతున్నవారే.

మరి ఇలాంటి దారుణ ఘటనలు జరుగుతుంటే ప్రజలు ఎంతకాలమని భరిస్తారు? ప్రశ్నకు సమాధానం, సమస్యకు పరిష్కారం కూడా దొరకని ఈ రాజ్యంలో ఎంతకాలం స్వేచ్ఛను కోల్పోతారు? ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే దేశంలో మతోన్మాదులు ఆ విలువల్ని నడిరోడ్డుపై గొయ్యితీసి పాతరేస్తుంటే ప్రజాస్వామ్యానికి ఇక దిక్కెవరు?

ఈనెల 13న ప్రజల కర్తవ్యమేంటో ఈ ఘటనల తర్వాతనైనా స్పష్టమవ్వాలి. భారత రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని ప్రజల నెత్తిన రుద్దేందుకే ఈ చర్యలన్నీ దారితీస్తాయి. 'సమూహ' పై దాడి కూడా దాన్లో భాగమే.

ప్రజాయుద్ధంలో ఎర్రజెండాదే విజయం

- ఓ పక్క ధనబలం.. మరోపక్క ప్రజాబలం : సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

భువనగిరి పార్లమెంటు పరిధిలో జరుగుతున్న ఎన్నికలలో ఒకపక్క ధన బలంతో వస్తున్న అభ్యర్థులకు.. మరోపక్క ప్రజాబలంతో వస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థికి జరుగుతున్న యుద్ధంలో ప్రజలు ఎర్రజెండానే ఎగరవేస్తారని రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో బుధవారం సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. కాలుష్యం కొరత నుంచి గ్రామాలను కాపాడుకోవాలంటే ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, కో ఆప్షన్ ఎస్.కె మదర్, నాయకులు చీరిక సంజీవరెడ్డి, బోయ యాదయ్య, అంతటి అశోక్, రత్నం శ్రీకాంత్, సిద్ధగోని శ్రీకాంత్, గుడ్డేటి నరసింహ, మీసాల లింగయ్య, కడగంచి రాజేష్, నందగిరి వెంకటేష్, నక్క లింగస్వామి, చీరక అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి ఇంద్రకరణ్‌రెడ్డి

- కండువా కప్పిన దీపాదాస్ మున్షీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన కాంగ్రెస్ గూటికి చేరారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా లేఖ ఇచ్చిన ఆయన...హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయనకు దీపాదాస్ మున్షీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.సీఎం రేవంత్ సమక్షంలో వనస్థలిపురం బీజేపీ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. డాక్టర్ వెన్నెల అశోక్, సంచార జాతుల కులాలకు చెందిన ముఖ్యనాయకులు కూడా చేరారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రక్తంతో తడిసిందే ఎర్రజెండా

బీజేపీ గెలిస్తే లేబర్ కోడ్‌లు అమలు.. కార్మిక వర్గానికి బానిసత్వమే

- కార్పొరేట్ అనుకూల మతోన్మాద బీజేపీని ఓడిద్దాం
- రాజ్యాంగ రక్షణకు ఇండియా కూటమిని బలపరుద్దాం
- బీజేపీ ఒక్క సీటూ గెలవకుండా చూసే బాధ్యత రేవంత్‌రెడ్డిదే : సంగారెడ్డి మేడే సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కార్పొరేట్ అనుకూల విధానాలతో, మతోన్మాద పోకడలతో దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ కోసం ఇండియా కూటమిని బలపర్చాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వేలాది మంది కార్మికులు ఎర్రచొక్కాలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బహిరంగ సభకు చుక్కరాములు హాజరై మాట్లాడారు. పోరాటాల త్యాగ ఫలితమే 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చిందన్నారు. లక్షలాది మంది కార్మికులు శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడి చిందించిన రక్తంలో తడిసిందే ఎర్రజెండా అని తెలిపారు. 1917లో రష్యాలో సోషలిజం వచ్చాకే 8 గంటల పని విధానం ప్రపంచ వ్యాప్తంగా అమల్లోకి వచ్చిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 29 రకాల కార్మిక చట్టాల్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయాలని చూశారన్నారు. కార్మికవర్గం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాడిన ఫలితంగా లేబర్‌కోడ్‌ల అమలు నిలిచిపోయిందన్నారు. మళ్లీ బీజేపీ గెలిస్తే ఆ నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేస్తారని, అదే జరిగితే కార్మిక లోకం బానిసత్వంలోకి నెట్టబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు పెంచాలని కార్మికులు పోరాడుతుంటే ప్రధాని మోడీ మాత్రం రోజుకు రూ.178తో బతకాలంటూ చెబుతున్నారంటే ఆయన శ్రమకు ఇస్తున్న విలువ ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. దేశమంటే ఆ నలుగురుగా మారిందన్నారు. మోడీ, అమిత్‌షా అమ్మేవాళ్లుగా.. అదానీ, అంబానీ కొనేవాళ్లుగా మారారని చెప్పారు. దేశంలో 44 కోట్ల మంది కార్మికులుండగా కేవలం 7 శాతం మందే యూనియన్లు పెట్టుకుని హక్కులు పొందుతున్నారన్నారు. మిగతా వాళ్లంతా అసంఘటితంగా దుర్భర జీవితాల్లో మగ్గుతున్నారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిందని, పదేండ్ల కాలంలో 20 కోట్ల ఉద్యోగాల్ని ఇచ్చారా.. అని ప్రశ్నించారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలంటూ మోడీ రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మత ప్రాతిపదికన మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చిపెట్టి సమాజాన్ని మళ్లీ బానిసత్వంలోకి నెట్టేందుకు మోడీత్రయం ప్రయత్నిస్తుందన్నారు. ప్రజా స్వామ్యం, లౌకిక విధానం, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుకునేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని బలపర్చాల్సిన అవసరం కార్మికవర్గానికి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవకుండా చూడాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. సభకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.బాగారెడ్డి అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, వివిధ యూనియన్ల నాయకులు ప్రసన్నరావు, రాందాస్, రమేష్, ప్రవీణ్, బాల్‌రాజ్, లక్ష్మీకాంత్ గౌడ్, జరీనా, సువర్ణ, శోభ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రామికవర్గం పట్ల మోడీ అమానవీయత

- రాష్ట్ర సాధనలో కార్మికుల పాత్ర కీలకం
- వారిని అదుకున్న చరిత్ర బీఆర్ఎస్ దే : వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్ లో ఘనంగా మేడే వేడుకలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సాధనలో కార్మికుల పాత్ర కీలకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. మేడే సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్మికులను ఆదుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దేనని ఆయన తెలిపారు. ఉద్యమ సమయంలోనూ ముంబయి, దుబాయ్, బొగ్గుబాయి అంటూ కార్మికుల కష్టాలను కేసీఆర్ గుర్తించారని చెప్పారు. కరోనా సమయంలో కార్మికులు సొంత స్థలాలకు వెళ్లేందుకు రైళ్లు పెట్టకుండా ప్రధాని మోడీ అమానవీయంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఒక్కో కార్మికునికి రూ.500 ఇచ్చి, భోజనం పెట్టి, ఉచిత రైలు సౌకర్యాలను కేసీఆర్ కల్పించారని గుర్తుచేశారు. కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరించిన బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ప్రధాని మోడీ సెస్ ల పేరుతో ప్రజల నుంచి రూ.30 లక్షల కోట్లు వసూలు చేసి అందులో రూ.14 లక్షల కోట్ల రూపాయలతో పెద్ద పారిశ్రామికవేత్తల రుణమాఫీ చేశారని విమర్శించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని మాత్రం వ్యతిరేకించారని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికులను అనేక రకాలుగా ఆదుకున్నామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా 73 శాతం జీతం పెంచినట్టు తెలిపారు. 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులున్నా... వారికి ఫించన్ ఇచ్చింది ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. యాదగిరిగుట్ట నిర్మించినా రాజకీయాలకు తాము మతాన్ని వాడుకోలేదని స్పష్టం చేశారు. చేనేత కార్మికులు, బీడీ కార్మికులకు జీఎస్టీ వేసిన మొదటి సర్కార్ బీజేపియేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ వచ్చాక చేనేత కార్మికులకు చీరల ఆర్డర్లు బంద్ పెట్టి వారిని ఆత్మహత్యల వైపునకు నెట్టారని విమర్శించారు.

ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లను ఆదుకోకపోవడంతో 50 మంది ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఎంపీ సీట్ల పంపిణీలో సామాజిక న్యాయం పాటించినట్టు కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించబడాలంటే బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరముందని తెలిపారు. కార్మికులు, ఆటో డ్రైవర్లు బీఆర్ఎస్ వెంట ఉంటే 12 సీట్లు రావటం కష్టం కాదని చెప్పారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం కాకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటుందన్నారు. గోదావరి నీరు దారి మళ్లకుండా, రిజర్వేషన్లు రద్దు కాకుండా కాపాడేందుకు బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

వాామ్మో..

- గూడపూర్‌లో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఈ ఏడాది ఇదే అత్యధికం
- మే మొదటి వారంలోనే 47కు చేరువలో
- సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రోహిణికార్తెకు 24 రోజుల ముందు నుంచే రోకళ్లు పగిలేలా ఎండలు కొడుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని మొదలుపెట్టి మధ్యాహ్నానికి తన చండప్రచండాన్ని చూపుతున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెల తొలిరోజే రికార్డు స్థాయిలో నల్లగొండ జిల్లా గూడపూర్‌లో అత్యధికంగా 46.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది మే 27న 46.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో మే నెలలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని ఐఎమ్‌డీ హెచ్చరించింది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే సూచనలున్నాయి. వారం పాటు వడగాల్పులు తీవ్ర స్థాయిలో వీచే అవకాశముందని హెచ్చరించింది. 15 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబ్‌నగర్, ములుగు, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. ఆ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది.

గూడపూర్ (నల్లగొండ)	46.6 డిగ్రీలు
చండూర్(నల్లగొండ)	46.5 డిగ్రీలు
ములుగు	46.5 డిగ్రీలు
భద్రాచలం(భద్రాద్రి కొత్తగూడెం)	46.5 డిగ్రీలు
మునగాల(సూర్యాపేట)	46.5 డిగ్రీలు
వైరా(ఖమ్మం)	46.5 డిగ్రీలు
ముత్తారం(పెద్దపల్లి)	46.4 డిగ్రీలు
తిమ్మాపూర్(నల్లగొండ)	46.4 డిగ్రీలు
ఖానాపూర్‌పీఎస్(ఖమ్మం)	46.4 డిగ్రీలు
వెల్గటూరు(జగిత్యాల)	46.4 డిగ్రీలు

వరంగల్, ఖమ్మం ఘటనలపై
సుమోటోగా కేసుల నమోదు

- విచారణకు టీఎస్ఎంసీ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్ఎంపీలు చేసిన వైద్యం వికటించిన ఘటనలపై తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) సీరియస్ అయింది. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా కేసులు నమోదు చేసింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో గంట వ్యవధిలో 7 ఇంజెక్షన్లను ఆర్ఎంపీ అడెపు శ్రీనివాస్ ఇవ్వడంతో కత్తి నవీన్ చనిపోయాడన్న కథనంపై విచారించి నివేదిక సమర్పించాలని వరంగల్ జిల్లా లీగల్ అండ్ యాంటీ క్వాకరీ సభ్యులను కోరింది. ఖమ్మం నగరంలో ఆర్ఎంపీ అబ్దుల్ హమీద్ 6 ఏండ్ల బాలునికి సున్తీ చేసే క్రమంలో మర్మాంగాన్ని కోసేసిన ఘటనను కూడా సుమోటో కింద కేసు నమోదు చేసింది. ఈ ఘటనపై విచారించి నివేదిక సమర్పించాలని ఖమ్మం లీగల్ అండ్ యాంటీ క్వాకరీ సభ్యులను కోరింది.

కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలు ఉధృతం చేద్దాం

- కనీస మద్దతు ధరల చట్టం కోసం దేశవ్యాప్త ఉద్యమాలు : వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ - ముషీరాబాద్



కార్మిక, కర్షక చట్టాలను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపే వరకు వ్యవసాయ, కార్మిక, రైతాంగ ఉద్యమాలను దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కార్యాలయంలో మే డే సందర్భంగా బుధవారం పతాకావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకొస్తానని మోడీ హామీ ఇచ్చి మోసం చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాల అమలుకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత విధించారని.. చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఐక్యంగా నిర్వహిస్తోందని తెలిపారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని సాధించడానికి దేశవ్యాప్త ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. మోడీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగంలో కల్పించిన ప్రజాతంత్ర హక్కులను, చట్టాలను ఎత్తివేసే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రిజర్వేషన్లను ఎత్తేస్తామని బీజేపీ నేతలు రెచ్చగొట్టే చర్యలకు పూనుకుంటున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా.. పంటలను కొనకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు పెరగకపోవడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. కార్పొరేట్ అనుకూల మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మే డే స్ఫూర్తితో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, అరిబండి ప్రసాద్ రావు, నాయకులు టి.కిషోర్, ఆర్.రాహుల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బొప్పని పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ .ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 9న ఆఫ్‌లైన్‌లో గ్రూప్స్-1 ప్రిలిమ్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్ష జూన్ తొమ్మిదిన ఆఫ్‌లైన్ విధానంలో జరగనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓఎంఆర్ విధానంలో రాతపరీక్ష ఉంటుందని, అభ్యర్థులు దీన్ని గమనించాలని కోరారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1కు 4.03 లక్షల దరఖాస్తులొచ్చాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన, మెయిన్స్ రాతపరీక్షను అక్టోబర్ 21న నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

వడదెబ్బతో చనిపోలేదు

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వడదెబ్బతో ముగ్గురి మతి శీర్షికన నవతెలంగాణ బుధవారం ప్రచురించిన వార్తకు వైద్యారోగ్యశాఖ స్పందించింది. ఈ మేరకు బుధవారం ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీ ఆర్.వీ.కర్ణన్ రిజాయిండర్ పంపించారు. అంబాల ఐలమ్మ (63 ఏండ్లు, కరీంనగర్ జిల్లా), కడావత్ హిరి (65 ఏండ్లు, కామారెడ్డి) లు మయోకార్డియల్ ఇన్ఫ్రాక్షన్‌తో మరణించినట్టు తెలిపారు.

సీఎం రేవంత్‌పై ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ తదితరులు బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం హాస్టల్ చీఫ్ వార్డెన్ సర్క్యులర్‌ను ఫోర్జరీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు ఈసీకి విజ్ఞప్తి చేశారు

మచ్చ లేని మనిషి మన వెంకట్రామిరెడ్డి

- మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రచారం



నవ తెలంగాణ-సిద్దిపేట

మచ్చ లేని మనిషి వెంకట్రామిరెడ్డి అని, ఇలాంటి మంచి మనసున్న వారిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వెంకట్రామిరెడ్డికి అడుగడుగున ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు.బీజేపీ,బీఆర్ఎస్‌పై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని,గతంలో దుబ్బాక నుంచి ఫేక్ వీడియోలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించారని గుర్తు చేశారు.అందరూ ఆస్తులు సంపాదించు కోవాలనుకుంటే అతను ఆస్తి పంచి పెట్టేలా ట్రస్టు ఏర్పాటుచేసి ప్రజలను ఆదుకోవడానికి కృషి చేస్తున్నారని అన్నారు.బీజేపీ చేసే అబద్ధాలు, గ్లోబల్ వీడియోలు నమ్మి ప్రజలు మోస పోవద్దన్నారు. కేసీఆర్ కోరిక మేరకు వెంకట్రామిరెడ్డి పోటీకి నిలిచారని, కేవలం ప్రజలకు సేవ చేయడానికే వచ్చారని అన్నారు. అంతకు ముందు కోమటి చెరువు, గోకుల్ చాయ్ టీ పాయింట్ వద్ద, ఇతర వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజనర్సు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



చెపాక్‌లో చెన్నైకి చెక్

- సూపర్‌కింగ్స్‌పై పంజాబ్ గెలుపు
- చెన్నై 162/7, పంజాబ్ 163/3

నవతెలంగాణ-చెన్నై

చెన్నై సూపర్‌కింగ్స్ కంచుకోట చెపాక్‌లో ఆ జట్టుకు వరుసగా రెండో మ్యాచ్‌లో షాక్. పంజాబ్ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో సూపర్‌కింగ్స్‌పై అలవోక విజయం సాధించింది. తొలుత బౌలర్లు విజృంభించగా.. స్వల్ప లక్ష్యాన్ని బ్యాటర్లు ఊదేశారు. 163 పరుగుల ఛేదనలో ఓపెనర్ జానీ బెయిర్‌స్టో (46, 30 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), శశాంక్ సింగ్ (25 నాటౌట్, 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), శామ్ కరణ్ (26 నాటౌట్, 20 బంతుల్లో 3 ఫోర్లు) కదం తొక్కగా 17.5 ఓవర్లలోనే పంజాబ్ కింగ్స్ లాంఛనం ముగించింది. అంతకుముందు, రుతురాజ్ గైక్వాడ్ (62, 48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో హర్‌ప్రీత్ బరార్ (2/17), రాహుల్ చాహర్ (2/16) రెండేసి వికెట్లతో మెరిశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్‌కు ఓపెనర్లు మంచి ఆరంభమే అందించారు. పంజాబ్ బౌలర్లు క్రమశిక్షణతో బంతులేయగా రన్‌రేట్ సాధారణంగా ఉన్నప్పటికీ ఓపెనర్లు 64 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడిన రహానె నిష్క్రమణతో సూపర్‌కింగ్స్ పతనం మొదలైంది. శివం దూబె (0), రవీంద్ర జడేజా (2) స్వల్ప వ్యవధిలో అవుట్ కావటంతో సూపర్‌కింగ్స్ రన్‌రేట్ పడిపోయింది. సమీర్ రిజ్వీ (21) నెమ్మదిగా ఆడగా..మోయిన్ అలీ (15) దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. చివర్లో ఎం.ఎస్ ధోని (14) ఓ ఫోర్, సిక్సర్‌తో



రాయల్స్‌తో రైజర్స్ ఢీ

రసవత్తర పోరుకు ఉప్పల్ సిద్ధం



హైదరాబాద్ : ఐపీఎల్ 17వ సీజన్‌లో అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్‌తో అత్యుత్తమ బౌలింగ్ లైనప్ తలపడేందుకు రంగం సిద్ధమైంది. పదునైన పేస్‌తో రాజస్థాన్ రాయల్స్ ఇప్పటికే ప్లే ఆఫ్స్‌లో స్థానం ఖాయం చేసుకోగా.. రికార్డు స్కోర్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసులో ముందంజలో కొనసాగుతుంది. గత రెండు మ్యాచుల్లో ఛేదనలో చతికిల పడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి కీలకం కాగా.. ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్‌పై విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. సంజు శాంసన్ సారథ్యంలో రాజస్థాన్ రాయల్స్ జోరుమీదుంది. జైస్వాల్, బట్లర్, శాంసన్ సహా పరాగ్ మంచి ఫామ్‌లో ఉన్నారు. ట్రెంట్ బౌల్ట్ నేతృత్వంలోని బౌలింగ్ దళం ప్రమాదకరంగా మారింది. రాయల్స్, రైజర్స్ మ్యాచ్‌కు ఉప్పల్‌లో పరుగుల పిచ్ సిద్ధంగా ఉంది.

బోపన్న జోడీ ఓటమి

మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్



మాడ్రిడ్ : టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్), మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి మాడ్రిడ్ ఓపెన్‌లో షాక్ తగిలింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లోనే అగ్ర జోడీ పరాజయం పాలైంది. ఒక గంట 17 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో 6-7(4-7), 5-7తో వరుస సెట్లలోనే బోపన్న జోడీ నిరాశపరిచింది. స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ మెన్స్ సింగిల్స్‌లో టైటిల్ వేటకు దూరమయ్యాడు. చెక్ ఆటగాడు జిరి చేతిలో 5-7, 4-6తో వరుస సెట్లలో ఓటమి పాలైన నాదల్.. స్పానిశ్ టోర్నీలో చివరి మ్యాచ్ ఆడేసి అభిమానులకు భావోద్వేగ వీడ్కోలు పలికాడు.

ఇండోనేషియాదే పైచేయి

1-4తో ఓడిన టీమ్ ఇండియా



చెంగ్డూ (చైనా): థామస్ కప్ ఫైనల్స్‌లో టీమ్ ఇండియా తొలి ఓటమి చవిచూసింది. గ్రూప్-సిలో వరుసగా రెండు మ్యాచుల్లో ఎదురులేని విజయాలు సాధించి క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్న భారత్.. గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో ఓటమి పాలైంది. అగ్రజట్టు ఇండోనేషియా చేతిలో 1-4తో నిరాశపరిచింది. తొలి మ్యాచ్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ 13-21, 21-12, 21-12తో శుభారంభం అందించినా.. లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ జోడీ, కపిల, సాయిప్రతీక్ సహా కిదాంబి శ్రీకాంత్ వరుస మ్యాచుల్లో చేతులెత్తేశారు. గ్రూప్-సిలో అగ్రస్థానంతో ఇండోనేషియా, రెండో స్థానంతో భారత్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

కుల, మత వైషమ్యాలు పెంచే కుట్ర



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్మిక, ఉద్యోగ, ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తోన్న మతోన్మాద బీజేపీని ఓడించడమే అమరులైన కార్మికయోధులకు ఇచ్చే నిజమైన నివాళి అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మేడే సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని నవతెలంగాణ ప్రధాన కార్యాలయమైన ఎం.హెచ్.భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఉద్యోగి సత్యం జెండావిష్కరణ చేశారు. సీజీఎం పీ.ప్రభాకర్, నవతెలంగాణ బుక్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేశ్‌తో పాటు వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, పలువురు సిబ్బంది హాజరయ్యారు. అనంతరం పత్రికా సంపాదకులు ఆర్.సుధాభాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో భాస్కర్ మేడే సందేశాన్నిచ్చారు. బీజేపీని ఓడించే శక్తులకు మద్దతునివ్వాలని కోరారు. వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పోరాటాలు ఒక్కటిగా నిలవాలని అభిప్రాయపడ్డారు.

పెట్టుబడిదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ కార్మిక వర్గాన్ని దోపిడీ, పీడన, అణచివేత నుంచి విముక్తి చేసిన రోజు మేడే అని అభివర్ణించారు. అది కార్మికవర్గ ఐక్యతకు సంకేతంగా తెగింపును, స్ఫూర్తినిచ్చిన రోజని గుర్తుచేశారు. నిర్దిష్ట పని గంటల విధానం లేకుండా రోజుకు 16 నుంచి 20 గంటల వరకు కార్మికులతో పని చేయించుకుంటూ యాజమాన్యాలు సుఖపడుతున్న కాలంలో మేడే కార్మికుల హక్కులను సాధించిందని గుర్తుచేశారు. కార్మికులు తమ హక్కులను గుర్తించకుండా బీజేపీ ఉద్దేశపూర్వకంగా మేడేకు - భారతదేశానికి సంబంధం లేదంటూ విశ్వకర్మ జయంతిని కార్మిక దినోత్సవంగా ముందుకు తెచ్చిందని తెలిపారు. ప్రపంచ కార్మికులు హక్కులు సాధించుకున్న రోజును కూడా మసిబూసి మారేడుకాయ చేయజూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ప్రధాని మోడీ పాలనలో 1886 మేడేకు ముందున్న పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని తెలిపారు. కార్పొరేట్ శక్తుల కోసం కార్మికులను బానిసలను చేసేందుకు చూస్తున్నారని హెచ్చరించారు. ఈ విషయాలు కార్మికులకు అర్థమవుతున్నా ప్రతిఘటన రాకుండా ఉండేందుకు మతం, కులం, సంస్కృతి పేరుతో కార్మికవర్గంలో విచ్ఛిన్నకర అంశాలను జొప్పిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో పాలకవర్గాల విధానాలు, రాజకీయాలను అర్థం చేసుకోవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను మరింత మెరుగ్గా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ విషయంలో నవతెలంగాణ కీలక పాత్ర పోషిస్తున్నదని అభినందించారు.సీజీఎం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశం అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మతమౌఢ్యం, కుల దురహంకారం పెచ్చరిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల దైనందిన సమస్యలను బీజేపీ పక్కదోవ పట్టిస్తోందనీ, వాటి స్థానంలో గుడి, రిజర్వేషన్లు అంటూ ఆ పార్టీ పెద్దలు మాట్లాడటం శోచనీయమని అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గం మరింత చైతన్యంతో వ్యవహరించాలనీ, వారిని చైతన్యపరచటంలో నవతెలంగాణ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ బుక్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సంపద సృష్టికర్తలు అదానీ, అంబానీలంటూ చెబుతున్నారని గుర్తుచేశారు. సంపదను సృష్టించేది వారే అయితే వారంలో 72 గంటలు వారితోనే చేయిస్తే సరిపోతుంది కదా...? అని ప్రశ్నించారు. భారతదేశం ప్రస్తుతం ప్రధానంగా సాంస్కృతిక సమస్యను ఎదుర్కొంటున్నదని తెలిపారు. నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్ మాట్లాడుతూ ఇప్పటికీ మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగులు తప్ప కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో రోజుకు 12 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు.


ఐటీ రంగంలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు సాధించుకున్న చట్టాలను మారుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దఫా ఎన్నికల్లో బీజేపీ ఓడినా... మతోన్మాదులతో పోరాటం మిగిలే ఉంటుందని స్పష్టం చేశారు.

బెదిరించడం కాదు...

సమాధానం చెప్పండి

- 400 సీట్లు అడగడంలోనే ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్ర కోణం దాగి ఉంది
- వందేండ్లలో హిందూ రాజ్యం, రిజర్వేషన్ల రద్దు మీ లక్ష్యం కాదా?
- రాజ్యాంగ సమీక్షపై వాజ్‌పేయ్ జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ నియమించలేదా?
- 8 రాష్ట్రాల్లో ప్రతిపక్షాలనే మాయం చేసి బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేదా?
- కమలానికి మీరేసే ప్రతి ఓటు రిజర్వేషన్ల రద్దుకే ఉపయోగం
- వీటిపై చర్చ కోసమే సభల్లో మాట్లాడుతున్నా.
- ఇందులో మార్ఫింగ్ చేయాల్సిన అవసరం లేదు
- రిజర్వేషన్ల రద్దుపై గోల్వాల్కర్, ఎన్జీ వైద్య వ్యాసాలు రాశారు...
- సుమిత్రా మహాజన్, కేంద్ర మంత్రులు మాట్లాడారు

మోడీ, అమిత్‌షాకు సీఎం రేవంత్ కౌంటర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని సవరించడంతోపాటు రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని బహిరంగసభల్లోనే మాట్లాడుతున్నానని గుర్తు చేశారు. తాను మాట్లాడుతున్న అంశాలపై మోడీ, అమిత్‌షా తనను బెదిరించడం కాదు...సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు అడగడంలోనే ఆ పార్టీ కుట్ర కోణం దాగి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేండ్లలో హిందూరాజ్యం, రిజర్వేషన్ల రద్దు అంశం ఆర్ఎస్ఎస్ ఎజెండాలో లేదా? మీ లక్ష్యం కాదా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పార్టీ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, నాయకులు మధుయాష్కీగౌడ్, బెల్లయ్యనాయక్, అద్దంకి దయాకర్‌తో కలిసి విలేకర్లతో రేవంత్ మాట్లాడారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే అంశాన్ని ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త గోల్వాల్కర్ రాయలేదా? ఫిలాసఫర్ ఎన్జీ వైద్యం వ్యాసాలు రాలేదా? అని ప్రశ్నించారు. వారి దారిలోనే బీజేపీ పయనిస్తోందన్నారు. మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్, మోడీ మంత్రివర్గంలోని సహచర మంత్రులు రిజర్వేషన్ల రద్దుపై బహిరంగంగానే మాట్లాడారని గుర్తు చేశారు. రాజ్యాంగ సమీక్షపై నాటి ప్రధాన మంత్రి వాజ్‌పేయ్ కూడా జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ చైర్మెన్‌గా పది మంది సభ్యులతో కమిటీ నియమించలేదా? అని ప్రశ్నించారు. దీనిపై గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదా? అని నిలదీశారు. రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమనీ, దీనిని అమలు చేయడమే బీజేపీ ఎజెండా అని పునరుద్ఘాటించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ వేసుకున్న ప్రణాళికలను తాను ప్రస్తావించానన్నారు. ఆధారాలతో తాను ప్రస్తావిస్తున్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చుకోవాలని కోరారు. లేకపోతే సవరించుకోవాలని సూచించారు. బీజేపీ వ్యతిరేకులపై ఈడీ, సీబీఐ, ఐటీని ప్రయోగించినట్టు... ఢిల్లీ పోలీసులను తనపై ప్రయోగిస్తున్నారని అన్నారు. ఢిల్లీ పోలీసులను ప్రయోగించడం ద్వారా తెలంగాణ సమాజాన్ని భయపెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా దళిత, గిరిజన, బలహీన వర్గాలకు అండగా నిలబడకుండా లొంగిపోతానని ఢిల్లీ సుల్తానులు ఎందుకు అనుకుంటున్నారో నాకు అర్థం కావడంలేదన్నారు. ఈ బాధ్యత, ఈ హోదా దళితులు, గిరిజనులు, ఓబీసీ, మైనార్టీలు ఇచ్చినవేనన్నారు. రిజర్వేషన్లు కాపాడేందుకు, బీజేపీ కుట్రలను తిప్పి కొట్టడానికే ఈ హోదాను ఉపయోగిస్తానన్నారు. ఫిబ్రవరి 22, 2000లో బీజేపీ ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజ్యాంగాన్ని మార్చేందుకు 10 మంది సభ్యులతో కూడిన జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌ను నియమించింది. 2002లో ఈ కమిషన్ నివేదిక ఇచ్చింది. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం వల్లే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం తప్పింది. ఆర్ఎస్ఎస్‌కు చెందిన గోల్వాల్కర్, ఎన్జీ వైద్య కూడా రిజర్వేషన్లు ఉండ కూడదని పలుమార్లు అభిప్రాయపడ్డారు. రిజర్వేష న్లు పెంచి అమలు చేయాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం బీసీ జనగణన చేపట్టాలని రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకున్నారు.ఈ క్రమం లో రిజర్వేషన్లు రద్దు చేయాలన్న కుట్రతోనే బీజేపీ 400 సీట్లు కావాలని కోరు తోంది' అని సీఎం ఈ సందర్భంగా వివరించారు. 8 రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలను చీల్చి ప్రభుత్వాలను పడగొట్టి బీజేపీ తమ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడంలోనూ ఆ పార్టీ దూర దృష్టి ఉందన్నారు. ఒక ప్రణాళికబద్ధంగా రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర చేస్తోందని విమర్శించారు. 'ఈ విషయాన్ని నేను ప్రస్తావించానంటూ నాపై కేసు పెట్టారు. ఎవరో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని బాధ్యుడిని చేస్తున్నారు. నాపై ఫిర్యాదు చేసింది హోంశాఖనే. కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమంత్రిపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి, ఆగమేఘాల మీద దేశ భద్రతకు ముప్పు వచ్చినట్టు, దేశ స్వాతంత్ర్యానికి ముప్పు ఉన్నట్లు ప్రవర్తిస్తుంది'. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధం లేదంటూ తమ పార్టీ మహిళా అడ్వకేట్ పోలీస్ స్టేషన్‌కు వెళితే దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ పరిధిలో పనిచేస్తారు కాబట్టే వాళ్లు ఢిల్లీ పోలీసులను ఎంచుకున్నాం ని తెలిపారు. పోలీసులను ప్రయోగించి తనపై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోందని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు తాము వచ్చామంటూ 2017లో కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డే ప్రకటించిన విషయాన్ని రేవంత్ ప్రస్తావించారు. రిజర్వేషన్లు అభివృద్ధిని తీసుకొస్తాయా అంటూ 2014-2019 మధ్య లోక్ సభ స్పీకర్‌గా ఉన్న సుమిత్రా మహాజన్ ప్రశ్నించారని గుర్తు చేశారు. దీనిపై మోడీ, అమిత్ షా దేశ ప్రజలకు ఏం చెబుతారు? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మీరేసే ప్రతి ఓటు రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుందన్నారు. రిజర్వేషన్లు పెరగాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం మారాలంటే ఎన్డీఏకు రాజ్యాంగం మార్చకూడదనుకుంటే ఇండియా కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువైపు నిలబడాలో దేశంలోని దళిత, గిరిజన, ఓబీసీ,మైనార్టీలు నిర్ణయించుకోవాలని కోరారు.

వేతనాలు పెంచండి



హక్కులు కల్పించండి

- నినదించిన కార్మిక లోకం : మేడే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా భారీ ర్యాలీలు, సభలు

న్యూఢిల్లీ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని వివిధ దేశాల్లో బుధవారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. దక్షిణ కొరియా, జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్ సహా పలు దేశాల్లో ర్యాలీలు చేపట్టారు. ధరల పెరుగదలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్మికులకు మరిన్ని హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కుల సాధన కోసం మేడేను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కార్మికులు తాము ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన ఇబ్బందులను ప్రజల దృష్టికి తెచ్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహి స్తారు. రాజకీయ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తెస్తారు.

దక్షిణ కొరియాలో...

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో వేలాది మంది నిరసనకారులు పతాకాలను చేతబట్టి పాటలు పాడుతూ, కార్మిక అనుకూల నినాదాలు చేస్తూ వీధుల్లో ప్రదర్శన జరిపారు. దేశాధ్యక్షుడు యూన్ సక్ యియోల్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై గళం విప్పేందుకే ర్యాలీ చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. 'గత రెండు సంవత్సరాలుగా యూన్ సక్ యియోల్ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో కార్మికులు తీవ్రమైన నిరాశలో కూరుకుపో యారు' అని కొరియా కార్మిక సంఘాల సమాఖ్య నేత యాంగ్ కయింగ్-సూ తన ప్రసంగంలో విమర్శించారు. ఇక యియోల్ ప్రభుత్వాన్ని ఉపేక్షించబోమని, తమ కోసం దానిని గద్దె దింపుతామని ఆయన చెప్పారు. దక్షిణ కొరియాలోని అనేక ఇతర నగరాల్లో ఇలాంటి ర్యాలీలే జరిగాయి. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు వేలాది మంది అధికారులను సమీకరించారు. అయితే హింసాత్మక ఘటనలు జరిగిన సమాచారమేదీ అందలేదు.

జపాన్‌లో...

జపాన్‌లో పది వేల మంది ప్రజలు టోక్యోలో సమావేశమయ్యారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాల కారణంగా జపాన్‌లోని అనేక మంది కార్మికుల జీవన పరిస్థితులు దెబ్బతిన్నాయని, ఆదాయ అసమానతలు పెరిగాయని కార్మిక సంఘాల జాతీయ సమాఖ్య నేత మసాకో ఒబాటా తెలిపారు. 'ఈ మేడే రోజున మేమంతా ప్రపంచంలోని తోటి కార్మికులతో కలిసి మా హక్కుల కోసం ఉద్యమిస్తున్నాము' అని ఆమె తెలిపారు. కార్మికులందరూ చిరకాలం సుఖసంతోషాలతో జీవించాలంటూ నినాదాలు చేశారు.

తైవాన్‌లో...

తైవాన్‌లో వందకు పైగా కార్మిక సంఘాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులు తైపై వీధుల్లో కొన్ని గంటల పాటు ర్యాలీ నిర్వహించారు. కార్మిక హక్కుల చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. బ్యానర్లు చేబూని, నినాదాలు చేస్తూ ప్రదర్శనకారులు ముందుకు సాగారు. అధిక వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, పెన్షన్ ప్యాకేజీలు తదితర డిమాండ్లను నెరవేర్చేందుకు చట్టాలని సవరించాలని వారు పట్టుబడుతున్నారు. ధరలు పెరిగిపోతున్నాయని, కానీ వేతనాలు మాత్రం పెరగడం లేదని తైవాన్ కార్మిక సంఘాల సమాఖ్య అధిపతి చియాంగ్ చియాన్-హసింగ్ తెలిపారు.

ఫిలిప్పీన్స్‌లో...

ఫిలిప్పీన్ రాజధాని మనీలాలో కూడా వందలాది మంది కార్మికులు, కార్యకర్తలు వడగాల్పులను సైతం లెక్కచేయకుండా ప్రదర్శన నిర్వహించారు. ఆహారం, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎర్ర జెండాలను చేత పట్టుకొని అధ్యక్ష భవనం వైపు వెళుతున్న ప్రదర్శనకారులను పోలీసులు అడ్డుకున్నారు. 'పని చేయడానికే జీవిస్తాము ...చనిపోవడానికి కాదు', 'ధరలు తగ్గించండి ...జీతాలు పెంచండి' అని రాసి ఉన్న పోస్టర్లను కార్మికులు ప్రదర్శించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫిలిపినో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేతలు వివరిస్తుంటే వారి ఉపన్యాసాలను శ్రద్ధగా ఆలకించారు. నగరంలో ప్రధాన ప్రజా రవాణా వ్యవస్థ అయిన జీపనీస్‌కు చెందిన డ్రైవర్లు సైతం ర్యాలీలో పాల్గొన్నారు. మూడు రోజులుగా జరుపుతున్న సమ్మెను వారు విరమించారు. ప్రభుత్వం చేపట్టిన ఆధునీకరణ కార్యక్రమం కారణంగా రాజధాని వీధుల్లో తమ వాహనాలు తిరగకుండా అడ్డుకుంటారేమోనని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ దేశాలలో కూడా....

ఇండొనేషియా రాజధాని జకార్తా, పాకిస్తాన్‌లోని లాహోర్, బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో కూడా మేడే ర్యాలీలు జరిగాయి. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో నిషేధాజ్ఞలు ధిక్కరించి టస్కిం స్క్వేర్‌లో ప్రదర్శన నిర్వహించిన కార్మికులతో పోలీసులు ఘర్షణకు దిగారు.



బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్లే..

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ- నల్లగొండ టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీ నదిలో వేసినట్టే అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నల్లగొండలో ఎమ్మెన్నార్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఢిల్లీ స్థాయిలో ఉంచిన మీకు ఈ జన్మంతా సేవ చేసుకుంటూ ఉంటానన్నారు. ఇంకా 12 రోజుల సమయం ఉంది.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా కష్టపడ్డారో.. ఇప్పుడూ అంతకంటే ఎక్కువగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కంటే నల్లగొండ పార్లమెంట్‌లో ఎక్కువ మెజారిటీ రావాలన్నారు. గడియారం చౌరస్తాలో పెద్ద ఫంక్షన్ హాల్ నిర్మాణం, రూ.700 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి రూ. 2 లక్షల రుణమాఫీ చేయకుంటే తాను దేనికైనా రెడీనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి, మాజీ మంత్రి జానా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మదర్ డెయిరీ చైర్మెన్ గుత్తా జితేందర్ రెడ్డి, నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రధాని మోడీ వ్యాఖ్యలు బాధాకరం

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం గోల్కొండ చౌరస్తాలోని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా.. రాఘవులు మాట్లాడారు.

గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిపక్షాల మధ్య ఐక్యత కుదరకపోవడంతో బీజేపీకి లాభించిందన్నారు. ఈసారి దేశంలో 28 సెక్యులర్ పార్టీలు ఒకే వేదిక మీదికి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని, బీజేపీని ఓడించి ప్రత్యామ్నాయంగా సెక్యులర్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇండియా కూటమికి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటం, ఒకటి, రెండో దశ పోలింగ్‌లో బీజేపీకి ప్రతికూలత ఉన్నట్టు గ్రహించడంతో ప్రధాని మోడీ.. మంగళ సూత్రాలు, హిందువుల సంపాదన మైనార్టీలకు పంచిపెడుతారనే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అంతేగాక ప్రజల ఆస్తులు లాక్కుంటున్నాయని సీపీఐ(ఎం), కాంగ్రెస్‌పై మోడీ దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజల ఆస్తుల్ని అదానీ, అంబానీ, కార్పొరేట్ కంపెనీలకు ఊడ్చి పెట్టింది మీరే కదా అని ప్రశ్నించారు. పదేండ్లలో ట్రైలర్ మాత్రమే చూశారని.. అసలు సినిమా చూపిస్తామంటున్న మోడీ మాటలు బెదిరించడమేనన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రులను, ప్రతిపక్ష నాయకుల్ని, జర్నలిస్టులను జైల్లో వేయడం ద్వారా బీజేపీ నిరంకుశ పాలన సాగించిందన్నారు. రిజర్వేషన్లపై సమీక్ష చేస్తామంటూ గతంలో ఆర్ఎస్ఎస్ నేతలు చెప్పిన మాటల అర్థం ఏమిటి.. సమీక్ష పేరుతో రద్దు చేయడమేనన్నారు. ముస్లింల రిజర్వేషన్లే కాదు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు సైతం భవిష్యత్‌లో ఆ పార్టీ రద్దు చేస్తుందన్నారు. గడిచిన పదేండ్లలో ప్రజల ఆదాయాలు 30శాతమే పెరిగితే.. ఖర్చులు మాత్రం 67 శాతం పెరిగాయని తెలిపారు. సీఏఏ పేరుతో మైనార్టీలకు పౌరసత్వ హక్కుల్ని నిరాకరించేందుకు బీజేపీ ప్రభుత్వం పూనుకుందని, మత రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

దానం నాగేందర్ శక్తిసామర్థ్యాలు కలిగిన వారు.. ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి అని అన్నారు. దానం నాగేందర్ లాంటివారు పార్లమెంట్‌లో కచ్చితంగా ఉండాల్సిన నాయకుడని .. ఆయన్ని గెలిపించేందుకు సీపీఐ(ఎం) శక్తి మేరకు కృషి చేస్తుందని అన్నారు.దానం నాగేందర్ మాట్లాడుతూ.. త్యాగాలు, పోరాటాలు చేయడంలో, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కమ్యూనిస్టుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. విద్యుత్ పోరాటమే అందుకు ఉదాహరణగా అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో తనకు సీపీఐ(ఎం) మద్దతు ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. ఎన్డీయే కూటమికి అధికారమిస్తే.. పదేండ్ల కాలంలో దేశ ప్రజలను కులం, మతం పేరిట విడగొట్టే ప్రయత్నాలు చేసిందన్నారు. దేశ ప్రధాని హోదాలో మోడీ వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. దేశంలో ఎన్నో సంస్కరణలు తెచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఎన్నో మార్ఫింగ్ వీడియోలు వచ్చాయని గుర్తుచేశారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకోవడంతోనే.. అమిత్ షా మార్ఫింగ్ వీడియోను చూపి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లొంగదీసుకోవాలని, భయందోళనకు గురిచేయడానికి హడావుడిగా నోటీసులు ఇచ్చారని విమర్శించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఈ ప్రాంత సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి. నర్సింహారావు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ రావు, దశరథ్, ఎం.మహేందర్, ఎం.వెంకటేష్, కె.నాగలక్ష్మి, రాజన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా ఫోన్లూ ట్యాప్ చేశారని అనుమానం

- మల్లన్నసాగర్ నిర్వాసితులు

నవతెలంగాణ-బంజారా హిల్స్

గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులకు గురిచేసినా.. ప్రజానీకంలో తాము ఉన్నామని మల్లన్నసాగర్ నిర్వాసితులు తెలిపారు. ఈ క్రమంలో తమ ఫోన్లనూ గత ప్రభుత్వం ట్యాప్ చేసిందని అనుమానం వ్యక్తమవుతోందన్నారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాసితులు ఎండీ.హయతుద్దీన్ మాట్లాడుతూ.. గడిచిన 10 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన మల్లన్నసాగర్ నిర్వాసితులను నిట్ట నిలువుగా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను భయభ్రాంతులకు గురి చేయడానికి ఫోన్ ట్యాపింగ్ కూడా చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై వెస్ట్ జోన్ డీసీపీకి ఫిర్యాదు చేశామని, సీఎం రేవంత్ రెడ్డి సైతం తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నామన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తమను గత ప్రభుత్వం అనేక బెదిరింపులకు పాల్పడిందని, ప్రత్యేక అధికారులు, సిబ్బందిని నియమించి తమ ఉద్యమాన్ని అణచివేయాలని చూసినా తాము వెనుకడుగు వేయలేదన్నారు. తిరుపతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా వారు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంతోపాటు మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు కూడా న్యాయం చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డిపై తమకు నమ్మకం ఉందన్నారు. తమకు అన్యాయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు ఎం.కృష్ణారెడ్డి, కె.చందు, చందు, కరుణాకర్ రెడ్డి, కిష్టాపూర్ అశోక్, యాదగిరి పాల్గొన్నారు.


త్యాగాల తొవ్వ మేడే

(మొదటిపేజీ తరువాయి)

అమెరికాలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులు తమ చదువులను పక్కనబెట్టి పోరాటాల్లోకి వస్తున్నారన్నారు. వారి పోరాటాలను అణచివేయడానికి కాల్పుల వరకు వెళ్తున్న పాలకుల తీరును ఎండగట్టారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు తమ హక్కుల కోసం రోడ్లమీదకొచ్చి పాలకులపై పోరాటాలు చేస్తున్నారని అన్నారు. మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, ఫెడరలిజాన్ని, సామాజిక న్యాయాన్ని ధ్వంసం చేయడానికీ, రాజ్యాంగం మూల సూత్రాలను తూడ్చివేయడానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రయత్నిస్తోన్నదని విమర్శించారు. మోడీ సర్కారు విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేసి నల్లచట్టాలను అడ్డుకోవటం రైతుల విజయమేనన్నారు. పౌరచట్ట సవరణలు చేయించడంలోనూ, ఐదేండ్లుగా దానికి విధివిధానాలను రూపొందించకుండా అడ్డుకోవడంలోనూ ప్రజలు సక్సెస్ అయ్యారన్నారు. కార్మిక సంఘాలు ఐక్యంగా 19 సార్వత్రిక సమ్మెలు చేశాయని గుర్తుచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాటం ఉధృతంగా సాగుతోందని చెప్పారు. దేశంలో దోపిడీ తీవ్రత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల జీతభత్యాలకు, పెరుగుతున్న ధరలకు చాలా అంతరం ఉందన్నారు. కార్మికుల జీతాలను తగ్గిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వారసత్వ సంపదను అందరికీ పంపిణీ చేయాలంటు న్నారని మోడీ, బీజేపీ నేతలు చేస్తున్న విషప్రచారాన్ని ఎండగట్టారు. పదేండ్ల కాలంలో అదానీ ఆస్తి రూ.60 వేల కోట్ల నుంచి రూ.16 లక్షల కోట్లకు ఎలా పెరిగింది? ఇది ప్రజలను కొల్లగొట్టి సంపాదించిన ఆస్తికాదా? అని ప్రశ్నించారు. మోడీ ప్రధాని అయినప్పుడు దేశంలో వెయ్యి కోట్ల రూపాయల ఆస్తి ఉన్నవాళ్లు 221 మంది ఉంటే వారి సంఖ్య 2,500కి పెరిగిందనీ, ఇదంతా వారసత్వ ఆస్తేనా? అని నిలదీశారు. ఇది కార్మికులు, ప్రజల పొట్టగొట్టి సంపాదించిన ఆస్తేనని నొక్కి చెప్పారు. అలాంటి ఆస్తిపై పన్నులేసి ప్రజలకు ఖర్చుపెట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక కోడ్‌లకు అనేక రాష్ట్రాల్లో విధివిధానాలను రూపొందించకుండా అడ్డుకోవడంలో కార్మిక సంఘాలు విజయవంతం అయ్యాయన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాకుండా, రాజ్యాంగాన్ని రక్షించు కోవడానికి కార్మికోద్యమం మరింత ఉధృతం కావాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. కార్మికుల జీవనప్రమాణాలు పెంచుకునేందుకు, లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ కోసం కార్మికులు పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య మాట్లాడుతూ..మోడీకి ప్రజల కష్టాలు పట్టట్లేదన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల, కార్మికుల వేతనాల పెంపు కోసం జరుగుతున్న పోరాటాలు ప్రస్తుతం చిన్నస్థాయిలో కనిపించవచ్చుగానీ రానున్న రోజుల్లో అవి తీవ్రస్థాయికి చేరుకుంటాయని హెచ్చరించారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలకు సంఘీభావం తెలపాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, నాయకులు జంగారెడ్డి, ఎంవీ.రమణ, జె.బాబూరావు, బి.ప్రసాద్, ఎస్వీ.రమ, అరుణజ్యోతి, టి.నాగరాజు, మూర్తి, ప్రజాసంఘాలు, రాష్ట్ర కేంద్రం నాయకులు పాల్గొన్నారు.

యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలిచ్చిన నిధులపై చర్చకు సిద్ధమేనా?

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూపీఏ రెండు ప్రభుత్వాల హయాంలో, మోడీ పదేండ్ల పాలనలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమేనా అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉందన్నారు. ఎన్నికల వేళ తలపై గాడిదగుడ్డు పెట్టుకుని ఊరేగుతున్నాడనీ, ఎక్కడైనా గాడిద గుడ్డు పెడుతుందా? అని ప్రశ్నించారు. బహుషా తన ఐదు నెలల పాలనలో ప్రజలకిచ్చింది గాడిద గుడ్డే అంటూ వివరిస్తున్నాడేమో అని ఎద్దేవా చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వీడియోను మార్ఫింగ్ చేసి రాజ్యాంగం మారుస్తారని తప్పుడు ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ విషయంలో మొదటి ముద్దాయి సీఎం రేవంత్‌రెడ్డినేననీ, మార్ఫింగ్‌లో ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా బుజ్జగింపు రాజకీయాలు, అబద్ధాలు, అవినీతి, మాఫియా, ఓటుబ్యాంక్ రాజకీయాలు, కుటుంబపాలనతోనే ముందుకెళ్తోందని ఆరోపించారు. మోడీ మళ్లీ ప్రధాని అయితే హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడటాన్ని తప్పుబట్టారు. మోడీ చరిష్మాను తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీజేపీపై ముప్పేట దాడికి ప్రయత్నిస్తున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలూ పరస్పర అవగాహనతో పనిచేస్తున్నాయని చెప్పారు. ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసినట్లుగానే.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి కేసుల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీకి సపోర్ట్ చేస్తోందని ఆరోపించారు.బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందన్నారు. ముస్లిం సామాజిక తరగతికి చెందిన అబ్దుల్ కలాంని, రెండోసారి దళిత సామాజిక తరగతి చెందిన రామ్ నాథ్ కోవింద్‌ని, మూడోసారి ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతులుగా చేసింది బీజేపీనేనన్నారు. మే 5న మరోమారు అమిత్‌షా, 8న ప్రధాని మోడీ తెలంగాణలో పర్యటిస్తారని తెలిపారు. అనంతరం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ గంధ కల్పన, తదితర నేతలకు కిషన్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మీడియా అధికార ప్రతినిధి సుభాశ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసత్యప్రచారం చేస్తోంది : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దవుతాయని కాంగ్రెస్ అసత్యప్రచారం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న అవాస్తవ ప్రచారంలో ఆర్ఎస్ఎస్‌ను లాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ స్వయంగా తాము రాజ్యాంగ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని స్పష్టత ఇచ్చారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సీఎం స్థాయికి తగ్గట్లు వ్యవహరించడం లేదని విమర్శించారు. ఓటమి భయంతో ఫేక్ వీడియోలు తయారు చేసి బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ, దీనిపై ప్రధాని మోడీకి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ వీడియోలు కాంగ్రెస్ కార్యాలయం నుంచే విడుదలయ్యాయని ఆరోపించారు. ఇందిరా గాంధీ రాజ్యాంగానికి తూట్లు పొడిచి ఎమర్జెన్సీ విధించిందన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలనీ సీపీఐ(ఎం) నగర నాయకులు మారన్న అన్నారు. మేడే సందర్భంగా కార్వాన్ డివిజన్ అల్లూరి సీతారామరాజు నగర్ బస్తీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణలో ఆయన స్థానిక నాయకులు కళ్యాణ్, నాయుడులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల, కార్మిక హక్కులను పరిరక్షణకు పోరాడాలన్నారు. కార్మికపక్షపతిమ బీజేపీని ఓడించాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ నాయకులు హనుమంతు, అంజి, మస్తాన్, రామాంజనేయమ్మ, రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట:

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదింపాలని కార్మికుల హక్కుల కోసం పోరాడే వారి కోసం ఎప్పుడు మద్దతు ఇవ్వాలని అంబర్ పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం మేడే దినోత్సవం పురస్కరించుకొని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులతో ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకతను అవలంభిస్తుందని కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితర నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మేడే సంబరాలు





నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని భరత్ నగర్ బస్తీలో మేడే సందర్భంగా సీపీఐ ఎం ముషీరాబాద్ కార్యదర్శి దశరథ్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర్ కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, నాయకులు శ్రీరాములు, పాషా, బస్తీ నాయకులు రాఘవేందర్, ప్రతాప్, చాంద్ పాషా, గంగమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్‌లో..

ముషీరాబాద్ నియోజకవర్గంలో రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లి ఎల్ఐజి కోటర్స్‌లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ ఎం పార్టీ నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్ హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు రమేష్, వెంకటమ్మ,సైదులు, మల్లయ్య చెన్నయ్య వెంకన్న, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక హక్కులు కాలరాస్తున్న పాలకులు'

- బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఐక్యవేదిక, ఉద్యోగ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 'మేడే' ఉత్సవాలు





నవతెలంగాణ-హిమాయత్‌నగర్

శతాబ్దాల తరబడి ప్రపంచ వ్యాప్తంగా పోరాటాలు సాగించిన అమరవీరుల వేల కట్టలేని త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే ప్రస్తుత పాలకుల ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కె. వేణుగోపాల్ హెచ్చరించారు.బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఐక్యవేదిక, ఉద్యోగ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లో కార్మిక దినోత్సవం 'మేడే' ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎరుపు రంగు దుస్తులు ధరించిన బీమా, బ్యాంకు ఉద్యోగులు ఎల్ఐసి కార్యాలయం నుంచి సెక్రటేరియట్ రోడ్డు మీదుగా ఆర్బిఐ కార్యాలయం వరకు కొనసాగిన ర్యాలీలో అరుణ పతాకాలు చేతబట్టి కార్మిక ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదిస్తూ విప్లవ గీతాలు పాడుకుంటూ పెద్ద ఎత్తున ర్యాలీ కొనసాగింది. ఈ ఉత్సవాలలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లు, హైదరాబాద్ రీజియన్ జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్, రిజర్వ్ బ్యాంక్ వర్కర్స్ యూనియన్, రిజర్వ్ బ్యాంక్ రిటైరీస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నేషనల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (నాబార్డ్) కలిసి ఉమ్మడిగా నిర్వహించిన ఈ ఉత్సవాలలో దాదాపు 400 మంది ఉద్యోగులు పాల్గొని నూతనోత్తేజం పొందారు. అనంతరం ప్రముఖ ప్రజాకవి, వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని 'ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల కర్తవ్యాలు' అనే అంశంపై తనదైన శైలిలో 'పాట-మాట' ద్వారా ప్రసంగించి పాల్గొన్న వారందరినీ ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీకాంత మిశ్రా, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, పి.వెంకట్రామయ్య, బీఈఎఫ్ఐ హరీష్ బాబు, ఆర్బిఐఈఏ వసంత్ రావ్, ఆర్బిడబ్ల్యుయూ వెంకటేశ్వర రెడ్డి, ఏఐఆర్ఆర్బీఈఏ రవికాంత్ రెడ్డి, ఎన్బిఈఏ జి.నాగేశ్వర్ రావ్, ఆర్బిఆర్ఏ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం పి.సుజాత, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జి.తిరుపతయ్య పాల్గొన్నారు. వేదికపై బ్యాంకింగ్-బీమా ఉద్యోగులచే వివిధ రంగాల కార్మిక, కర్షక, ఉద్యోగుల వేషధారణతో ప్రదర్శించ బడిన "సకల శ్రామిక శక్తి రూపం" అందరినీ ఆలోచింపజేసింది.

మైక్రో అబ్జర్వర్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మే 13న జరుగు పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించేందుకు మైక్రో అబ్జ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. హైదరాబాద్ జిల్లాలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వర్లను 120 శాతంతో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ర్యాండమైజేషన్ పక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, హేమంత్ కేశవ్ పాటిల్, కంటోన్మెంట్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు నళిని ప్రభావతి, గీత రాధిక, సత్యనారాయణ, అలివేలు మంగ తాయారు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ కోసం యువకుడి దారుణ హత్య



నవతెలంగాణ-మెహిదీపట్నం

ఫోన్ దొంగిలించేందుకు వెళ్లి అది కుదరకపోవడంతో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటన గుడి మల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సనావుల్లా (24) గుడి మల్కాపూర్ రింగ్‌రోడ్డు ఫిల్లర్ నంబర్ 65 వద్ద మంగళ వారం అర్ధరాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనం పైవచ్చి ఫోన్ లాక్కొని పారిపోయారు. స్థానికులు ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని గుడిమల్కాపూర్ పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా నింది తులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టంకు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

- ఐఎఫ్‌టీయూ నాయకుల పిలుపు



నవతెలంగాణ-ముషీరాబాద్

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్సును రద్దు చేయాలని పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఐఎఫ్‌టీయు నాయకులు పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టీ.యు) ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా విద్యానగర్ లోని మార్క్స్ భవన్ ముందు మేడే జెండాను ఎగరవేశారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మికుల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందని ఎనిమిది గంటల పని దినాన్ని మేడే స్ఫూర్తికి వ్యతిరేకంగా 12 గంటలు మార్చడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. కార్మిక వర్గం అతి తక్కువ వేతనాలతో యాజమాన్యాల శ్రమదోపిడికి గురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, వి.ప్రవీణ్, ఉపాధ్యక్షులు ఎం హన్మేష్ నల్లన, ఎస్. శ్రీనివాస్, లింగం గౌడ్, ప్రభాకర్, డి. లక్ష్మి అఫ్జల్, వెంకటేష్, నారాయణ, కొండన్న, షహనాజ్, భారతి, లక్ష్మి, శివరంజని, విజయ, అజయ్ సింగ్, శ్రీనివాస్, భీమయ్య, గోపి, మున్నా, వెంకటేష్ , పి.వై.ఎల్ రాష్ట్ర జిల్లా నాయకులు కె.ఎస్. ప్రదీప్, రవికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌టీ యూనియన్ కార్యాలయంలో మే డే ఉత్సవాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో మేడే సందర్భంగా వీఎస్‌టీ యూనియన్ కార్యాలయంలో వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాస్ రెడ్డి ఎర్రజెండా ఎగరవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కంపెనీలో పనిచేసే 35 మంది సీనియర్ కార్మికులకు సన్మానించారు. అనంతరం మేడే సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వి . శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఐలీ ప్రభాకర్, ఆఫీస్ బేరర్స్ బాబి నరేందర్ గౌడ్, రవి యాదవ్, రణధీర్ రెడ్డి, రాములు, అతిక్ రాంరెడ్డి, శంకర్, మధు, సత్య నారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలి

- ఐ.ఎఫ్.టీ.యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అరుణ



నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలని ఐ.ఎఫ్.టీ.యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అరుణ పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో విద్యానగర్ మార్క్స్ భవన్ ముందు 138వ మేడే సందర్భంగా ఐఎఫ్‌టీయు పతాకావిష్కరణ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అరుణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా చికాగో నగరంలో కార్మికుల వీరోచితమైన పోరాటం, అనేకమంది ప్రాణాలను అర్పించి హక్కులు సాధించిన డే అన్నారు. మేడే పోరాటంతోనే కార్మికులు కనీస వేతనాలు, పని గంటలకు కుదింపు, సంఘం పెట్టుకునే హక్కును, కంపెనీలలో, యాజమాన్యాలకు వ్యతిరేకంగా సమ్మె చేసే హక్కును సాధించారన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం గత పది ఏళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. నిత్యవసర సరుకులు ధరలను పెంచుతూ కార్మికుల జీవనాన్ని కష్టతరం చేస్తుందన్నారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయకుండా కారు చౌకగా శ్రమను కార్పొరేట్ శక్తులకు కంపెనీ యాజమాన్యాలకు ధారాధత్తం చేస్తుందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కును నిరాకరిస్తుందన్నారు. వీటి ద్వారా పని భద్రత కోల్పోతారన్నారు. 4 లేబర్ కోడ్స్ మేడే స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎలాగైనా ఎన్నికల్లో గెలుపొందాలని కుట్ర చేస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ఐఎస్‌టీయు నాయకులు సత్యనారాయణ, కుమార్, మణెమ్మ లక్ష్మణ్, నరసింహ, రాజమణి లీల మంజుల, మంచప్ప, రాకేష్ మల్లికార్జున్ సాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో ఘనంగా మే డే వేడుకలు





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో బుధవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ కే.ప్రభాకర్, రేడియాలజీ బాలకేశవ్, ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటేశ్వరరావు, జగన్, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ కెసి ఆంటోనీ అమ్మ, నర్సింగ్ ఆఫీసర్లు సరళ తాజ్ వరలక్ష్మి సారా పేరన్న డ్, ఫెసిలిటీ మేనేజ్మెంట్ ఇన్‌చార్జీ ఎం.సదానంద్, వై.శ్రీనివాసులు శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో ఘనంగా మేడే వేడుకలు..

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో ఘనంగా మే డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేందర్, నారాయణ, వీరేశం, కిషోర్, రాజు, నర్సింగ్ రావు, చంద్రమ్మ, జ్యోతి, భాగ్యలక్ష్మి, మోహన్ ,ప్రవీణ్, కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

నవతెలంగాణ-ముషీరాబాద్

పది ఫలితాలలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. నారాయణ స్కూల్స్ చైర్మెన్ జీ.యం గోపాల్ రెడ్డి ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి 2023-24 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు విజయ దుందుభి మోగించాయి. అన్ని బ్రాంచీలలో 1702 విద్యార్థులు 10 జీ.పిఏ సాధించడం చాలా గర్వకారణమైన విషయమన్నారు. తెలంగాణలో బెస్ట్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఇది పేరెంట్స్, టీచర్స్ , మేనేజ్మెంట్ ప్రతి ఒక్కరి విజయమన్నారు.

పదిలో ప్రతిభను చాటిన జియాగూడ గౌతమ్ మోడల్ స్కూల్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పది ఫలితాల్లో జియాగూడ గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభని చాటారు. మల్గే అర్పిత 9.7 జీపీఏతో స్కూల్ మొదటి స్థానంలో నిలి చింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ ఎం.అమర్నాథ్ మాట్లాడుతూ.. పది ఫలితాల్లో 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారికి ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థుల ఉత్తీర్ణత పాటు పడి ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారన్నారు. వారిని అభినందించారు.

హమాలీల వెల్ఫేర్ బోర్డు సాధనకు మేడే స్ఫూర్తితో పోరాడాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

నిత్యం శ్రమటోడ్చి పనిచేస్తున్న హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు లేకపోవటం విచారకరమని మీరు చేసే పోరాటాలకు తమ సంస్థ తరుపున అండ గా ఉంటామని ప్రజా ఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన 'మేడే' వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వాళ్ల డిమాండ్లకు తమ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతూ ప్రసంగించారు. కార్మికులు సుభిక్షంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కలిసి మెలిసి ఉంటున్న ప్రజలమధ్య ప్రధాని మోడీ మత విద్వేషాలు సృష్టిస్తున్నారని అది మానుకోవాలని సూచించారు. వీటిలో సీఐటీయూ జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, కే.జంగయ్య, ఎం.డి.బాబా, చెన్నయ్య, సాయిలు, నరసింహ, ఐలయ్య, కుర్మయ్య, జి.వెంకటేష్, కొమరయ్య, అక్తర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో ఘనంగా మేడే వేడుకలు





నవతెలంగాణ-ముషీరాబాద్

రాంనగర్‌లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాంనగర్ ఎస్‌బిఐ బ్యాంక్ పక్కన ఆటో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో సీఐటీయు జెండాను మున్సిపల్ యూనియన్ నాయకురాలు భాగ్యరేఖ ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాంగిర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి నియోజకవర్గంలో..

నవతెలంగాణ-మెహిదీపట్నం

మేడే సందర్భంగా నాంపల్లి నియోజకవర్గంలో సీఐటీయు, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం నగర కమిటీ సభ్యులు మల్లేష్, సీపీఐఎం నాయకులు కళ్యాణ్, శశికళ, శంకర్ బాలయ్య జహంగీర్, మున్సిపల్ కార్మికులు ప్రమీల , శోభ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జలమండలిలో ఏడుగురు ఉద్యోగులు పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏడుగురు ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరిలో వీసీ వింగ్ సీజీఎం భీమ్ రావు , సెంట్రల్ స్టోర్ డివిజన్ జనరల్ మేనేజర్ రఘునందన్ రెడ్డి సహ వివిధ స్థాయుల్లో పనిచేసే మరో అయిదుగురు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, విజయరావు, వినోద్ భార్గవ, టీవీ శ్రీధర్, దశరథ్ రెడ్డి, నాగేందర్ కుమార్, జీఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఘనంగా మేడే వేడుకలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకురాలు మీనా, సూపర్‌వైజర్ లు కుమారస్వామి, ఎస్‌కే షెఫీ, యాదమ్మ, కళ్యాణి, లక్ష్మమ్మ, మాధవి, సరళ, వాణి, నవనీత కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులను కార్మికులుగా గుర్తించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

నిరాశ్రయులను కార్మికులుగా గుర్తించి శ్రామిక సంక్షేమ పథకాలు వీరికి కూడా వర్తింప చేయాలని సీఫోర్ సీఎస్ (క్యాంపెయిన్ ఫర్ సిటిజన్ షెల్టర్), ఎన్ఎస్ఎస్ (నిరాశ్రయ శ్రామిక సంఘటన్) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా సీ ఫోర్ సీఎస్ (క్యాంపెయిన్ ఫర్ సిటిజన్ షెల్టర్), ఎన్ఎస్-ఎస్ (నిరాశ్రయ శ్రామిక సంఘటన్) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బాలామృత్ నెట్వర్క్ కన్వీనర్ అంబిక, అమన్ వేదిక జనరల్ సెక్రెటరీ ఆర్ ఇంద్రమ్మ, నిరాశ్రయ శ్రామిక సంఘటన అధ్యక్షులు ఫిరోజ్, సోషల్ ఆక్టివిటీస్ సంజయ, డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిస్టర్ లిజి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల పాటు కార్మికులు అంటే ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులే అన్న ఆలోచన నుండి అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం ఇప్పుడిప్పుడే మనం అడుగులు వేయడం మొదలుపెట్టామన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో శ్లోక స్కూల్ విజయకేతనం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో పురానపూల్ రహింపుర శ్లోక స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ రతన్ ప్రకాష్ జైస్వాల్ మాట్లాడుతూ.. పది ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత పొందారన్నారు. స్కూల్ లో 90శాతం పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ప్రతిభను కనబరచారన్నారు. ఉత్తీర్ణత పొందిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు.

తెలంగాణ భాష సంస్కారయుతమైంది

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ భాష ఇంతకు ముందు పాలకులు ఉపయోగించినది కాదని, సంస్కారయుతమైందని సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన డాక్టర్ ఎం శ్రీధర్ రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా తెలంగాణ భాష పై చర్చ జరిగిందని, అప్పటి ఉద్యమ నాయకుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఆంధ్ర ప్రాంతపు వారిని నొప్పించ కూడదని, మనకు మన రాష్ట్రం కావాలి తప్ప ఆంధ్ర ప్రాంతం వారితో విభేదం లేదని చెప్పేవారన్నారు. డాక్టర్ శ్రీధర్ రెడ్డి తో కలిసి తాము తొలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న రోజులను జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హైదరా బాద్ విచ్చేసి ఉద్యమ నాయకులతో మాట్లాడినప్పుడు ఆమెతో మాకు వేరే ఏ ప్రతిపాదనలు వద్దు, రాష్ట్రమే కావాలని ధైర్యంగా మాట్లాడిన ఏకైక వ్యక్తి డాక్టర్ శ్రీధర్ రెడ్డి అని తెలిపారు. ఉద్యమంలో ఎన్నోసార్లు తీవ్రంగా గాయ పడి జైలు శిక్షలు అనుభవించిన శ్రీధర్ రెడ్డి చివరి రోజుల్లో ఇది మనం ఆశించిన తెలంగాణ కాదని, ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని బాధపడ్డట్లు సుదర్శన్ రెడ్డి వివరించారు. తొలి దశ తెలంగాణ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్, కవి, రచయిత డాక్టర్ ఎం శ్రీధర్ రెడ్డి పేరుతో ఆయన సతీమణి డాక్టర్ బి.విజయలక్ష్మి సారస్వత పరిషత్తు లో నెలకొల్పిన సాహిత్య పురస్కారాన్ని శతాధిక గ్రంథకర్త కరీంనగర్ చెందిన డాక్టర్ మలయశ్రీ కి పరిషత్తు తరపున అందజేశారు. రూ.25 వేల నగదు జ్ఞాపిక శాలువాతో సత్కరించారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అంశాలపై పరిషత్తు వెలువరిస్తున్న గ్రంథాలు దాదాపు 20 పూర్తయ్యాయని తెలిపారు. డాక్టర్ శ్రీధర్ రెడ్డి సతీమణి డాక్టర్ బి.విజయలక్ష్మి ఎండోమెంట్ లక్ష్యాలను వివరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. పురస్కార గ్రహీత డాక్టర్ మల్లేశ్వరి తెలంగాణ భాష గురించి ప్రత్యేక ప్రసంగం చేశారు. పలువురు పూర్వ న్యాయమూర్తులు, సాహితీ వేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బస్తీల్లో ఇంటింటికీ ప్రచారం



నవతెలంగాణ-ముషీరాబాద్

పార్లమెంట్ ఎన్నికల ప్రచార నేపథ్యంలో బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్ లోని వివి గిరి నగర్, దోభిఘాట్, అరుంధతి నగర్, సబర్మతి నగర్, అన్నా నగర్, వాల్మీకి నగర్, నేతాజీ నగర్ బస్తీలో గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ డివిజన్ బీజేపీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. బస్తీల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, ,సీనియర్ నాయకులు శ్రీకాంత్ వీఎస్‌టీ రాజు, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కీసర



రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని రాజీవ్ గృహ కల్ప కాలనీలో పోలీస్‌లతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రజలు ఎలా మెలగాలో సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాజశేఖర్, మధు, శ్రీనివాస్, హరి ప్రసాద్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

శ్రమదాతలకు విందునిచ్చిన సింగిరెడ్డి శిరీష

నవతెలంగాణ- మేడ్చల్

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి శిరీష అనే మహిళ వివిధ భవన నిర్మాణ కార్మికులకు పసందైన మాంసాహార విందు భోజనం పెట్టారు. గ్రామ శివారులో పనిచేస్తున్న వెయ్యిమంది కార్మికులకు బుధవారం మధ్యాహ్నం సాకేట్ ప్రణామం ప్రాంగణంలో ఈ విందును ఏర్పాటు చేశారు. శ్రమ జీవులందరూ కుల, మతాలకు అతీతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాత శిరీష మాట్లాడుతూ "కార్మికుల చెమట చుక్కతో తడవనిదే గృహనిర్మాణం సాధ్యం కాదని, వారి కీలకమైన మానవ శ్రమను గౌరవిస్తూ తనవంతుగా సహాయంగా ఒక పూట మంచి భోజనంతో వారికి కృతజ్ఞతలు తెలపాలనుకున్నానని అన్నారు. పెరుగుతున్న ధరలతో అల్లాడుతున్న కార్మికులకు ఉదారంగా ఒక పూట విందు భోజనం అందించిన శిరీషను జన విజ్ఞాన వేదిక స్థానిక నాయకుడు వల్లూరి వరప్రసాదరావు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రశేఖర్, భక్తవత్సలరావు, సురేఖ, శ్రీరామ్మూర్తి నాయుడు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



నవతెలంగాణ-కాప్రా

కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య 111 వ జయంతిని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్టీ ఆఫీస్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతిక రంగ శాఖ కార్యదర్శి శ్రీమన్నారాయణ, ప్రముఖ రచయిత పి.బి చారి, సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ కళాకారులు సిహెచ్. ప్రసాద్ మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య చిన్నతనంలోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. స్వాతంత్ర పోరాటం సమయంలోనే అమీర్ హైదర్‌ఖాన్ సహకారంతో కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా మారి దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి అనేకమంది రైతులకు భూమి హక్కు కల్పించారని చెప్పారు. మొట్టమొదటి ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో వ్యవహరించారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలో సిద్ధాంత సమస్యలు వచ్చినప్పుడు నికరంగా నిలబడి మార్క్సిజాన్ని అన్వయించుకుంటూ భారత కమిటీ మార్క్సిస్టును అభివృద్ధి పరిచారని తెలిపారు. ఆయన చేసిన పోరాటం, నిర్మాణ పద్ధతి కమ్యూనిస్టులకు తప్పనిసరి కర్తవ్యంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం శ్రీమన్నారాయణ, శారద, నరసింహారావు ప్రసంగించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి సభ్యులందరూ పూలను వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి యాదగిరిరావు అధ్యక్ష వహించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, నరసింహారావు, ఎం. జగ్గరాజు, పి.బి చారి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సతీష్, శారద తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆఫీస్ వద్ద మేడే జెండాను కోమటి రవి ఎగురవేశారు. సోనీ సెంటర్ దగ్గర జగ్గరాజు జెండావిష్కరించారు. వారి వెంట వెంకట్, జయరాజ్, నాగేశ్వరరావు సతీష్, సిహెచ్ ప్రసాద్, శారద, వెంకటేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం : బండారి

నవతెలంగాణ-కాప్రా



మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా రాష్ట్రానికి చేసింది ఏమీలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మైనార్టీ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు బద్రుద్దీన్, మహేష్ గౌడ్, ఏఎస్‌రావు నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో..



మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మల్లాపూర్ డివిజన్ పరిధిలో డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవా రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓల్డ్ మల్లాపూర్, భవానీ నగర్, కేఎల్ రెడ్డి నగర్, హెచ్‌సీఎల్ కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ గతంలో చేసిన అభివృద్ధిని వివరించారు. మల్కాజిగిరి మరింత అభివృద్ధి కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో..



మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువు బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డా.ఏ.ఎస్ రావు నగర్ డివిజన్‌లోని నేతాజీ నగర్, సైనిక్‌పురిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, రహీం, శిరీష, మణెమ్మ, పద్మ, యాదగిరి, రమా తులసి, మురళీ పంతులు, శోభారాణి, గోలి శ్రీను, చిన్నారావు, కుమార స్వామి, పద్మ, బేతాళ బాలరాజు, గిరి, యాకయ్య, కుమార్ స్వామి, హరినాథ్, దుర్గ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేద్దాం.. సునీతారెడ్డిని గెలిపిద్దాం



- కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ గౌడ్

నవతెలంగాణ-కీసర

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపిద్దామని కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. బుధవారం చీర్యాల గ్రామంలో డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూలంగా స్పందిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో సునీత మహేందర్ రెడ్డి గెలుపు ఖయామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అధ్యక్షుడు కోళ్ల కృష్ణ యాదవ్, బక్కని నర్సింగ్ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు మధు, మాజీ వార్డు సభ్యురాలు మంజుల, శ్రీహరి, బక్కని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా నాయకులు ఈటల సమావేశం

నవతెలంగాణ-ఆల్వాల్



అల్వాల్‌లోని వీబీఆర్ గార్డెన్‌లో బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ బుధవారం ఎస్సీ మోర్చా విభాగానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ఎస్సీ, బలహీన వర్గాలకు అండగా ఉంటానని తెలిపారు. తనను మల్కాజిగిరి ఎంపీగా మెజార్టీతో గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ స్టేట్ జనరల్ సెక్రటరీ క్రాంతి కిరణ్, మురళీ, మాణిక్ రెడ్డి, కరుణాకర్, లవ కుమార్, నాగరాజు, రమేష్, యాదగిరి, జయపాల్, మల్లికార్జున గౌడ్, లక్ష్మణ్, పద్మిని, సుజాత పాల్గొన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

- సీపీఐ(ఎం), సీపీఐ, సీఐటీయూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు ఆవిష్కరించిన నాయకులు
- కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలి
- కార్మిక సంఘాల నాయకుల పిలుపు



నవతెలంగాణ - జవహర్‌నగర్

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 138వ మేడే సందర్భంగా జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలో వాడవాడలా కార్మికుల ఐక్యతకు గుర్తుగా ఎర్రజెండాలను ఎగరవేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, కార్మికులకు కనీస హక్కులు ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ నగర్‌లో..

అంబేద్కర్ నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కన్నయ్య రాజు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మారగోని వెంకటేష్, వంశరాజ్ మల్లేష్, రవికుమార్, శీను, యేసు, రాజు, వెంకటాద్రి, సుధాకర్, రాంబాబు, మోహన్, నరేష్, సాయి, నాగబాబు, అఖిల్, పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో..

మేడేను పురస్కరించుకుని డంపింగ్ యార్డ్‌లో కార్మికులందరి సమక్షంలో కేవీఆర్ బేస్ లైన్ రిసోర్సెస్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు డీజీ. నరసింహారావు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ నాయక్, వైస్ ప్రెసిడెంట్స్ రత్నం, సయ్యద్ అలీ, నరసింహులు, సంజీత్ కుమార్ సింగ్, జాయింట్ సెక్రెటరీలు సురేష్, సుభాన్, తిరుపతయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బాలాజీ సింగ్, హరినాథ్, రాజు, కోశాధికారిరామకృష్ణ పాల్గొన్నారు.

బాలాజీ నగర్‌లో..

బాలాజీ నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి, ఒకరికొకరు మేడే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొయ్యాడ వెంకటేష్, అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షులు మరాఠి బాబు, ఏఐఎఫ్టీయూ జంట నగరాల అధ్యక్షులు ఎర్రల్లి మల్లేష్, రమణారెడ్డి, రవి, వీరాస్వామి, తిరుపతి రెడ్డి, యాదగిరి, రాములు, శివ నాయక్, సాయి కుమార్, లక్ష్మి మహిళలు, కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొట్టాలి: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్

బడా పారిశ్రామికవేత్తలకు వత్తాసు పలుకుతున్న బీజేపీని తరిమికొట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో జవహర్ నగర్‌లో సీపీఐ కాలనీ, ఫైరింగ్ కట్ట కోళ్ల ఫారం చౌరస్తా, సాయిబాబా కమాన్, మున్సిపల్ ఆఫీస్ పక్కన సీపీఐ ఆఫీస్, డెంటల్ కాలేజీ, గిరి ప్రసాద్ నగర్‌లో జెండాలు ఆవిష్కరించారు. బీజేపీ కార్మికుల హక్కులను కాలరాసి, పెట్టుబడిదారులకు ఉపయోగపడేలా చట్టాలను తీసుకువచ్చిందన్నారు. బీజేపీ కార్మికుల పక్షాన కాకుండా బడా పారిశ్రామిక యజమానుల కోసం పనిచేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, మోతే రాజేశ్వరి, స్వరూప, శ్యామల లత, ఎల్లయ్య, పెద్దమేతరి లక్ష్మణ్, రవి నాయక్, సత్యం, కురుమయ్య, సూర శ్రీను, కొమురయ్య, నాని, నాగేష్, కవిత, పద్మమ్మ, లక్ష్మి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్ సర్కిల్ పరిధిలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్టు సీఐటీయూ ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న అన్నారు. చిల్కానగర్, రామంతపూర్, ఉప్పల్ పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ, సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం. వినోద, సీఐటీయూ నాయకులు ఎండీ. గౌస్, వెంకటేష్, పర్వతాలు, యాదగిరి, కుమార్, జంగయ్య ఎల్లేష్, శివ, మధు, తదితరులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) నాయకులు వెంకటేశ్వర్లు, భీష్మాచారి, శేషు, ఊర్మిళ, మేరీ, ఆంజనేయులు, తదితరులున్నారు.



కాప్రాలో..



కాప్రా పరిధిలోని మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో భవన నిర్మాణ, పెయింటర్, కార్మిక సేవా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మేడే వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తాపీ, పెయింటర్, పారిశుధ్య కార్మికులతో కలిసి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మికులకు కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, ఉల్లెం బాలరాజు, భూపతి అశోక్, సాయి కుమార్, శివాజీ, నవీన్ గౌడ్, పూస రమేష్, బాబు, చిన్న దుర్గయ్య, కత్తుల రాజ్ కుమార్, కొయ్యడ జయపాల్, నరహరి, కరుణాకర్, మౌల, నిస్సార్, అహ్మద్ ఘోరీ, శేఖర్ గౌడ్, దండెం నరేందర్, మహిళా నాయకులు భాగ్యమ్మ, జ్యోతి, వివిధ పార్టీల నాయకులు, కార్మిక నాయకులు, పారిశుధ్య, ఇతర సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాచారం డివిజన్‌లో..

మేడే సందర్భంగా నాచారం ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో 13 కార్మిక జెండాలను బుధవారం ఆవిష్కరించారు. వాయిత్ ఇండియా కంపెనీ వద్ద నిర్వహించిన మేడే వేడుకలకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాఘవరావు హాజరై మాట్లాడుతూ.. 1886 సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలోని హేగ్ మార్కెట్‌లో 8గంటల పని విధానం కోసం కార్మికులు ర్యాలీ తీస్తున్న క్రమంలో యజమాన్యం తుపాకులతో కాల్చిందని గుర్తు చేశారు. ఆ కాల్పుల్లో ముగ్గురు కార్మికులు మరణించారని పేర్కొన్నారు. వాళ్ల మరణిస్తూ వారి చొక్కాలను రక్తంతో తడిపారని, ఆ చొక్కాల ఫలితంగా ఎర్ర జెండా అని తెలిపారు. నాటి నుంచి ప్రతీ ఏడాది మే ఒకటో తేదీన మే డే కార్యక్రమాన్ని వివిధ రంగాల కార్మికులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాన్ని వెనక్కి తిప్పి కొట్టాలనిన కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. యునైటెడ్ స్పిరిట్స్ వాయిస్ టర్బో తెలంగాణ ఫుడ్స్, కాకతీయ కెమికల్ ఇండస్ట్రియల్ మున్సిపల్ వర్కర్స్, ట్రో కంట్రోల్స్ శ్రీకృష్ణ ఫార్మ ఆర్ఎంసీ పరిశ్రమల వద్ద నిర్వహించిన వేడుకలకు సత్యం గౌడ్, వై. శేఖర్‌రెడ్డి, అబ్దుల్లా, ప్రభాకర్, నారాయణ రెడ్డి, బాలరాజు, అజయ్, సునీల్, రామకృష్ణ సుధాకర్, నర్సింగరావు, భాస్కర్, ఉపేందర్, రాము,రాజేశ్వర్ పాల్గొన్నారు.

కీసరలో..



కీసర మండలంలో మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. రాంపల్లి, గోధుమ కుంట గ్రామాల్లో కార్మికులు జెండా ఎగురవేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు పంబల్ల సరితా రమేష్, ఎలిజాల నగేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు బాలరాజు యాదవ్, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, సెక్రటరీ సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పెంటయ్య పాల్గొన్నారు.

ఘట్కేసర్‌లో..



ఎర్రజెండాను కంటికి రెప్పలా కాపాడుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్.సబిత అన్నారు. బుధవారం కార్మిక దినోత్సవం సందర్భంగా ఘట్కేసర్ మండల కేంద్రంతో పాటు పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, రాజీవ్ గృహకల్ప, పవర్ గ్రిడ్ కంపెనీ వద్ద గట్టు మైసమ్మ డీసీఎం డ్రైవర్లు సీఐటీయూ జెండాను ఎగురవేశారు. అనంతరం చింతల యాదయ్య, ఎన్. సబిత,, పోచారం మున్సిపల్ చైర్మెన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మెన్ రెడ్యానాయక్ మాట్లాడుతూ. 1886 మే 1న అమెరికా చికాగో నగరంలో కార్మికుల రక్తంతో తడిసి ఎత్తిపట్టిన ఎర్రజెండా ప్రపంచ శ్రామిక వర్గ విముక్తి బావుటగా నిలిచిందన్నారు. నాటి స్ఫూర్తితో మతోన్మాద కార్పొరేట్ శక్తులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. కంటికి రెప్పలా ఎర్రజెండాను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కష్టజీవులందరికీ మేడే పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపల్ కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, శ్యామల బుచ్చిరెడ్డి, రవి, హరి ప్రసాద్, రాజశేఖర్, ఐలయ్య, కాశీ, పవర్ గ్రిడ్ యూనియన్ అధ్యక్షులు రాజు, రమేష్, చంద్రపాల్, శ్రీనివాస్ రెడ్డి, రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, డీసీఎం డ్రైవర్లు యూనియన్ అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి యాదగిరి, క్యాబ్ డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి సమ్మయ్య, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు గాంధారి అశోక్, కార్యదర్శి దాసు, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు చంద్రమౌళి, కనకరాజు, ఎల్లమ్మ, నాగమణి, అలివేల, అనసూర్య చంద్రమోహన్, శాంతమ్మ లత తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..



అల్వాల్‌లోని జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్యాలయం ఎదుట వివిధ రంగాల కార్మికులు బుధవారం అరుణ పతాకం ఆవిష్కరించారు. అనంతరం మే డే వర్ధిల్లాలి, ప్రపంచ కార్మికులారా ఏకంకండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో రిక్షా కార్మికులు, చిరు వ్యాపారస్తులు, పాల్గొన్నారు. కే.రవిచంద్రన్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీ. మహేందర్, శేఖర్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..



మేడే అంటేనే కార్మికుల పండుగని అన్ని వర్గాల కార్మికులు మేడేను ఎంతో ఆనందంగా జరుపుకుంటారని షీలా ఫోం ఎంప్లాయిస్ యూనియన్, బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ అన్నారు. బుధవారం మేడే సందర్భంగా మేడ్చల్ పారిశ్రామిక వాడలోని షీలా ఫోం కంపెనీ వద్ద కార్మికులతో బీఆర్టీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంబు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులు ఏకం కావాలని, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ల తప్ప అని మార్క్సిస్టు నాయకుడు కార్ల్‌మార్క్స్ ఇచ్చిన నినాదం ప్రపంచ కార్మికులను ఉత్తేజపరిచిందన్నారు. వందలాది మంది కార్మికుల రక్తంతో తడిసిన రుమాలు తీసి కార్మిక జెండాగా ఎగురవేసిన ఆనాటి నుంచి మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఎందరో తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించి శ్రమదోపిడీపై విజయం సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ సింగ్, షీలా ఫోం ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎస్ డి.సిరాజుద్దీన్, కార్మికులు మహిపాల్ గౌడ్, శ్రీనాథ్, నవీన్, నరేష్, భీము నాయుడు, స్మరన్ ,జై జ్యోతీ లెంక, ప్రభాకర్, ఏర్రయ్య, లక్ష్మి, ఆర్ఈవీఎల్ జనరల్ సెక్రటరీ నరసింహ చారి, యాదగిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మండల పరిధిలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి 44 పక్కన ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) జెండాను మండల కార్యదర్శి మందాపురం నరేష్ ఆవిష్కరించారు. అదేవిధంగా మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట, మెడిసిటీ ఆసుపత్రి, శ్రీరామ్ స్పిన్నింగ్ మిల్ వద్ద ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండాను నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ కార్మికుల శ్రమతోనే మానవ మనుగడ ముందుకు సాగుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల కాపాడుతూ వారికి అందించాల్సిన అన్ని రకాల సదుపాయాలను యజమాన్యాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు నర్సింగరావు, ప్రశాంత్, బాలకిరణ్, రమేష్, చంద్రశేఖర్, కొమురయ్య, వెంకటేష్, కైరోల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్‌లో..



సీఐటీయు ఆధ్వర్యంలో బుధవారం మేడే ఉత్సవాలను మల్కాజిగిరి మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు హాజరై ఆర్కేపురం ఆటో్ట్రాలీ యూనియన్, బీసీడబ్ల్యూ, మున్సిపల్ రంగం, రాంకీ డంపింగ్ యార్డ్ తదితర 14 సెంటర్లలో సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం, కార్మిక హక్కుల సాధన కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేండ్లల్లో కార్మికులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఉన్న చట్టాలను మారుస్తూ కార్మిక హక్కులను కాలురాస్తుందని, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని గద్దె దింపాలన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..



మే డే సందర్భంగా నేరేడ్మెట్ చౌరస్తా, డైట్ సెంటర్, ఆర్కేపురం, సంతోషిమాత, మల్కాజిగి చౌరస్తా, ఆర్టీసీ కాలనీ, మౌలాలీ, మీర్జాలగూడ, అమ్ముగూడ సీఐటీయూ ఆఫీస్ తదితర ప్రాంతాలలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం. కృపాసాగర్, నాయకులు నారాయణ రెడ్డి, విజయ్ కుమార్, రొయ్యల కృష్ణమూర్తి, శర్మ , సీఐటీయూ నాయకులు ప్రభాకర్, యాదగిరి, సుమిత్ర, సరోజ, కె.కృష్ణ , మద్దిలేటి, కృష్ణ, మహేష్, శ్రీకాంత్, నాగరాజు తది తరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన సాధ్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పోరాటాలతో సాధించుకున్న ఫలితాలను స్మరించుకుంటూ పోరాట సతిని పెంపొందించుకుని హక్కుల సాధనకు ఉద్యమించాలని డాక్టర్ దేవి నాగేశ్వరి పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా రాష్ట్ర క్షయ శిక్షణా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు కామ్రేడ్ శాంత్ కుమార్, కామ్రేడ్ మజీద్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ దేవి నాగేశ్వరి మాట్లాడుతూ మేడే ఉత్సవాలను మన దేశంలోనే కాక ప్రపంచంలోని అనేక దేశాల్లో జరుపుకుంటారని తెలిపారు. మేడే (కార్మిక దినోత్సవం) గొప్ప చారిత్రాత్మక చైతన్య రోజు అని అభివర్ణించారు. బ్రాంచ్ అధ్యక్షులు కామ్రెడ్ శాంత్ కుమార్ మాట్లాడుతూ కార్మికలోకం చేసిన ఉద్యమ పోరాటాలతో బానిసత్వం, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా శ్రమ దోపిడీని ఎదురిస్తూ హక్కులు సాధించుకున్న రోజే మేడే అని తెలిపారు. రవికుమార్ సంతోజు మాట్లాడుతూ కార్మిక లోకానికి మేడే పెద్ద పండగ రోజు అనీ, పోరాటాలతో శ్రమకు తగిన గుర్తింపును, రోజుకు 8 గంటల పని హక్కును సాధించుకున్న రోజును మేడేగా (కార్మిక దినోత్సవం) జరుపుకుంటున్నామని తెలిపారు. చికాగోలో కొంత మంది మహనీయులు ఉద్యమ పోరాటాలతో రక్తాన్ని చిందించి కేవలం తమ దేశంలోనే కాక ప్రపంచానికే కొత్త వెలుగులు అందించారని తెలిపారు. కానీ 1985 తర్వాత అన్ని రంగాల్లో చోటు చేసుకున్న ప్రయివేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మిక వర్గాల కార్మిక చట్టాలు అమలుకునోచుకోవడం లేదన్నారు. ముఖ్యంగా ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం ఉంటే అక్కడ కంపెనీలు పుట్టుకొస్తూ కార్మికుల హక్కులు కాలరాచి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. దీనికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థ అనీ, ఉన్నంత కాలం ఎక్కువ గంటలు పని చేయిస్తూ, కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడడం సర్వసాధారణమై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు గాను అన్ని రంగాల్లో కార్మికులు ఏకమై శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కార్మిక చట్టాల అమలు కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కార్మిక ప్రభంజనాన్ని గుర్తించే విధంగా పోరాటాలు చేస్తేనే కార్మిక లోకం మనుగడ సాధ్యమవుతుందనే విషయాన్ని గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబుబ్ అలీ, నసీర్, యాసీన్, ఖాదర్, ఫారుక్, ఆజం, నీరజ, వీణ, అనురాధ, హారిక, రాధిక, సుధాకర్, అలీం, రవి, ప్రదీప్, నరేష్, బాలకుమార్, గోపాల్, లక్ష్మి, స్వప్న, జ్యోతి, శ్రావణ్, గంగాధర్, భారతమ్మ, విజయలక్ష్మి, అక్బరీబేగం, జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఘనంగా మేడే వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడే వేడుకలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి, జమ్మిగడ్డ, నేరేడ్‌మెట్ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మేడే స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
గురువారం | మే 2, 2024 | www.navatelangana.com

ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులకు ఓటుపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా-2024 జిల్లా స్వీప్ నోడల్ అధికారి, డిడబ్ల్యూసీఓ కృష్ణారెడ్డి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరం కాలనీలో ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులకు ఓటరు అవగాహన కల్పించారు.

పదోతరగతి విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శ్రీ చైతన్య స్కూల్ సర్దార్ పటేల్ నగర్ బ్రాంచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు, 10/10 జీపిఎ సాధించిన 54 మంది విద్యార్థలకు, వారిని ఇంతటి ఉన్నతంగా తీర్చి దిద్దిన ఉపాధ్యాయలను ఎమ్మెల్యే సన్మానించారు.

పది ఫలితాల్లో చైతన్య విద్యానికేతన్ విద్యార్థుల ప్రభంజనం



తన్య రాజ్‌పుత్ | జె.యశ్వంత్ | కె.స్పందన | గోలు కుమార్ | కె.గౌతమ్ | అంచిత కిషోర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

2024 పదవ తరగతి పరీక్ష ఫలితాలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్గం నగర్‌లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్, ట్రస్మ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శివరాత్రి యాదగిరి అన్నారు. కే.స్పందన జీపీఏ10/10, జె.యశ్వంత్ కుమార్10/10, సాధించడంతోపాటు, తన్య రాజ్ పుత్ 9.8, గోలు కుమార్ 9.8, కే.గౌతమ్ 9.8, అంచిత కిషోర్ 9.7,గ్రేడులను దక్కించుకోవడంతో పాటు 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విద్యను అందిస్తూ ఈ ప్రాంతంలోనే పదవ తరగతిలో అరుదైన ఫలితాలతో 99 శాతం ఉత్తీర్ణత సాధ్యమైందన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు అధ్యాపక బృందంతో కలిసి పాఠశాల ప్రాంగణంలో బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మంగాదేవి, శివరాత్రి నిఖిల్, డాక్టర్ శివరాత్రి శృతివిద్య, పాఠశాల ప్రిన్సిపల్ శివరాత్రి సాయితేజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికవర్గ ఐక్యత, పోరాటలతోనే సోషలిస్టు వ్యవస్థను నిర్మించవచ్చు

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

కార్మికవర్గ ఐక్యత,పోరాటలతోనే సోషలిస్టు వ్యవస్థ ను నిర్మించవచ్చునని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షు డు యండీ యూసుఫ్ అన్నారు.138వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్, షాపూర్ నగర్, జగద్గిరిగు ట్ట, ఐడిపిఎల్, గాంధీనగర్, గిరినగర్, అంజయ్య నగర్, మగ్దుం నగర్, బీరప్పనగర్, శ్రీరంనాగర్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం, వివిధ కంపెనీల ముందు ఏర్పాటు చేసిన ఎర్రజండా దిమ్మెల వద్ద అరుణ పతకాన్ని ఎగురవేశారు. అనంతరం షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూసఫ్ పాల్గొని మాట్లాడుతూ.. కనీస పని గంటల కోసం 138 సంవత్స రాల క్రితమే ప్రజలు యాజమాన్యాలకు వ్యతిరేకంగా పోరాడి నలుగురు అశువులు బాస్తే వారి రక్తతర్పణతో ఏర్పడిందే మేడేనని పేర్కొన్నారు. నాటినుండి



కార్మికుల కు కనీస పనిదినాలు 10 గంటలు తరువాత 8 గంటల పనిదినాలను అమలు జరిగిందన్నారు. అలాంటి గొప్ప చరిత్ర మేడేకి ఉందని కానీ దుర దృష్టవశాత్తు నేడు బీజేపీ పార్టీ కార్మికులు పోరాడి సాధించుకొని కార్మికుల హక్కులను కాలరాసి పెట్టుబడి దారులకు ఉపయోగప డేలా కార్మిక చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. బీజే పీ కార్మికుల పక్షాన కాకుండా బడా పరిశ్రమల యాజ మాన్యాల కోసం పనిచేస్తుందని విమర్శించారు. మరో అతిథి ప్రముఖ శాస్త్రవేత్త డా. సోము మర్ల మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజలు లాభ పడలేదని కరోనా కాలంలో భారత్ బయోటెక్, యశోద,మల్లారెడ్డి లాంటి పరిశ్రమల యాజమాన్యాల లాభాలు వందల రేట్లు పెరిగాయాయని వాటిని చూసి అభివృద్ధి అని చెప్ప డం సిగ్గుచేటని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమాలకు సీపీఐ కార్యద ర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ అధ్యక్షకార్యదర్శి స్వామి, శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, ఏఐటీయూసీ నాయకులు సాయిలు నాయకత్వం వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి భాస్కర్, వెంకట్ రెడ్డి, కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ డప్పు రామస్వామి, బాలరాజులు విప్లవ గేయాలు పాడి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో సదానంద్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, వీరస్వామి, నర్సింహ, ఆశయ్య, యాదయ్య, యాకుబ్, ఖయుమ్, వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా హక్కులను సాధించుకుందాం

- కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మిక సంఘాల ఐక్యతతో కార్మికుల హక్కులను సాధించుకుందామని కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్ అన్నారు. బుధవారం ప్రపంచవ్యాప్తంగా 138వ మేడే సందర్భంగా కార్మిక నాయకులు ముద్దాపురం మదన్ గౌడ్ కార్మికులకు అన్నివేళలా కార్మికులతో ఉంటూ కార్మికులకు సేవలు అందిస్తూ... కార్మికులకు ఎనలేని కీర్తిని తీసుకొచ్చినటువంటి ఏకైక నాయకుడు మద్దాపురం మదన గౌడ్... 138వ మే డే సందర్భంగా బీహెచ్ఈఎల్ రామచంద్రపురంలో గల ఫిబ్రవరి ఎలక్ట్రానిక్స్ యూనిట్ బాలనగర్ బయోపిక్ సింథటిక్ ప్రొడక్ట్ లిమిటెడ్ కంపెనీ...గాంధీనగర్‌లోని ఆర్డి ఇంజనీరింగ్ కంపెనీ...జీడిమెట్ల ఇంట్రెస్ట్ ఏరియాలో లక్షల లైఫ్ సెన్స్ కంపెనీ...నక్షని కంపెనీలో డాక్టర్ రెడ్డీస్ కంపెనీ ఉన్నప్పుడు వరుసగా ఇప్పటివరకు ఆరు అగ్రిమెంట్లు చేసినటువంటి ఘనత ముద్దాపురం మదన్ గౌడ్ కే దక్కింది. ఏ ఆర్ లైఫ్ సెన్స్ యూనిట్ వన్ విజయ శ్రీ కెమికల్ కంపెనీ...క్యారియన్ సిస్టం కంపెనీలో ...రాసి ఎంటర్ప్రైజెస్ కంపెనీలలో కార్మికులందరూ ఏర్పాటు చేసిన మే డే కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్మికులకు తన యొక్క సందేశాని వివరించి, కార్మికులకు అన్నివేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్మికులందరికీ 138వ మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. మే డే ఉత్సవాల్ని ఎంతో సంతోషంగా, పండుగల జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైనటువంటి కార్మిక నాయకులు కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత సుభాష్, కార్మిక నాయకుడు దేవేందర్, కార్మిక నాయకుడు కే రాంబాబు, ఆర్డి ఇంజనీరింగ్ ఆర్ డి ఇంజనీరింగ్ అధ్యక్షులు వారు సుమిత్ సింగ్, శ్రీనిధి జీఎస్ అమ్మదాస్, ఫిబ్రవరి వకీల్, రాసి కంపెనీ కార్మికులు ఇతర కార్మిక నాయకులు అందరూ హాజరైనందుకు మదన గౌడ్ వారందరికీ 138వ మేడే కార్యక్రమాన్ని ఎంత విజయవంతం చేసినందుకు అందరికీ అభినందనలు తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజుకు నేడే చివరి రోజు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఫెయిల్ అయిన, ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించడానికి నేడు చివరి రోజు అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్ తెలిపారు. సకాలంలో ఫీజు చెల్లించి పరీక్షలు రాయాలనీ, ఫీజు గడువును ఎట్టి పరిస్థితుల్లో పొడించే పరిస్థితి లేదని తెలిపారు.

రాగిడి లక్ష్మా రెడ్డి గెలిపించుకుంటే అభివృద్ధి రెట్టింపు అవుతుంది



- కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ.అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుంటేనే ఈ ప్రాంతం అభివృద్ధి మరింత రెట్టింపు అవుతుందని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధి గిరినగర్‌లో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వివేకానంద, కార్పొరేటర్‌గా నేను ఉన్నానని, మన ఎంపీ అభ్యర్థి అయిన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే అత్యధిక నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని గణనీయమైన అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇక్కడి ప్రాంత వాసులు కాదని వారికి ఇక్కడి ప్రాంతాలపై ఎటువంటి అవగాహన లేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఏర్వ.శంకరయ్య ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకురాళ్ల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిచుంటే కూకట్ పల్లి రూపు రేఖలు మారిపోయేవి

- విజయనగరం ,శ్రీకాకుళం జిల్లా వాసుల సమస్యలు తీరుస్తాను
- 26 ఉప కులాల సమస్యలు పరిష్కరిస్తాను
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కూకట్ పల్లిలో రోడ్డు షో, కార్నర్ మీటింగ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేష్ గెలిచి ఉంటే కూకట్ పల్లి రూపు రేఖలు మారిపోయేవనిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

కాంగ్రెస్ మల్కాజగిరి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డికి మద్దతుగా మేడ్చల్ మల్కాజగిరి జిల్లా మూసాపేట్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తారమ్మ దేవాలయం వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాదేమో అనే భ్రమతో కేసీఆర్‌కు భయపడి కాంగ్రెస్ పార్టీకి కూకట్‌పల్లిలో సంపూర్ణ మద్దతు ఇవ్వలేదన్నారు. అయితే ఇప్పుడు మీరు ఆశించిన ప్రభుత్వం వచ్చిందని, కాబట్టి ఎవరికి భయపడకుండా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి సునీతమ్మను గెలిపించాలని కోరారు. కూకట్‌పల్లిలో సమస్యలు లేకుండా చేస్తానని, ఇక్కడ ఉన్న 26 కులాల సమస్యను సైతం పరిష్కరిస్తానని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో సమస్యలు తీరాలన్నా, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నా సునీతమ్మను గెలిపించుకోవాలని తెలిపారు. అలాగే కూకట్ పల్లి లో విజయనగరం,శ్రీకాకుళం వంటి జిల్లాల నుంచి వచ్చిన వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత ముఖ్యమంత్రిగా తనదంటూ హామీ ఇచ్చారు. పాలమూరు ,రంగారెడ్డి ,కరీంనగర్, వరంగల్ ఇలా అన్ని జిల్లాల నుండి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు, ఈ రోడ్డు షోలో పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్, అభ్యర్థి పట్నం సునీత, మాజి మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు హరివర్ధన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం శ్రీరంగం,షేరి సతీష్ రెడ్డి ,నాయకులు ,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మతోన్మాద విచ్ఛిన్నకర శక్తులను ఓడించండి

- సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్



నవతెలంగాణ-దుండిగల్

మతోన్మాద విచ్ఛిన్నకర శక్తులను ఓడించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్ అన్నారు. 138వ మే డే కార్మిక దినోత్సవం సందర్భంగా బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా బాచుపల్లి ఎస్సీ కాలనీ ఇంద్రానగర్ మున్సిపల్ వార్డు ఆఫీస్ రాజీవ్ గాంధీ నగర్‌లలో విస్తృతంగా జండా ఆవిష్కరణలు ర్యాలీ, సభ నిర్వహించారు. పతాకావిష్కరణలు మున్సిపల్ నాయకురాలు ఎస్ ఎల్లమ్మ, పెంటమ్మ, కే.లక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్, స్థానిక నాయకులు మాణిక్యం ఎస్.యాదయ్య రాజశేఖర్ చేశారు. ఈ సందర్భంగా ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడి దారుల పాలకవర్గాల దోపిడీ దాడులు అణిచివేతలు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకుంటూ వర్గ ఐక్యతను కాపాడుతున్న శ్రామిక ప్రజలకు కార్మిక దినోత్సవం మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. మేడే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతమన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 4 లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికులను పెట్టుబడిదారులకు బానిసలుగా తయారు చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం లౌకిక ప్రజాతంత్ర మౌలిక విలువలనే మట్టి పెట్టేస్తుంది అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని అధికారం చాలాయించాలని చూస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం కార్మిక చట్టాలు హక్కులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక కార్పొరేట్ మతోన్మాద బీజేపీ పార్టీని 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాల్సిన బాధ్యత కూడా కార్మిక వర్గానిదేనని పిలుపునిచ్చారు. మేడే వర్ధిల్లాలి సోషలిజం వర్ధిల్లాలి శ్రామిక వర్గ అంతర్జాతీయ వాదం వర్ధిల్లాలి శ్రామిక కర్షక ఐక్య పోరాటాలు వర్ధిల్లాలి సామ్రాజ్యవాదం నశించాలి అని నినదించారు. ఈ కార్యక్రమంలో నరసింహ శ్రీను వెంకట్ శివ రాజశేఖర్ విటల్ పద్మ లక్ష్మీ సతీష్ తదితర నాయకులు కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో చింతల్ త్రివేణి పాఠశాల విద్యార్థుల విజయం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పదవ తరగతి 2024 పరీక్షా ఫలితాలలో త్రివేణి (చింతల్ బ్రాంచ్) విద్యార్థులు విజయదుందుభి మ్రోగించి, ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచారని పాఠశాల ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 8 మంది జీపీఏ 10/10,జిపిఎ 9.8 పైగా 7 గురు విద్యార్థులు, జీపీఏ 9పైగా, జీపీఎస్ సాధించిన విద్యార్థులు 42 అని తెలియజేశారు. బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ జీపీఏ 10/10 సాధించిన ప్రతిభ కనబరిచిన యశ్వంత్ చౌదరి, లహరి, అభినవ్ సాకేత్ రెడ్డి, శ్రీవిద్య, సాయి మనోహిత, శ్రీ చక్ర సుధన్వ, భార్గవి, సాత్విక్‌లకు పుష్పగుచ్చాలు అందజేసి, అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆల్వాల్ జోనల్ ఇన్‌చార్జి వెంకట్రావు మాట్లాడుతూ. ఏ1,ఏ2 గ్రేడులు మొత్తంగా 309 వచ్చాయని, గణితంలోఏ1, ఏ2 గ్రేడులు మొత్తంగా 42,సైన్స్‌లో ఏ1, ఏ2 గ్రేడులు మొత్తంగా 52, సోషల్ లోఏ1,ఏ2 గ్రేడులు మొత్తంగా 59 వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జి క్రాంతి, ఇన్‌చార్జిలు వనిత, మీనా, చిన్నారావులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను, రాజ్యాంగాన్ని రక్షించుకుంటాం



నవతెలంగాణ-దుండిగల్

మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను, రాజ్యాంగాన్ని రక్షించుకుంటాం అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. 138వ మేడే వేడుకలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద మేడే ఆశి యాదయ్య అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కోలన్ నీలా గోపాల్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేయగా , ముఖ్య అతిథిగా ఏఐటీయుసీ మున్సిపల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాములు, ఏఐటీయుసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గయ్య, బాబు, బాలకృష్ణ, వెంకన్న, రాజు, కృష్ణ పుషమ్మా, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి..
లౌకిక, ప్రజాస్వామిక శక్తులను గెలిపించండి




- సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల పరిధిలో సీఐటీయూ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో షాపూర్ నగర్ భగత్ సింగ్ నగర్ జగద్గిరిగుట్టలో మేడేను ఘనంగా నిర్వహించారు. అనంతరం షాపూర్ నగర్ సీఐటీయూ ఆఫీసులో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా సీఐటీయూ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1886వ సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో 18 గంటల పని విధానానికి వ్యతిరేకంగా 8 గంటల పని విధానం కావాలని కార్మికులు సమ్మె చేస్తే యాజమాన్యం, పోలీసులు జరిపినదాడిలో తమ రక్తాన్ని చిందించిపోరాడి కార్మికులు తమ హక్కులను సాధించుకున్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మికులు మే 1 తేదీన మేడే ఉత్సవాలను జరుపుకుంటున్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మిక వర్గంపై అనేక భారాలు మోపుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్మికులకు పని గంటలు పెంచి సంఘం పెట్టుకునే హక్కును కాల రాసింది. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పటం విపరీతంగా నిత్యవసర ధరలు పెంచి ప్రజలపై అనేక బారాలు మోపింది రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తీసుకు వచ్చి రైతుల మనుగడకి నష్టం కలిగించే చర్యలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కమిటీ నాయకులు కే బీరప్ప, పి.అంజయ్య, ఈ దేవదానం, ఆర్.స్వాతి, సీపీఐ(ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు బి.సత్యం, ఆటో యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కే.పి.హెచ్.బి కాలనీ భవన నిర్మాణదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ రావు, కృష్ణా రెడ్డి, సాయి బాబా చౌదరి, రాజేష్, సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద మే డే వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ డంపింగ్ యార్డు వద్ద మేడేను పరమేష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఆశి.యాదయ్య, ఏఐటీయూసీ మున్సిపల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాములు, ఏఐటీయుసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్‌లు హాజరై జెండా ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేస్తామని తెలిపారు. మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను, రాజ్యంగాన్ని పరిరక్షించుకుంటామని, 138వ మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గయ్య, మల్లికార్జున్, పరిమేశ్, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ఎంబీఏ విద్యార్థులకు సత్కారం



నవతెలంగాణ-దుండిగల్

మల్లారెడ్డి విశ్వవిద్యాలయం(ఎంఆర్‌యు) కు చెందిన ఎంబీఏ 2024 బ్యాచుకు చెందిన ప్రతిష్ట కనబరిచి విజయాలను అందుకున్న విద్యార్థులను బుధవారం మేమెంటోలు అందజేసి సత్కరించారు. హైదరాబాదులోని దూలపల్లి మైసమ్మగూడలో గల మల్లారెడ్డి విశ్వవిద్యాలయం (ఎంఆర్‌యు) యూనివర్సిటీలో గల ఆడిటోరియంలో సన్‌స్టోన్ సహకారంతో ఎంబిఏ సూపర్ అచీవర్స్, క్లాస్ ఆఫ్ 2024 కి విద్యార్థులను ఘనంగా వేడుక నిర్వహించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సిహెచ్ మల్లా రెడ్డి, ప్రత్యేక అతిథిగా ఎంఆర్ యు వైస్-ఛాన్సలర్ వీఎస్‌కె రెడ్డి, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లో 70 శాతం ఇప్పటికే ఉద్యోగాలను పొంది ఉండగా, జూలై నాటికి 100 శాతం ప్లేస్‌మెంట్‌ని సన్‌స్టోన్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిష్టాత్మక సంస్థలైన అమెజాన్, టిఎంఐ గ్రూప్, బజాజ్ అలియాన్జ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ అసెట్ మేనేజ్‌మెంట్, ఐడిఎఫ్ సి ఫస్ట్ బ్యాంక్, అంబుజా సిమెంట్ మొదలైన ప్రతిష్టాత్మక సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. సన్‌స్టోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ వాటల్ మాట్లాడుతూ... మా లక్ష్యం అసాధారణమైన అభ్యాస అనుభవం అందించటం, అని అన్నారు. యజమాన్యం మల్లారెడ్డితోపాటు అతని మొత్తం విశ్వవిద్యాలయ బృందం విద్యార్థులకు ఈ ఉన్నతమైన ఫలితాలను అందించడంలో మాకు సహాయపడింది తెలిపారు. పరిశ్రమ 4.0 నైపుణ్యాలు నగరంలో అత్యుత్తమ ప్లేస్‌మెంట్‌లతో విద్యార్థు లకు సాధికారత కల్పించడాన్ని మేము భవిష్యత్తులో సైతం కొనసాగించాలనుకుంటున్నాము అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్. మల్లా రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమకు సిద్ధంగా ఉన్న శిక్షణా విధానంతో మా విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అవకాశా లను అందించటం ద్వారా విద్యార్థుల జీవితానికి అపారమైన విలువను సన్‌స్టోన్ జోడించిందన్నారు. మా విద్యార్థులు సాధించిన విజయాన్ని వారితో జరుపుకోవడానికి ఇక్కడకు రావడం నిజంగా గౌరవంగా ఉందని అన్నారు. అలాగే, విసి వీఎస్‌కె రెడ్డి ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, విజయవంతమైన కెరీర్‌ని ప్రారంభించిన విద్యార్థులలో ఆనందం చూసి తాను సంతోషిస్తున్నాని అని అన్నారు.

గడప గడపకు బాబా ఫసివుద్దీన్ ప్రచారం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. సికింద్రా బాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కలుస్తూ ప్రచారం చేస్తున్నారు. బుధవారం భరత్ నగర్ బస్తీలో, మధురానగర్ కాలనీలో విస్తత ప్రచారం నిర్వహించారు. బోరబండ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వైఎంసీఏలో సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్‌లోని వైఎంసీఏలో ఏడాది సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించినట్టు గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్ తెలిపారు. గత నెల 29వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సమ్మర్ క్యాంపు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ సమ్మర్ క్యాంపులో బాస్కెట్ బాల్, కరాటే, కుంగ్ఫూ, యోగా, టేబుల్ టెన్నిస్, స్పోకెన్ ఇంగ్లీష్, అబాకస్, డ్రాయింగ్, పెయింటింగ్, పర్సనా లిటీ డెవలప్మెంట్, కీ బోర్డ్, గిటార్, వయోలిన్ ఫోక్ డ్యాన్స్, జిమ్నాస్టిక్, బాడీ ఫిట్నెస్, హిప్ అప్ వెస్టన్ డ్యాన్స్, షటిల్ బ్యాట్మింటన్, భరతనాట్యం, తైక్వాండో, చెస్, ఫ్యాషన్ మోడలింగ్, స్కేటింగ్ మొత్తం 25 అంశాల్లో శిక్షణ అందిస్తామని చెప్పారు. నిపుణులైన టీచర్లతో ఈ శిక్షణ కొనసాగుతున్నదని, ప్రతీ రోజు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 25వ తేదీన ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతీ అంశంలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులతో పాటు సర్టిఫికేట్లు అందిస్తామని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సమ్మర్ క్యాంపులో చేర్పించి వారికి అభిరుచి ఉన్న రంగంలో మరింత రాణించేలా చూడాలని కోరారు.



సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్‌వీ ఫిర్యాదు

నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్ రెడ్డి గత ఏడాది యూనివర్సిటీ ఇచ్చిన సర్క్యులర్‌ను ఎడిట్ చేసి రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్‌వీ నేతలు ఆరోపించారు. గతేడాది సర్క్యులర్‌ను మార్చి ఫేక్ సర్క్యులర్‌ను చేశారని ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన తెలిపి బీఆర్ఎస్‌వీ నేతలు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభ లో విద్యార్థుల సమస్యలు ప్రస్తావించడంతో హాస్టల్, మెస్ లు కంటిన్యూ అవుతున్నాయన్నారు. ప్రజా పాలనలో ప్రశ్నించిన విద్యార్థులపై కేసులు పెడతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఎలక్షన్స్ ప్రచారానికి ఇచ్చిన సమయం, విద్యార్థుల సమస్యలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మెస్ బకాయిలు ఉన్నాయి వాటిని ముందు క్లియర్ చేయాలని కోరారు. గ్రూప్, టెట్, పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు పాల్గొన్నారు.



అసత్య ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఎన్ఎస్‌యూఐ నాయకులు

నవతెలంగాణ-ఓయూ

ఓయూ సర్క్యులర్‌పై అసత్య ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓయూ అధికారులు గత సంవత్సరం ఇచ్చిన సర్క్యులర్‌ను మార్చి ఓయూ ప్రతిష్టను భంగపరిచే విధంగా ఫేక్ సర్క్యులర్ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసి విద్యార్థి నిరుద్యోగులను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. కానీ ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి వారికి వసతి గహాలు సెలవులను రద్దుచేసి వారికి అకామిడేషన్ కల్పించిందని తెలిపారు. ఎవరైతే దుష్ప్రచారం చేస్తున్నారో వారి పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మెడ శ్రీను ,వంశీ రెడ్డి ,వినోద్ గౌడ్ ,సాయి ఓంకార్ గౌడ్ పాల్గొన్నారు.

సర్వేను కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి సునీత

నవతెలంగాణ-కంటోన్మెంట్



కాంగ్రెస్ మల్కాజగిరి ఎంపీ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డి బుధవారం మాజీ కేంద్రమంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సర్వే సత్యనారాయణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకుని ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సర్వే మాట్లాడుతూ ఆమె విజయం కోసం తన వంతు కృషి, సహాయం ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తులా పనిచేస్తానని తెలిపారు. ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారంలో పాల్గొంటానని చెప్పారు.



కాంగ్రెస్‌కు ఆల్ ఇండియా ఇండిపెండెంట్ చర్చెస్ డయాసిస్ మద్దతు

- చైర్మెన్ బిషప్ హ్యారీ సెబాస్టియన్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఆల్ ఇండియా ఇండిపెండెంట్ చర్చెస్ డయాసిస్ ఆధ్వర్యంలో బుధవారం ఎర్రగడ్డలోని ఏఐసీ చర్చిలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పాస్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏఐసీ చర్చి పాస్టర్ నేషనల్ చైర్మెన్ బిషప్ హ్యారి సెబాస్టియన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. దళితులు క్రిస్టియన్ మతం తీసుకున్నందున వారికి రావాల్సిన రిజర్వేషన్లు కోల్పోయి, అనేకమంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోయారని.. కావున మతం మారిన దళిత క్రైస్తవులు రిజర్వేషన్ శాతం పెంచుకునేందుకు పోరాటం చేయాలని, అందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి దళిత క్రైస్తవులకు న్యాయం చేసే లాగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బిషప్ హ్యారీ సెబాస్టియన్ మాట్లాడుతూ, బీసీ -సీ క్రైస్తవులకు ఇప్పుడున్న రెండు శాతం రిజర్వేషన్లు ఐదు శాతం పెంచేలాగ, అదేవిధంగా క్రైస్తవులకు కావలసిన నిధులు మంజూరు చేయించుకునేందుకు ఎన్నికల అనంతరం అందరం కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించుకుందామని తెలిపారు. బిషప్పులు వినోద్, దీపక్ జాన్, రాజేంద్రప్రసాద్, అరుణ్, బాలస్వామి, శ్రీనివాస్ రెడ్డి ఢిల్లీ నుండి వచ్చి ఈ సమావేశంలో పాల్గొన్నారు. నవీన్ యాదవ్‌ను శాలువాతో పూలమాలతో బిషప్ హ్యారి సెబెస్టియన్ సన్మానించారు.



భారత్ జాగృతి విద్యార్థి నాయకులు మునుకుంట్ల నవీన్ గౌడ్ తన జన్మదిన సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు







నవతెలంగాణ-కంటోన్మెంట్

కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తిరుమలగిరి కమ్యూనిటీ హాల్, బోయిన్పల్లి సర్కిల్ కార్యాలయం, జూబ్లీ జూబ్లీ బస్ స్టేషన్ వద్ద, బోయిన్‌పల్లి మార్కెట్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో మార్కెట్ ఆవరణలో, జేబీఎస్ టాక్సీ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఏఐటీయూసీ జెండాను వారు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ పరిధిలో ఉన్న కార్మికులకు యూనియన్ ఏర్పాటు చేసి గత 20 సంవత్సరాలుగా అనేక హక్కుల్ని సాధించటం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగాల క్రమబద్ధీకరణకు పోరాటం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.ఈ కార్యక్రమాల్లో బోయిన్‌పల్లి మార్కెట్ హమాలి యూనియన్ నాయకులు ఎన్.ఎల్లయ్య, కే. కొమురయ్య, రాజు, లింగం, మహేందర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలకష్ణ, శేఖర్, నాగరాజు, ప్రసాద్, నాగమణి గీత, జేబీఎస్ టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు శ్రీకాంత్, కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డిబి దేవేందర్, మధుకర్, వందలాదిమంది కార్మికులు పాల్గొన్నారు.

మేడే వేడుకల్లో శ్రీ గణేష్

కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ మేడే వేడుకల్లో పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం జేబీఎస్ వద్ద ఏఐటీయూసీ కార్మిక నాయకుడు నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపిస్తే కార్మికుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు, అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు సొంత ఇంటిని ఏర్పాటు చేసేందుకు, ఉద్యోగాల క్రమబద్ధీకరణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బోయిన్‌పల్లి మార్కెట్ హమాలి యూనియన్ నాయకులు ఎన్ ఎల్లయ్య, కే కొమురయ్య, రాజు, లింగం, మహేందర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, శేఖర్, నాగరాజు, ప్రసాద్, నాగమణి గీత, జేబీఎస్ టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు శ్రీకాంత్, కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డిబి దేవేందర్, జంపన ప్రతాప్ వందలాదిమంది కార్మికులు పాల్గొన్నారు

మెంటల్ హాస్పిటల్‌లో మేడే వేడుకలు

జూబ్లీహిల్స్ : ఎర్రగడ్డ లోని గవర్నమెంట్ మెంటల్ హాస్పిటల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి, మెంటల్ హాస్పిటల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్, జోన్ నాయకులు గడసందు బిక్షపతి, మెంటల్ హాస్పిటల్ యూనియన్ ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్, శ్రీధర్, తిరుపతి రెడ్డి, కమిటీ సభ్యులు బి భాగ్య పి లక్ష్మి ,ఎస్ లింగయ్య, ఏ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో

ఓయూ : ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జెండాను ఓయూ యూనియన్ నాయకులు బుధవారం లక్ష్మి ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ఆర్ శంకర్ అధ్యక్షత వహించగా ఇఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎల్ .పద్మ, కాంట్రాక్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ శ్రీనివాస్, పీడీఎస్‌యూరాష్ట్ర నాయకులు ఎస్ నాగేశ్వరరావు ,ఓయూ నాయకులు సుమంత్ లు పాల్గొని ప్రసంగించారు. ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్ ఉద్యోగులు సంఘటిత చైతన్యంతో తమ డిమాండ్ల సాధన కోసం నిరంతరాయంగా పోరాడుతున్నారని అన్నారు. ఓయూ నాయకులు సావిత్రి, జయ శివ కుమార్ ,సుల్తాన్, ఈశ్వరయ్య, కృష్ణ విజయ ,భారతి ,పద్మ, అనిత, సారయ్య, జంపయ్య, భూమయ్య, యాస్మిన్, విజయ ,శ్రీనివాస్, ఉజ్వల, పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజ్ వేదికగా ఏఐటీయూసీ ఓయూ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ పావని మాట్లాడుతూ. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎన్నికలలో ఓడించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కామ్రేడ్ శ్రీనివాస్ కార్మిక నేతల పాల్గొన్నారు.

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను యూనియన్ ఉపాధ్యక్షురాలు అనసూయ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, ఓయూ యూనియన్ అధ్యక్షులు టీ.మహేందర్ మాట్లాడుతూ . రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా కార్మికుల బతుకులు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ టైమ్ స్కేల్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాబోయే కాలంలో కార్మికులందరికీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఓయూ యూనియన్ నాయకులు కరీం,దేవేందర్,శ్రీను, సీతయ్య,ఔట్స్ సోర్సింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు,ఉపాధ్యక్షులు శ్రీను,నాగరాజు,మోహన్ నాయ కులు యాదమ్మ, మాక్సూద్,శ్రీకాంత్, వేంకటేశ, పద్మలక్ష్మి, రాజు,రమేష్, నేహురు పాల్గొన్నారు.







ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మే డే



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లిలోని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జెండా ఆవిష్కరణ చేసి కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమజీవుల కష్టానికి గుర్తింపు, చెమట చుక్క విలువలకు చాటింపు, కార్మిక పోరాటానికి మేలి మలుపు మే డే అని అన్నారు. కార్మికుల సమస్యలు తెలుసుకొని కార్మికుల జీతభత్యాలు, ఈఎస్ఐ, పీఎఫ్, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మెన్, బీఆర్ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, కార్మిక సంఘాల నాయకులు నారాయణ, వేముల మారయ్య, హమాలి శ్రీను, ప్రభాకర్, నరసింహ చారి, సత్యనారాయణ, సంతోష్ కుమార్ ,శిరోజుద్దీన్, రాజయ్య తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

మేడేను పురస్కరించుకొని తార్నాక డివిజన్ లో కార్మికులు, శ్రామికులతో కలిసి బుధవారం ఐఎన్‌టీయూసీ జెండాను జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు ఆవిష్కరించారు. కార్మికులును ఆత్మీయంగా పలకరించి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అని పలు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విధులు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఒప్పంద కార్మికులు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరగా సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రగతికి నిరంతరం శ్రమిస్తున్న కార్మిక లోకానికి అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీటీయూసి గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్, చల్లా లక్ష్మారెడ్డి, మోతె నవీన్ రెడ్డి, అశోక్, కిరణ్ రెడ్డి, కార్మిక సంఘం నాయకులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

సెయింట్ మార్క్ పాఠశాల విజయకేతనం





నవతెలంగాణ-బేగంపేట్

పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి ఫలితాలను తీసుకొచ్చారని సెంట్ మార్క్స్ స్కూల్ డైరెక్టర్లు శైలేందర్, గాయత్రి అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో 9.8 జీపీఏ వచ్చిన బాలికను పూల బొకేతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి ఫలితాలను రాబట్టారని, ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల కృషి ఎంతో ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సాయి మాట్లాడుతూ... ఫలితాలు ఎంతో సంతోషాన్నిచ్చాయని ఈసారి కాలేజీలో కూడా అమ్మాయిలు ఎంతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించారని కొనియాడారు.

జలమండలిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2022 బ్యాచ్‌కి చెందిన ఆరుగురితో కూడిన ట్రైనీ ఐఏఎస్ బందం జలమం డలిని సందర్శించింది. ఒకరోజు ఒరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి విచ్చేసి జలమండలి కార్యకలాపాల గురించి వారు తెలుసుకున్నారు. ఎండీ సుదర్శన్ రెడ్డి బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. కోటి 30 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహా నగరానికి భారీ పైపు లైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతిని తెలిపారు. దీంతో పాటు నీటి శుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్‌కు భారీ మోటర్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్ జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, కార్మికుల కోసం జలమండలి చేపట్టే రక్షణ చర్యలతో పాటు ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్- 1, 2 ప్రాజెక్టులు, వంద శాతం మురుగు శుద్ధి కోసం చేసే ఎస్టీపీల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాబోయే 50 ఏండ్లలో చేపట్టే భవిష్యత్తు కార్యాచరణ గురించి తెలిపారు. అనంతరం వారు మినీ జెట్టింగ్, సిల్ట్ కార్టింగ్, ఎస్పీటీ వాహనాలతో పాటు రోబోటిక్ సీవర్ క్రాక్ తదితర యంత్రాల పని తీరును డైరెక్టర్ ఆపరేషన్స్ - 1 అజ్మీరా కష్ణ వివరించారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం



- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప
- కార్మిక వ్యతిరేకి బీజేపీని ఓడించాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,

నవతెలంగాణ-బంజారాహిల్స్

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిమ్స్ హాస్పటల్ లో యూనియన్ బ్యాంకు వద్ద సభ నిర్వహించి, నిమ్స్ గేటు వద్దకు ప్రదర్శనగా వెళ్లి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సభకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ నగరి బీరప్పలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రంగించారు.

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప మాట్లా డుతూ... నిమ్స్ కార్మికులకు, సిబ్బందికి మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. నిమ్స్ హాస్పటల్లో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరు ఒక కుటుంబం లాగా భావించి పనిచేయాలని కోరారు. ప్రభుత్వం వైపు నుంచి కార్మికులకు రావలసిన సదుపాయాలు అన్ని ఇచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం పాలాడుగు భాస్కర్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను బీజేపీ కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి 4 లేబర్ కోడ్లుగా మార్చి 12 గంటల పని దినాన్ని తీసుకొచ్చి కార్మిక వర్గాన్ని నయా బానిస విధానంలోకి తీసుకెళ్తున్నదని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో కార్మికులు రైతులు పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరపకుండా కులం, మతం, ప్రాంతం ఆధారంగా ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు వేయించుకొని మరోసారి అధికారంలోకి రావా లని బీజేపీపన్నాగం పన్నుతున్నదని అన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం వస్తే కార్మికుల బతుకులు పెనం మీద నుండి పొయ్యిలో పడతాయని హెచ్చరించారు. కావున రాబోయే ఎన్నికలలో కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించాలని పిలుపు ఇచ్చారు.

నర్సెస్ యూనియన్ అధ్యక్షురాలు ఆషా లత, ప్రధాన కార్యదర్శి విజయకుమారిలు మాట్లాడుతూ... కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో సమస్యల మీద కలిసి పని చేద్దామని అన్నారు. యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో పెరిగిన ఉత్పత్తి, ఆదాయం మొత్తం ఒక శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులు, భూస్వాముల అధీనంలో ఉన్న దని విమర్శించారు. నూటికి 99 శాతంగా ఉన్న కార్మికులు కష్టజీవులు, పేదల బ్రతుకులు దీనాతి దీనంగా పూట గడవని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా మోడీ చేసిన అభివృద్ధి అని ప్రశ్నిం చారు.ప్రధానమంత్రి మోడీ చెప్తున్నట్టు భారతదేశం ప్రపంచంలోనే 5వ ఆర్థిక వ్యవస్థ, లేదా 3వ ఆర్థిక వ్యవస్థ అయినా కష్టజీవులకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. కనీస వేతనాన్ని రూ26,000/- వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మేడే స్ఫూర్తితో రాబోయే కాలంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటంలోకి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహులు,వెంకటేష్ యూనియన్ నాయకత్వంతో పాటు, కార్మికులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజుకు నేడే చివరి రోజు

జిల్లా డీఐఈవో దాసరి ఒడ్డెన్న

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో తప్పిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించడానికి నేడు(గురువారం) చివరి రోజు అని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దాసరి ఒడ్డెన్న తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సకాలంలో విద్యార్థులు ఫీజు చెల్లించి పరీక్షలు రాయాలనీ, కళాశాల ప్రధానోపాధ్యాయులు ఎదైనా కారణం చూపి ఫీజులు చెల్లింపునకు నిరాకరించినచో సదరు యాజమాన్యంపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించి పరీక్షలు సిద్ధం కావాలని సూచించారు. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు.

బాలికపై లైంగికదాడి.. 20 ఏండ్ల జైలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మతిస్థిమితం లేని బాలికను అపహరించి లైంగికదాడికి పాల్పడిని నిందితుడికి రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 25వేల జరిమానా విధించింది. వివరాల్లోకెళ్తే.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన 47 ఏండ్ల బూడిద బాల నర్సయ్య నల్గొండ జిల్లాకు చెందిన మతిస్థిమితం లేని ఓ 16 ఏండ్ల బాలికను అపహరించి బంధువుల ఇంట్లో బంధించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక మెడలో బలవంతంగా తాళి కట్టి పెండ్లి అయినట్లు నమ్మించాడు. సమాచారం అందుకున్న మంచాల పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందూతుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా 9వ అదనపు మెట్రోపాలిటన్ స్టేషన్ కోర్టు న్యాయమూర్తి హరీష సోమవారం తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.10 లక్షల పరిహారం మంజూరు చేశారు.

జోరుగా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-జవహర్ నగర్

కాంగ్రెస్ పార్టీతోనే జవహర్ నగర్ అభివృద్ధి సాధ్యమవుతుందని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. జవహర్ నగర్‌లోని 25వ డివిజన్ జామల్పూర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఇంటి ఇంటి ప్రచారంలో ముఖ్య అతిథులుగా పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మేయర్ దొంతగాని శాంతికోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బింగి సతీష్ గౌడ్, దేవేందర్ రెడ్డి, నరిశెట్టి కిరణ్, అనంత లక్ష్మి, బొబ్బిలి మంజుల, మందుల రజిత, సుగుణ, లత, సునీత, భాస్కర్, మాధవి, జానకి, మంగ, మంజు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో..



పేద ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. మల్కాజిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం జవహర్‌నగర్‌లోని 4వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మారగోని నాగరాణి వెంకటేష్‌తో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మారగోని వెంకటేష్ గౌడ్, శ్రీమన్నారాయణ, సంగపాక రాము, జడల శేఖర్, పొలాస కిరణ్, జడల క్రిష్ణ, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల కాలనీలో..



గడప గడపకు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు వివరించాలని కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్ అన్నారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని జవహర్ నగర్‌లోని 28వ డివిజన్‌లో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, సీనియర్ నాయకులు బూడిద వెంకటేష్‌లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తూచా తప్పకుం డా అమలు చేస్తున్నామని, అందుకే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు.

శామీర్‌పేటలో..



పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డికి మద్దతుగా మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి 14వ వార్డు (వంధాంంంవ ల్లి) ఎలగలగూడలో బుధవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళీ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ కార్యదర్శి మురళి గౌడ్,మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ధర్మారెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు హరిగోపాల్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శేశాంత్,మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దర్శన్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ప్రదీప్ కుమార్, సత్యనారాయణ,మున్సిపల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మధు రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, సాయిరాం, కిట్టు, ఎన్ఎస్‌యూఐ నాయకులు భరత్ రెడ్డి, ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపు.. మల్కాజిగిరి అభివృద్ధికి మలుపు : మైనంపల్లి

నేరేడ్‌మెట్‌లో..

కాంగ్రెస్ గెలుపు మల్కాజిగిరి అభివృద్ధికి మలుపు అని కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ రైల్వే ట్రాక్ దగ్గర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ..రానున్న పార్లమెంట్ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను మల్కాజిగిరిలో అర్హులైన పేదలకు అందించే బాధ్యత తనదన్నారు. ప్రజలు ఆలోచించి ఈ ఎన్నికల్లో ఓటు వేయా లని, గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరిలో తప్పు జరిగిదని సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. ఇకనైనా ప్రజలు రేవంత్ రెడ్డికి మద్దతుగా, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హరివర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, పిట్ల శ్రీనివాస్, నాగరాజు, సతీష్ కుమార్, గుండా నిరంజన్, శ్రీనివాస్, తమిళ్ కన్న, వినోద్ యాదవ్, చంద్రకాంత్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశం



జవహర్‌నగర్‌లో..

కాంగ్రెస్ నాయకులందరూ సమన్వయంతో అందరినీ కలుపుకొని పని చేయాలని సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్‌లు అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో జరుగుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. రానున్న 10 రోజులు ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీలను ప్రజలకు వివరించాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలలో జవహర్ నగర్ నుంచి 20,000 మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి కోటేశ్ గౌడ్, డిప్యూటీ మేయర్‌రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, బల్లి శ్రీనివాస్, కన్నయ్య రాజు, నరిశెట్టి కిరణ్, దేవేందర్ రెడ్డి, కాయిత రాజు యాదవ్, మహమ్మద్ ఫారూఖ్, అనంతలక్ష్మి, బొబ్బిలి మంజుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకుల్లో సమన్వయలోపం..

కాంగ్రెస్ నాయకులలో సమన్వయ లోపంతో ప్రచారం ఒకరికి తెలియ కుండా మరొకరు నిర్వహిస్తున్నారు. కొత్త పాత నాయకుల మధ్య సమన్వయం లేక సామాన్య కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. అందరూ నాయకులు కలిసి పని చేయాలని పై నాయకత్వం చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే ఎలక్షన్లలో ఇబ్బందులు తప్పవని సామాన్య కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను పార్టీ నాయకత్వం గుర్తించి కోర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా నాయకులందరూ సమిష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని సామాన్య కార్యకర్తలు కోరుకుంటున్నారు.

బీజేపీలో చేరికలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి,నందా రెడ్డిల ఆధ్వర్యంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో బీజేపీ చేరారు.బీజేపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ,మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్,నాయకులు బాల్ రాజ్, ముత్యాలు,సుధాకర్,ఎస్ లింగం,కుమార్,సిహెచ్ లింగం, చెంద్రం,పెద్ద శ్రీనివాస్,ఎస్ నరసింహ,శంకరయ్య,అర్జున్, నరసింహ,గాలి శ్రీను ఉన్నారు.కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శైలజ హరినాథ్,మాజీ సర్పంచ్ నాలబాపని నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక శిక్షణ శిబిరంలో ఓరిగామి శిక్షణ



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం లో ఏడోరోజు ఓరిగామిలో జన విజ్ఞాన వేదిక మల్కాజిగిరి మండల అధ్యక్షులు శివ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా డైలీ ఉపయోగించే న్యూస్‌పేపర్‌తో పేపర్ గ్లాస్‌లను, టోపీలను, సూట్ కేసులను తయారు చేశారు. రకరకాల పువ్వులు, బొమ్మలను ఎలా తయారు చేయాలో నేర్పించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ మన చుట్టూ నిత్యం లభించు అనేక రకాల వస్తువులతో మనకు ఎంతగానో ఉపయోగపడే పరికారాలను తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్టల నాగరాజు, జెన్నీ, శివ శంకర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



మే డే సందర్భంగా చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే. చంద్రశేఖర్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు.

నవతెలంగాణ,కాప్రా



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్, మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేఎల్ఆర్, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, శంకర్ ధనరాజ్ గౌడ్, యాదయ్య మహేందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

12

ఎల్బీనగర్ -మహేశ్వరం

గురువారం | మే 2, 2024 | www.navatelangana.com

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ - హయత్ నగర్

ఎల్బీనగర్ కాంగ్రెస్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ నేతృత్వంలో పలువురు బీఆర్ఎస్ నుంచి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. హయత్ నగర్ డివిజన్ నుండి యం.రాఖీ గౌడ్ ఆధ్వర్యంలో, నాగోల్ డివిజన్ నుండి పెద్దపూర బ్రహ్మయ్య వినయ్ కుమార్‌ల, లింగోజిగూడ డివిజన్ నుండి జాజుల కిశోర్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి , జక్కిడి ప్రభాకర్ రెడ్డి , మల్లారపు శాలిని, యండి జానీమియా, గుర్రం శ్యాంచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల్లో స్ఫూర్తిని రగిలిస్తూ

వేసిన ముందడుగే 'మేడే'



శ్రమిద్దాం.. శ్రమని గౌరవిద్దాం..

నవతెలంగాణ - చైతన్యపురి



శ్రమిద్దాం.. శ్రమని గౌరవిద్దాం అని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి అన్నారు. వనస్థలిపురంలోని అంకిత ఎన్జీఓ, డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావం ఏ ఒక్క దేశం, సంఘటనకో పరిమితం కాదు.. శ్రమదోపిడిని నిరసిస్తూ యావత్ ప్రపంచ కార్మికుల్లో స్ఫూర్తిని రగిలిస్తూ వేసిన ముందడుగే 'మేడే' అని అన్నారు. అనంతరం అంకిత వారి ఆధ్వర్యంలో అర్హులైన వారికి లేబర్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, హిరియా నాయక్, డాక్టర్ బిగాడ్ అహ్మద్, దేవేంద్ర చారి, తౌఫీఖ్ కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్



జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ చౌరస్తాలో మే డే సంద ర్భంగా సీఐటీయూ జెండాను మహిళా కార్మికురాలు పొన్నమ్మ ఎగురవేశారు. అనంతరం సీఐ టీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి పి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల్లారా ఏకంకండి..మతోన్మాద విచ్ఛిన్నకరమైన శక్తులను ఓడించండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగయ్య, జీహెచ్ఎంసీ సూపర్వైజర్ రావుల శేఖర్, సంతోష్ వినయ్ రావు, కార్మికులు జయమ్మ, మంజుల, కళావతి, స్వరూప, రాజేశ్వరి, జి లక్ష్మి, అనురాధ, హేమలత, ఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్





ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను పురస్కరించుకొని తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని కోహెడ, తొర్రూరు, మునగనూర్, బ్రాహ్మణపల్లి, ఇంజాపూర్, కమ్మగూడ, రాగన్నగూడ, తుర్కయంజాల్ గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల, పరిశ్రమల కార్మికులు బుధవారం ఎర్రజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం నుండి రొక్కం సత్తిరెడ్డి కళ్యాణ మండపం వరకు కార్మికులు, ఉద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించి హాల్ ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి. కిషన్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె. భాస్కర్ తుర్కయంజాల్ సీఐటీయూ నాయకులు ఎం. సత్యనారాయణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్, అడ్వకేట్ కె. అరుణ్ కుమార్, నాయకులు భాస్కర్, శంకర్, వెంకట కృష్ణ, శంకరయ్య, మాల్యాద్రి, కృష్ణ, రవి, మధు, శారద, బీరప్ప, బాల్ రాజ్, ఆశీర్వాదం, మాధవ రెడ్డి, జాఫర్, మెతరి దాసు, నవీన్, మహేష్, యాదగిరి, గోపాల్, శ్రీను, రవి, లక్ష్మి, జంగమ్మ పుష్పమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. ట

నవతెలంగాణ-తుర్కయంజాల్



మేడే స్ఫూర్తితో కార్మికులు తమ సమస్యలపై పోరాటాలు చేయాలని ఏ ఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. మే డే దినోత్సవం సందర్భంగా తుర్కయంజాల్ చౌరస్తాలో ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్, ఏఐటీయూసీ నాయకులు కాటంరాజు, కొండి గారి శివ, గువ్వలరాజు, చెక్క యాదగిరి, భాస్కర్, ఆనంద్ సుందరమ్మ, మల్లేష్, శ్రీకాంత్, విజయ శ్రీనివాస్, కృష్ణ, నారాయణ, నాగరాజు, నాగేశ్వర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - హయత్‌నగర్

మేడే స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేసుకోవాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. మే డే ఉత్సవాలను హయత్ నగర్ మండల సమితి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అధ్యక్షులు గోల్కొండ నాగరాజు సారధ్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తర్వాత ఆటోనగర్ ఇసుక లోడింగ్ అన్లోడింగ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా సబ్ కమిటీ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, ఎ.ఐ.వై.ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పోలోజు, లక్ష్మణాచారి ఎ.ఐ.యస్.ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి శ్రీదేవి, ఇసుక లోడింగ్ అన్లోడింగ్ సంఘం కార్యదర్శి సురేందర్, మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు సుజాత, సరిత, అటో ట్రాలీ యూనియన్ అధ్యక్షుడు బిచపల్లి. శంకర్, బి.ఒ.సి. నాయకులు జాని, వేంకట్, చంది వేంకట్, యువజన సంఘం నాయకులు శోభన్, యనమల్ల.శ్రీకాంత్, ముత్తయ్య, రాములు, సోషల్ మిడియా వారియర్స్ మమత, ప్రజాసంఘాల నాయకులు, కార్మిక శ్రేణులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- నాగోల్



నాగోల్ డివిజన్ జైపూర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మేడే సందర్భంగా జైపూర్ కాలనీ చౌరస్తాలో జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో బషీర్ అలీ, జైపూర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామల యాదగిరి, కాలనీ వైస్ ప్రెసిడెంట్ శంకర్, శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ రాహుల్ పోతని, జాయింట్ సెక్రెటరీ కస్తూరి అశోక్, రాజు యాదవ్, శ్రీశైలం యాదవ్, రమేష్, అమరేందర్, శ్రీనివాస్ సిహెచ్.వెంకటేష్, రాజ మల్లయ్య, ఏ వెంకటేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తా నగర్‌లో మేడే సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మంథని యాదయ్య బుధవారం జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు గడ్డం రవీందర్, కే.రాములు, కస్తూరి శ్రీను, మహిళా సంఘం నాయకులు కమార్ , సంతోష్, శ్రీను, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

ప్రజా పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చిగిరింత మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కుర్మల్‌గూడ 10వ డివిజన్‌లో జన్నారం కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలకు మేయర్ హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కుర్మల్‌గూడ10వ డివిజన్ జన్నారం కాలనీలో రికవరీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మేయర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంగర్ అండ్ కరంచారి కాంగ్రెస్(కె.కె.సి) పార్టీ చైర్మన్ కౌసల్ సమీర్, ప్రధాన కార్యదర్శి రుద్రాక్షణ మల్లేష్, కె.కె.సి పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మైన, వర్కింగ్ ప్రెసిడెంట్ కవిత, నాయకులు ఆనంద్ రెడ్డి, ఎల్లేష్, జంపయ్య, మధు పాల్గొన్నారు.





నవతెలంగాణ - హయత్ నగర్

మే డేను పురస్కరించుకొని హయత్‌నగర్‌లోని ఆర్టీసీ 1,2 డిపోల వద్ద, బొమ్మల గుడి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద, హయత్ నగర్ బస్ స్టాండ్‌లలో జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా శాఖ ఆర్గనైజర్ భీమనపల్లి కనకయ్య, కామ్రేడ్ శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికుల పక్షాన మాట్లాడేటటువంటి సీపీఐ(ఎం) అభ్యర్థి కామ్రేడ్ జహంగీర్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

నవతెలంగాణ- నాగోల్

సీఐటీయూ ఆధ్వర్యంలో నాగోలు డివిజన్లో బుధవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూ నాగోల్ భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి ఎండి లతీఫ్ అధ్యక్షతన నిర్వహించిన మే డే ఉత్సవాలకు భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి చైతన్య, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి మనోహర్, సరూర్నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై సీఐటీయూ జెండాను ఎగరవేశారు. ఈ వేడుకల్లో సీపీఐ(ఎం) పార్టీ కన్వీనర్ సిహెచ్ వెంకన్న, ఆంజనేయులు, రజక సంఘం సి మల్లేష్, న్యూ నాగోల్ కమిటీ అధ్యక్షులు డి. రవి, కమిటీ సభ్యులు మీ సైదయ్య, ఎం జానకి రాములు, తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ - బడంగ్‌పేట్



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీలో ప్రజా కార్మిక సంఘం, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నబాయ్ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదయ్య యాదగిరి చారి, కమిటీ సభ్యులు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

అదేవిధంగా జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో మహేశ్వరం నియోజకవర్గం టీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు గౌడల్లి దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో మే డే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల్లో పనిచేసే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య ఆధ్వర్యంలో మేడే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకన్న, మనోహర్, జీ చైతన్య, సి నవీన్, ఎండి లతీఫ్ , మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



నవతెలంగాణ -నాగోల్



మేడే సందర్భంగా నాగోలు ప్రధాన కూడలి గాంధీ సెంటర్లో బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ వేడుకలలో ఉప్పల్ మండల కార్యదర్శి పులిరాం నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు ఉడతల మల్లేష్ గౌడ్, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ, భూపతి, సురేష్, ఎండి బషీర్, వెంకటేశ్, రాములు, జంగయ్య, నర్సింహా రావు, సైదరావు తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ చేస్తున్న సీఐటీయూ నాయకులు దాసరి బాబు, యాదగిరి చారి, యాదగిరి తదితరులు..









నవతెలంగాణ- సంతోష్‌నగర్

మే డే సందర్భంగా సింగరేణి కాలనీలో సీపీఐ సీనియర్ నాయకుడు శంకర్ నాయక్, డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, ఏఐటీయూసీ ఆటో యూనియన్ హైదరాబాద్ కార్యదర్శి జంగయ్య, సీపీఐ నాయకులు అంజయ్య, శామ్, రవి తదితరులు జెండాను ఎగురవేశారు.

కీరదోసతో అద్భుత ప్రయోజనాలు..!

కీరదోసను సూపర్‌ఫుడ్‌గా పరిగణిస్తారు. దీన్ని తినటంవల్ల వేసవిలో చాలా ఉపశమనం లభిస్తుంది. దీనిని సలాడ్‌గా తినవచ్చు.. చాలా మంది దీనిని రైతాలో చేర్చడానికి ఇష్టపడతారు. దోసకాయలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, కార్బోహైడ్రేట్లు, మెగ్నీషియం, పొటాషియం మాంగనీస్ వంటి అనేక పోషకాలున్నాయి. దోసకాయలో 96శాతం నీరు ఉంటుంది, ఇది శరీరంలో డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. హెల్త్‌లైన్ నివేదిక ప్రకారం, దోసకాయలు చాలా శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. దోసకాయను తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. దోసకాయ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. దోసకాయను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా మన రోజువారీ నీటి అవసరాల్లో 40శాతం పొంద వచ్చు. ఇది మధుమేహాన్ని నియంత్రించడంలోనూ సహాయ పడుతుంది. మీరు స్థూల



కాయంతో బాధపడుతూ, బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న ట్లయితే.. కీరదోసకాయను తప్పని సరిగా తినాలి.

కీరదోసకాయలో చాలా తక్కువ క్యాలరీలు ఉంటాయి. కొవ్వు అస్సలు ఉండదు. అధిక పరిమాణంలో దీనిని తింటే బరువు తగ్గడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ■

కొబ్బరితో కమ్మగా..



కొబ్బరిలో మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలున్నాయి. రోజుకో చిన్న ముక్క కొబ్బరి తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణ వ్యవస్థను చురుగ్గా మారుస్తుంది. బరువు తగ్గాలి అనుకునే వారికి కొబ్బరి మంచి ఆప్షన్. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు... విటమిన్ ఏ, బీ, సీతో పాటూ ఇనుము, కాల్షియం కూడా ఇందులో ఉంటాయి. మెదడు ఆరోగ్యానికీ ఇది చాలా అవసరం. పచ్చి కొబ్బరి లేదా, కొబ్బరితో వండిన వంటకాలు తినడం వల్ల శరీరం నీరు కోల్పోకుండా ఉంటుంది. డీహైడ్రేషన్ సమస్య వస్తే శరీరం పట్టుతప్పుతుంది. కొబ్బరి ఎక్కువగా తింటే గుండె జబ్బులు వస్తాయనే అపోహ ఉంది కానీ, అది నిజం కాదని చెబుతున్నారు వైద్యులు. కొబ్బరికి, గుండె జబ్బులకు సంబంధమే లేదంటున్నారు.

కొబ్బరి వడలు

కావలసిన పదార్థాలు

కొబ్బరి కోరు - అర కప్పు, బియ్యం - ఒక కప్పు, బియ్యంపిండి - పావు కప్పు, జీలకర్ర - ఒక టీస్పూను, ఉప్పు - తగినంత, నూనె - సరిపడినంత



తయారీ విధానం : బియ్యాన్ని నాలుగైదు గంటల పాటూ నానబెట్టుకోవాలి, తరువాత మిక్సీలో నానబెట్టిన బియ్యం, జీలకర్ర వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అందులోనే బియ్యం పిండి, కొబ్బరి కోరు, ఉప్పు వేసి కలుపుకోవాలి. ఈ పేస్టును ఓ గిన్నెలోకి తీసుకోవాలి. పిండి బూరెల సైజులో చేత్తో గుండ్రంగా చుట్టాలి. ఒక అరిటాకు లేదా, పాలిథిన్ కవర్ పై చేత్తోనే వడల్లా ఒత్తుకోవాలి. మరో పక్క కళాయిలో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడెక్కాక చేత్తో ఒత్తుకున్న వడలను అందులో వేసి వేయించాలి. అవి పూరీల్లా పొంగుతాయి. రుచి కూడా బావుంటుంది. కొంతమంది వీటిలో పంచదార కలుపుకుంటారు.

కొబ్బరితో కార్న్ ఇడ్లీ..

కావలసిన పదార్థాలు :

మొక్కజొన్న నూక - రెండు కప్పులు, కొబ్బరి పాలు - ఒక కప్పు, నూనె - రెండు టేబుల్ స్పూన్లు. ఆవాలు -ఒక టేబుల్ స్పూను, శనగపప్పు - ఒక టీ స్పూను, పల్లీలు - పావు కప్పు, అల్లం తురుము - రెండు టీ స్పూన్లు, పచ్చిమిర్చి -2 (చిన్నగా తరగాలి). ఉప్పు - తగినంత, బేకింగ్ సోడా - ఒక టీ స్పూన్, నెయ్యి - కొద్దిగా.

తయారీ విధానం :

ముందుగా నూనె వేడి చేసుకుని అందులో వేరుశనగలు, శనగపప్పు, ఆవాలు, అల్లం తురుము,



పచ్చిమిర్చి ముక్కలు వేసుకుని చిన్న మంట మీద వేయించుకోవాలి. అందులో మొక్కజొన్న నూక వేసుకుని నిమిషం పాటు గరిటెతో అటూ ఇటూ తిప్పుతూ వేయించుకోవాలి.

ఆ తర్వాత కొబ్బరిపాలు, బేకింగ్ సోడా కలుపుకుని ఇడ్లీ పిండిలా చేసుకోవాలి. అనంతరం ఇడ్లీ ప్లేటుకు నెయ్యి రాసుకుని.. కొద్దికొద్దిగా మిశ్రమం వేసుకుని ఆవిరిపై ఉడికించుకోవాలి. ఇవి బలానికి బలాన్నీ, రుచికి రుచినీ అందిస్తాయి.

కొబ్బరి బొబ్బట్లు

కావలసిన పదార్థాలు :

బెల్లం తరుగు - పావు కిలో, తురిమిన కొబ్బరి - పావు కిలో, శనగపప్పు - పావు కిలో, గోధుమపిండి - 300 గ్రాములు, యాలుకల పొడి - ఒక స్పూను.

తయారీ విధానం : కుక్కర్లో ముందుగా నానబెట్టిన శనగపప్పును వేసి ఆరు నుంచి ఏడు విజిల్స్ వరకు ఉడికించాలి. అప్పుడు పప్పు బాగా మెత్తగా ఉడుకుతుంది. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నెయ్యి వేయాలి. ఆ నెయ్యిలో బెల్లం తరుగు, కొబ్బరి తురుమును వేసి బాగా కలపాలి. చిన్న మంట మీద పెడితే ఇవి మాడకుండా ఉంటాయి. అందులో యాలకుల పొడిని చల్లి బాగా కలుపుకోవాలి. ముందుగా ఉడికించుకున్న శనగపప్పును నీరు లేకుండా వడగట్టుకొని వేసుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని బాగా కలపాలి. గట్టిగా అయిన తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి. ఇప్పుడు గోధుమ పిండిలో కాస్త నూనె లేదా నెయ్యి వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. పిండి మృదువుగా కలుపుకున్నాక చిన్న ముద్దను తీసుకొని పూరీలాగా ఒత్తుకోవాలి. అందులో శనగగపిండి, కొబ్బరి తురుము మిశ్రమాన్ని పెట్టుకొని దాన్ని పూరీలా మడత పెట్టుకొని తిరిగి ఒత్తుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి నెయ్యి వేయాలి. దానిపై ఒత్తుకున్న బొబ్బట్లు వేసుకొని రెండు వైపులా కాల్చుకోవాలి. ఇది చాలా టేస్టీగా ఉంటుంది.

కొబ్బరితో దోసె..

కావలసిన పదార్థాలు :

బియ్యం - రెండు కప్పులు, తురిమిన కొబ్బరి - అర కప్పు, చక్కెర - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు తగినంత.



తయారీ విధానం :

బియ్యాన్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వడకట్టి.. బియ్యం, కొబ్బరి తురుము వేసి మెత్తగా రుబ్బుకోవాలి. తరువాత పిండిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. పంచదార, ఉప్పువేసి కలపాలి. తరువాత వాటిని దోసెల మాదిరిగా నూనె వేసి, కొద్దిగా మందంగా వేసుకోవాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి.

కొబ్బరి పాలతో 'ఫిష్' కర్రీ...

కావలసిన పదార్థాలు : చేపముక్కలు - 8, ఉల్లిగడ్డ పేస్ట్ - 4 స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్-2 స్పూన్లు, పచ్చిమిర్చి పేస్ట్- 2 స్పూన్లు, జీలకర్ర పొడి- 4 స్పూన్లు, కారం - 2 స్పూన్లు, పసుపు పొడి- 2 స్పూన్లు, గరం మసాలా పొడి- టీ స్పూన్, జీలకర్ర- ఒక స్పూను, కొబ్బరి పాలు- రెండు కప్పులు, నూనె- 4 స్పూన్లు, ఉప్పు- సరిపడా.

తయారు చేసే విధానం:

మొదటగా చేప ముక్కలకు కొద్దిగా పసుపు, ఉప్పు పట్టించి అరగంట పక్కన పెట్టుకోవాలి.



అరగంట తర్వాత చేప ముక్కలను నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి. ఫ్రై చేసిన తర్వాత... వాటిని మరో ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. అదే పాత్రలో... మరికొంచెం.. నూనె వేసి కాగిన తర్వాత... జీలకర్ర, బిర్యానీ ఆకు వేసి కొద్దిగా ఫ్రై చేసుకోవాలి. తర్వాత అందులో ఉల్లిగడ్డ పేస్ట్ కూడా వేసి బ్రౌన్ కలర్ వచ్చే వరకూ ఫ్రై చేసుకోవాలి. తర్వాత అందులోనే జీలకర్ర పొడి, కారం, వేసి కాసేపు వేయించాలి. కొద్దిసేపటి తర్వాత కొబ్బరి పాలను తీసుకొని... ఆ మిశ్రమంలో పోస్తూ... కలుపుకోవాలి.

ఇప్పుడు అందులో చేప ముక్కలు వేసి... చిన్నగా కలపాలి... తగినంత ఉప్పువేసి... చేపముక్కలు పూర్తిగా ఉడికే వరకూ సన్నని మంట మీద ఉడికించుకోవాలి. చివ రిగా అందులో గరం మసాలా పొడి వేసి, కొత్తిమీర వేసి స్టౌ ఆఫ్ చేయాలి. 10 నిమిషాలు అలాగే ఉంచి... స్టౌ మీద నుంచి దించుకోవాలి. ఇక మీకు... కొబ్బరి పాలతో ఫిష్' కర్రీ రెడీ అయినట్లే. అన్నంతో తింటే చాలా రుచిగా ఉంటుంది. ■

గుమ్మడి గింజలతో..



గుమ్మడి గింజలు. ఈ గింజలు తినడం వలన కలిగే ఆరోగ్య ఫలితాలు తెలిస్తే వాటిని తప్పకుండా ఆహారంలో భాగం చేసుకుంటాం. గుమ్మడిలో న్యూట్రిషియన్స్, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇంకా ఇవి తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము.

- శరీరంలో చెడు కొవ్వు పేరుకోకుండా కాపాడుకోవాలంటే గుమ్మడి గింజలు తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.
- గుమ్మడి గింజలు క్యాన్సర్ నివారిణిగా పనిచేస్తాయని నిపుణులు చెపుతున్నారు. ప్రొస్టేట్ గ్రంథుల వాపును తగ్గించడానికి వైద్య పరంగా గుమ్మడి కాయ సరిపోతుంది. గుమ్మడి తీసుకోవడం వలన చక్కెర వ్యాధిగ్రస్తులకు మేలు జరుగుతుంది. రక్తంలోని గ్లూకోజ్‌ను బాగా తగ్గిస్తుంది.
- గుమ్మడి గింజల నుంచి తీసిన నూనెను ఉపయోగించడం వలన అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. గుమ్మడి గింజల్లో వివిధ రకాల నొప్పులను నివారించగలిగే యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే రక్తం పలుచగా వుండేవారు గుమ్మడి గింజలకు దూరంగా వుండాలి.

రేవంత్ అడ్డగోలు మాటలపై చర్యలేవి..?

నవతెలంగాణ-మహబూబాబాద్

"ఎన్నికల కమిషన్ నా మీద నిషేధం విధించింది. 48గంటల పాటు కేసీఆర్ ప్రచారం చేయొద్దని ఆదేశించింది. అయితే, రేవంత్ రెడ్డి.. కూడా నా పేగులు మెడలో వేసుకుంటా.. నీ గుడ్లు పీకుతా.. అని అడ్డగోలు మాటలు మాట్లాడారు. మరి ఆయనపై ఎందుకు నిషేధం పెట్టలేదు. నా మాటలను అధికారులు సరిగ్గా అర్థం చేసుకున్నట్టు లేదు. నా వ్యాఖ్యలకు ఆంగ్ల అనువాదం కరెక్టు కాదు. 48 గంటలు నా ప్రచారాన్ని నిషేధిస్తే దాదాపు 96 గంటలు లక్షలాది బీఆర్ఎస్ కార్యకర్తలు అవిశ్రాంతంగా పనిచేస్తారు." అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఇదంతా కాంగ్రెస్, బీజేపీ పన్నిన కుట్ర అని తెలిపారు. బుధవారం మహబూబాబాద్‌లో ఎంపీ అభ్యర్థి మాలోతు కవితకు మద్దతుగా నిర్వహించిన రోడ్డు షోలో కేసీఆర్ మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ నీళ్లు, నిధులు దోచుకోవడానికి కుట్ర చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానుకోట జిల్లా రద్దు చేస్తానంటున్నారని, కాబట్టి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని కోరారు. నరేంద్ర మోడీ గత ఎన్నికల్లో నల్లధనాన్ని బయటకుతీసి పేద ప్రజల ఒక్కొక్క ఎకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తానని చెప్పి ఒక్క పైసా వేయలేదన్నారు. కృష్ణా జలాలను కేంద్రం పరిధిలోకి తీసుకున్నారని, రాబోయే రోజుల్లో గోదావరి నీళ్లనూ తీసుకుపోవడానికి మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మారుమూల గిరిజన ప్రాంతమైన మానుకోట అభివృద్ధి చెందాలని తాను మానుకోట జిల్లాను ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లా రద్దు చేస్తానని అంటున్నారని, కవితని గెలిపిస్తేనే మీ జిల్లా మీకు ఉంటుందని లేకుంటే పోతుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరోజూ సాగునీరు రాలేదని, కరెంటు సక్రమంగా లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే వెన్నవరం కాలువలో నీళ్లు వచ్చాయని, ఎస్సారెస్పీ కాలువలు నిర్మాణం పూర్తి చేసి నీళ్లు ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఈ మూడు నెలల్లో ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చింది లేదని అన్నారు. కేసీఆర్ కాలంనాటి 24 గంటలు విద్యుత్ ఏమైందని, మిషన్ భగీరథ పథకం ఏమైందని ప్రశ్నించారు. మళ్లీ రైతులు బోరుబావిలో పైసలు పోసుకుని అప్పుల పాలవుతూ ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. తెలంగాణ నీళ్లు, నిధులు రక్షించబడాలంటే బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ బస్సు యాత్రలో అభ్యర్థి మాలోతు కవిత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సత్యవతి రాథోడ్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

4 రాష్ట్రాల్లో ఏడుగురు నాయకులకు సమన్లు

న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మాట్లాడినటువంటి ఒక వీడియోలో మాటలను తారుమారు(ఎడిట్) చేసిన కేసుకు సంబంధించి మోడీ సర్కారు సీరియస్‌గానే దృష్టిసారిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల జరుగుతున్న ఈ తరుణంలో కీలక నేతలనే టార్గెట్ చేస్తున్నది. ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు రాజకీయ నేతలు, ఇతర వ్యక్తులకు సమన్లు అందాయని సంబంధిత అధికారిక వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ ఆదివారం ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందని వివరించాయి.

పోలీసు నోటీసు.. వీడియోకు సంబంధించిన సమాచారాన్ని కూడా కోరింది. అలాగే, వారి సంబంధిత ఎక్స్ హ్యాండిల్ నుంచి అప్‌లోడ్ చేయబడిన వాటిని సమర్పించమని కూడా కోరింది. అంతేకాకుండా, వీడియోను అప్‌లోడ్ చేయటానికి ఉపయోగించిన ఎలక్ట్రానిక్ పరికరంతో పాటు వీడియో రికార్డ్ చేయడానికి ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాన్ని తీసుకురావాలని పోలీసులు కోరారు. కేంద్ర హోం మంత్రికి సంబంధించిన వీడియోలను షేర్ చేస్తున్న లింక్‌లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను ఫిర్యాదుతో జత చేసినట్టు కూడా పేర్కొన్నది. సోమవారం ఢిల్లీ నుంచి ఇద్దరు పోలీసు అధికారులు నోటీసులు అందజేయడానికి హైదరాబాద్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌కు చేరుకున్న విషయం విదితమే.

నన్నే బెదిరిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. విపక్షాలపై ఈడీ, సీబీఐ సంస్థలతో అక్రమ కేసులు బనాయిస్తూ భయపెట్టి ఎంత కాలం బతుకుతారని, కానీ ఇక్కడ భయపడేందుకు ఎవరూ సిద్ధంగా లేరని అన్నారు. బెదిరించి పెత్తనం చెలాయించాలంటే నిజాం నవాబుకు పట్టిన గతే మోడీ, షాలకు పడుతుందని అన్నారు. తనపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన కేసీఆర్‌నే ఓడించామని, ఆ పార్టీని బొందపెడుతున్నామని చెప్పారు. ఢిల్లీలో బీజేపీకి ఈడీ, సీబీఐలాంటి సంస్థలు ఉండవచ్చుగానీ, తనకు నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. బీసీ గణనను ఎందుకు అడ్డుకుంటున్నారో అమిత్‌షా చెప్పాలని, బీసీల రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

400 సీట్లు గెలిచి రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఈ పదేండ్లలో మోడీ హయాంలో దళిత, గిరిజన, బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయమూ జరగలేదని, దేశ సంపదంతా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ జనగణన చేసి వెనుకబడిన సామాజిక తరగతులకు న్యాయం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ కల్పించిన రిజర్వేషన్లతోనే చాలా మంది దళిత, గిరిజనులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా కొంత నిలదొక్కుకున్నారని చెప్పారు. అలాంటిది.. రిజర్వేషన్లు ఎత్తివేసే బీజేపీ రహస్య ఎజెండాపై తాను మాట్లాడినందుకే కేసు పెట్టారని అన్నారు. తాను మాట్లాడింది తప్పయితే ఈ రాష్ట్రంలోని బీజేపీ నాయకులు ఎందుకు ఫిర్యాదు చేయలేదో చెప్పాలన్నారు. నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, భవిష్యత్‌లో ఆయన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అవుతారని అన్నారు. సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, బోధన్ ఎమ్మెల్యే నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆ ట్విట్టర్ ఖాతా నాది కాదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్)ఖాతా (ఐఎన్ సీ తెలంగాణ)ను తాను నిర్వహించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పోలీసులకు స్పష్టత ఇచ్చారు. తెలంగాణ సీఎంఓ, తన వ్యక్తిగత ఖాతాలు మాత్రమే వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సీఎం తరపు అడ్వొకేట్ సౌమ్య గుప్తా బుధవారం ఢిల్లీ స్పెషల్ టీం పోలీసులకు వివరణ ఇచ్చారు. అనంతరం స్పెషల్ సెల్ ఎదురుగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫేక్ వీడియోను తెలంగాణ కాంగ్రెస్ ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా సర్క్యులేట్ చేశారని సీఆర్పీసీ 91 కింద నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఫేక్ వీడియోను షేర్ చేసిన డివైజ్ (ఫోన్, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్) ఇవ్వాలని కోరినట్లు అందులో పేర్కొన్నార న్నారు. ఈ అంశంపై సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి తరపున రిప్లై ఫైల్ చేసినట్లు సౌమ్య గుప్తా వివరించారు. 'ఐఎస్ సీ తెలంగాణ ట్విట్టర్ ఖాతాకు నేను ఓనర్ కాదు. ఆ ఖాతా నేను నిర్వహించడం లేదు. నేను కేవలం సీఎంఓ తెలంగాణ, నా వ్యక్తిగత ఖాతా... ఈ రెండింటిని మాత్రమే వాడుతున్నా. అందువల్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫేక్ వీడియో షేర్ చేయడం పై నాకు సంబంధం లేదు' అని రేవంత్ రెడ్డి పంపిన రిప్లై కాపీని పోలీసులకు అందించినట్లు సౌమ్య గుప్తా తెలిపారు. ఈ రిప్లై పై పోలీసులు ఏ విధంగా స్పందిస్తారనేది వారినే అడగాలని స్పష్టం చేశారు.

కాగా, రిజర్వేషన్ల పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫేక్ వీడియో వ్యవహారంలో సీఆర్పీసీ 91/160 ప్రకారం గత నెల 29 న సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ రాష్ట్ర నేతలకు ఢిల్లీ పోలీసులు



నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంలో మే 1(బుధవారం), ఉదయం 10:30 లకు ఢిల్లీలోని ద్వారక సెక్టార్ 16 సీ లోని స్పెషల్ సెల్ ముందు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. అలాగే అమిత్ షా వీడియోను షేర్ చేసిన ట్విట్టర్ హ్యాండిల్, ఆ ఖాతాను ఆపరేట్ చేసిన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఇతర సమాచారంతో రావాలని మెన్షన్ చేసింది. అయితే... ఈ నోటీసులకు సీఎం తన న్యాయవాది సౌమ్య గుప్తా ద్వారా సమాధానం పంపారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వయసున్న యువ ఓటర్లు 9,02,960 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 46 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందనీ, మిగతా వారికి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అత్యధికంగా మల్కాజిగిరిలో 3,226, అత్యల్పంగా మహబూబాబాద్‌లో 1,689 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాష్ట్ర పోలీసులతో పాటు 155 కంపెనీల కేంద్ర బలగాలను ఉపయోగిస్తున్నట్టు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సాధారణ పరిశీలకులు, పోలీస్ అబ్జర్వర్స్, వ్యయ పరిశీలకులు ఎన్నికల నిర్వహణలో చురుగ్గా పాల్గొంటారని వెల్లడించారు. పోలీసులు, ఇతరులతో కలిపి మొత్తం 2.94 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఒక్క ఈవీఎం మిషన్‌లో నోటాతో కలిపి 16 గుర్తులు మాత్రమే వస్తాయని తెలిపారు. ఈ క్రమంలో ఏడు నియోజక వర్గాల్లో 3, తొమ్మిది నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున ఈవీఎంలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆదిలాబాద్ స్థానంలో 12 మంది బరిలో ఉన్నందున అక్కడ ఒక్క ఈవీఎం సరిపోతుందని తెలిపారు. ఈ సారి అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండటంతో 1.5 లక్షల ఈవీఎంలు ఉపయోగిస్తున్నామని వివరించారు. మూడు కేటగిరీల వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను కల్పించామని తెలిపారు. వయసు రీత్యా 80 ఏండ్ల పైబడిన వారు 10,662, పీడబ్ల్యూడీ కేటగిరిలో 11,032 మంది, అత్యవసర సర్వీసులకు చెందిన 1884 మందికి ఇప్పటి వరకు ఓటు హక్కు కల్పించినట్టు తెలిపారు. ఈ నెల 3 నుంచి 6 వరకు 880 ఎన్నికల బృందాలు హోమ్ ఓటింగ్ కోసం పర్యటిస్తాయని తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఆయా తేదీల్లో నిర్దేశించిన చిరునామాలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఒకసారి హోమ్ ఓటింగ్ చేసుకున్న తర్వాత తిరిగి పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడం కుదరదని చెప్పారు. డిసెంబర్ ఒకటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.212 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఇతర ఆభరణాలు, డ్రగ్స్, నార్కొటిక్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి 7.185 కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఓటరు బాధ్యతగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేకి

(మొదటిపేజీ తరువాయి)


ఆవిష్కరించారు. పదేండ్లుగా అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, దానికి ప్రత్యామ్నాయంగా సీపీఐ(ఎం) ముందుకు సాగుతోందని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులను కొట్టి, కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ పాలకుల దమనకాండపై ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ అభ్యర్థించారు. మోడీ ప్రభుత్వం కార్మికుల పొట్టకొడుతూ వారి హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. కార్మికులకు మేలు చేయని కాషాయ ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందని అన్నారు. పదేండ్ల తన పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని పూర్తి సినిమా ముందుందని ప్రధాని మోడీ చెబుతున్నారని మండిపడ్డారు. తమ హక్కులను పూర్తిగా కాలరాసిన పాలన ట్రైలర్ అయితే ఇక రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో తలుచుకుంటేనే భయం వేస్తోందని వ్యవసాయ కార్మికులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. మోడీ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో సుభాషిణి అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో మేడే

సీఐటీయూ కేంద్ర కార్యాలయం (బీటీఆర్ భవన్)లో మేడే ఘనంగా జరిగింది. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు జెఎస్ మజుందార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కార్మిక కోడ్‌లను తెచ్చిందని దుయ్యబట్టారు. దీనివల్ల కార్మికుల హక్కులు నిర్వీర్యం చేస్తున్నారని, కార్మికుల సామాజిక భద్రత ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగంలో 70 కోట్ల మంది

- కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ



దిస్పూర్ : మోడీ సర్కార్ ప్రజా సమస్యల్ని విస్మరించి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు. అసోంలోని దుబ్రిలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రియాంక మాట్లాడుతూ.. 'కాషాయ పాలకులు ప్రజల ఇబ్బందులు పట్టించుకోరు. ఈరోజు దేశంలో నిరుద్యోగం అత్యధికంగా ఉంది. యువత ఉద్యోగాలు లేక తీవ్రంగా సతమతమవుతోంది' అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో 70 కోట్ల మంది నిరుద్యోగంతో బాధపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని మోడీ సర్కార్ సమాజంలో విభజన చిచ్చు రేపుతోంది. ఈ ఎన్నికల్లో 'ఇండియా' అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు ఈసీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

రూ.500 బోనస్ ఇవ్వకపోతే మీ గొంతు కోస్తం, చంపేస్తాం' అని కేసీఆర్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్ పై ఏప్రిల్ 6న టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జీ నిరంజన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వీడియో పుటేజీ, ఇతర సాక్ష్యాధారాలను అందించారు. అలాగే ఈసీ.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వారా నివేదిక తెప్పించుకుంది. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను జిల్లా ఎన్నికల అధికారి ఇంగ్లీష్‌లోని అనువదించి పంపించారు. ఈ వ్యాఖ్యలను పరిశీలించిన ఈసీ కేసీఆర్ పై చర్యలు తీసుకుంది. సిరిసిల్ల లో కాంగ్రెస్‌పై కేసీఆర్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబడుతున్నట్లు స్పష్టం చేసింది. ఆయన ఎన్నికల ప్రచారం పై తాత్కాలిక నిషేధం విధించింది.



గోల్కొండ చౌరస్తాలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బి.వి.రాఘవులు, పాలడుగు భాస్కర్

మిర్యాలగూడ ర్యాలీలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి తదితరులు




సీపీఐ కార్యాలయంలో..


సీఐటీయూ కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న పి.రాజారావు

ఆశీర్వదించండి
ప్రజల కోసం ప్రశ్నిస్తా..

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది ఎర్ర జెండానే : భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్

- సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకే ఓటేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ
- మంచాల మండలంలో ఎన్నికల ప్రచారం





నవతెలంగాణ-మంచాల

మతోన్మాద బీజేపీని, అవకాశవాద రాజకీయ శక్తులను ఓడించి, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించా లని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండు కోవాలని చూస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా మహిళలపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ముఖ్యంగా రాజ్యాంగాన్ని మార్చడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు చేరడం, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు చేరి, వారి ఆస్తులను కాపాడుకునేందుకు చూస్తున్నారని విమర్శించారు.

భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎం.డీ జహంగీర్ మాట్లాడుతూ.. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుంచి నేటి వరకు ప్రజల పక్షాన ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసింది ఎర్రజెండానేనని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దున్నే వాడికి భూమి కావాలని, కూలి రేట్లు పెంచాలని, రైతులు పండించిన పంటకు గిట్టు బాటు ధర కావాలని పోరాటం చేసింది, చేస్తుంది కమ్యూనిస్టులేనని తెలిపారు. ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే భువనగిరి ప్రాంత అభివృద్ధికి పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకను అవుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, శ్రీరామ్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు చంద్ర మోహన్, కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.జగన్, జి.నర్సింహ, మండల కార్యదర్శి నాగిళ్ళ శ్యామ్ సుందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మార బుగ్గ రాములు, సిలి వేరు రాజు, మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల పార్టీ శాఖ కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడేను వద్దన్న మోడీని
వదిలించుకుందాం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
ఖమ్మం పట్టణంలో మేడే ఉత్సవాలు



నవతెలంగాణ-ఖమ్మం

ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే విదేశీయులకు చెందిందని, మే డేని రద్దు చేస్తానని పిలుపునిచ్చిన ప్రధాని మోడీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించి కార్మిక ఐక్యతను చాటుకుందామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం నగరంలోని గ్రేయిన్ మార్కెట్ ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయం వద్ద మే డే 138వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మిక వర్గం ప్రాణతర్పణం చేసి సాధించుకున్నారని గుర్తు చేశారు. నేడు కార్మిక వర్గం అనుభవిస్తున్న ఏ హక్కు కూడా ఒకరి దయాదాక్షిణ్యాల మీద వచ్చినవి కాదని, పోరాడి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. కానీ నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆ కార్మిక చట్టాలన్నీ రద్దుచేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్లను ముందుకు తెస్తుందన్నారు. ఈ లేబర్ కోడ్‌లలో.. 12 గంటల పనివిధానం, సెలవు దినాలు లేకుండా, కార్మిక సంక్షేమ చట్టాల మార్పు, యజమాని, కార్మికుల మధ్య సంబంధాలను పక్కన పెట్టేలా, పూర్తిగా కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం రూపొందించారని విమర్శించారు. పైగా ఇప్పటివరకు ఉన్న హక్కులన్నీ విదేశీ చట్టాలని, మేడే పండుగ కూడా విదేశాల నుండి దిగుమతి అయిందని తప్పుడు వక్రీకరణలు చేస్తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మోడీని ఓడించడం ద్వారా మేడే స్ఫూర్తిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. భూక్య శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నున్నా నాగేశ్వరావు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, అధ్యక్షులు టి. విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద ఉస్మానియా యూనివర్సిటీ మెస్‌ల మూసివేతపై దుష్ప్రచారం చేసిన కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్, ఓయూ విద్యార్థి నాగేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం వారు కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా పంతంగి టోల్ గేట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


నవచిత్రం

ఆద్యంతం వినోదభరితం


అబ్బూరి రవి

అల్లరి నరేష్ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు'తో రాబోతున్నారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. రైటర్ అబ్బూరి రవి చిత్రానికి డైలాగ్స్ అందించారు. అల్లరి నరేష్ చాలా కాలం తర్వాత చేస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ కావడంతో ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈనెల 3న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానున్న నేపథ్యంలో డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మీడియాతో మాట్లాడుతూ, 'ఈ కథ దర్శకుడు మల్లిది. ప్రతి ఒక్కరి జీవితంలో సెటిల్ అవ్వడం అంటే ఉద్యోగం రావడం, పెళ్లి కావడం. అయితే ఇప్పుడు పెళ్లి విషయంలో యావరేజ్ ఏజ్ మారిపోతుంది. ఒకప్పుడు ఇరవై ఏళ్ళు వచ్చిన తర్వాత చేసుకునేవారు. ఇప్పుడు ఎప్పుడు చేసుకుంటారో ఎవరికీ తెలీదు. అందరూ సెటిల్మెంట్ గురించే మాట్లాడతారు. ఈ సినిమాలో ఒక మాట వుంటుంది. 'సెటిల్మెంట్ అంటే ఉద్యోగం, పెళ్లి కాదు.. మనకి ఒక అవసరం వచ్చినపుడు పక్కవాడి దగ్గర చేయి చాచకపోవడం". ఇప్పుడు కొన్నింటికి అర్థాలు మారిపోయాయి. పెళ్లి అనేది పూర్తిగా శాస్త్రోక్తమైనది. పెళ్లిలో జీలకర్ర బెల్లం పెట్టడం వెనుక సైన్స్ వుంది. జీలకర్ర బెల్లంలో కరెంట్ ప్రవహిస్తుంది. ఇద్దరి ఎనర్జీని బ్యాలెన్స్ చేసే ప్రక్రియ అది. ఆ సమయంలో ఆత్మ స్థానాన్ని చూడామని చెబుతారు. ఇంత శాస్త్రం వున్న పెళ్లిని లెక్కలేకుండా చేసుకునే పరిస్థితులు చూస్తున్నాం. నిజానికి ఇది సీరియస్ టాపిక్. ఇలాంటి సబ్జెక్టని వినోదాత్మకంగా చెబుతూనే ఎమోషనల్ కనెక్ట్ చేసేలా చూపించడం జరిగింది. ఇందులో ప్రత్యేకంగా సందేశం ఇవ్వడం లాంటిది ఉండదు. ఈవీవీ క్లాసిక్ సినిమా టైటిల్‌లో నరేష్ అద్భుతంగా నటించారు' అని చెప్పారు.

పుష్పరాజ్ సందడి మొదలైంది


అల్లు అర్జున్

ప్రపంచవ్యాప్తంగా సినిమా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం 'పుష్ప-2 ది రూల్'. 'పుష్ప ది రైజ్‌తో ప్రపంచ సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. ఇక ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సీక్వెల్ పుష్ప-2 ది రూల్ గురించి తాజాగా చిత్ర యూనిట్ ఇచ్చిన అప్‌డేట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది. ఈ చిత్రం నుంచి మే డే సందర్భంగా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ భాషల్లో 'పుష్ప..... పుష్ప... పుష్ప... పుష్పరాజ్' అంటూ సాగే తొలి లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప ది రైజ్.. 'ఎంతటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా గుర్తు చేయాల్సిన అవసరం లేదు. 2021 బిగ్గెస్ట్ కమర్షియల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది పుష్ప. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలవడంతోపాటు.. తనకు జాతీయస్థాయి అవార్డు తెచ్చి పెట్టిన చిత్రంగా రికార్డ్ క్రియేట్ చేసింది. దీంతో దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం పై భారీ అంచనాలు పెరిగాయి. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నారు. అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ-కథనం-దర్శకత్వం: సుకుమార్, నిర్మాతలు: నవీన్ ఏర్నేని, వై రవిశంకర్, సినిమాటోగ్రఫర్: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

సరికొత్త కాన్సెప్ట్‌తో నయా సినిమా



తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన దర్శకులు, నిర్మాతలు తీస్తోన్న చిత్రాలు విజయాన్ని సాధిస్తున్నాయి. కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలు ఎక్కువగా సక్సెస్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆర్ట్ మేకర్స్ సమర్పణలో మద్దుల మదన్ కుమార్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. సౌజన్య కావూరి నిర్మిస్తున్న ఈ మొదటి ప్రాజెక్ట్ ప్రొడక్షన్ నెం. 1కి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవల మణికొండలోని శివాలయంలో జరిగాయి.

ఈ కార్యక్రమానికి రచయిత, శ్రీశైల దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారు పురాణపండ శ్రీనివాస్, విరాజ్ అశ్విన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ ఈవెంట్‌లో పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ, సినీ రంగంలోకి వస్తోన్న కొత్త తరంలో కూడా ఎందరో ప్రతిభా సామర్థ్యాలతో అద్భుతాల్ని ఆవిష్కరిస్తున్నారు. ఏ విత్తనంలో ఎంతటి అద్భుత మహా వృక్షం దాగుందో తెలియకుండా విశ్లేషించకూడదు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని సాధించి, యూనిట్ అందరికీ మంచి పేరు రావాలని ఆశిస్తున్నాను' అని అన్నారు.ముహూర్తపు సన్నివేశానికి హీరో రవితేజ మహాదాస్యంపై 'బేబీ' ఫేమ్ విరాజ్ అశ్విన్ క్లాప్ కొట్టగా, రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ చిత్రానికి దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 'ఈ చిత్రంలో నటించే నటీనటుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం. ఓ మంచి కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇప్పటివరకు ఇలాంటి అంశంతో సినిమా రాలేదు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ సినిమా ఉంటుందని కచ్చితంగా చెప్పగలం' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్ : నితిన్ రెడ్డి చిమ్ముల, ఎడిటింగ్ : అఖిల్ దేశ్పాండే, సంభాషణలు, పాటలు : జక్క రాజశేఖర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ : మక్కెన విజయ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

కళ్లు చెదిరే జీఎస్‌టీ వసూళ్లు

- ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లు
- ఆల్‌టైం రికార్డ్ రాబడి



న్యూఢిల్లీ : దేశంలో రికార్డ్ స్థాయిలో అమాంతం పెరిగిన పన్ను వసూళ్లు ప్రభుత్వ ఖజానాను నింపివేస్తున్నాయి. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. గతేడాది ఏప్రిల్‌తో పోల్చితే గడిచిన నెలల్లో ప్రభుత్వాలకు జీఎస్‌టీ రాబడి రూ.2.10 లక్షల కోట్లకు చేరింది. దేశీయ లావాదేవీలు, దిగుమతుల్లో బలమైన వృద్ధి, జీఎస్‌టీ వసూళ్లు పెరగడానికి కారణమని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2017 జూలైలో జీఎస్‌టీ అమలులోకి వచ్చాక నెలవారీ వసూళ్లకు సంబంధించి ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. ఇప్పటివరకు గతేడాది ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు రికార్డ్‌గా ఉంది. అదే విధంగా 2024 మార్చిలో రూ.1.78 లక్షల కోట్లు, జనవరిలో రూ.1.74 లక్షల కోట్లు, 2023 అక్టోబరులో రూ.1.72 లక్షల కోట్లు చొప్పున జీఎస్‌టీ అధిక వసూళ్లు జరిగాయి. ఏప్రిల్ 2024లో రీఫండ్‌ల తర్వాత రూ.1.92 లక్షల కోట్ల నికర జీఎస్‌టీ వసూళ్లు నమోదయ్యాయి. మొత్తం పన్నుల్లో సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.43,846 కోట్లు, రాష్ట్రాల జీఎస్‌టీ వసూళ్లు రూ.53,538 కోట్లుగా చోటు చేసుకున్నాయి. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.99,623 కోట్లుగా ఉండగా.. ఇందులో దిగుమతి చేసుకున్న వస్తువులపై రూ.37,826 కోట్ల రాబడి ఉంది. అదే విధంగా రూ.13,260 కోట్లు సెస్ వసూలైంది. జీఎస్‌టీతో దేశంలో సరుకుల ధరలు తగ్గుతాయని.. బీజేపీ ప్రభుత్వం తొలుత పేర్కొంది. దీనికి భిన్నంగా ధరలు ఎగిసిపడి ప్రజల ఆదాయాలు హరించుకు పోతుంటే.. మరోవైపు మోడీ సర్కార్ ఖజానా పంట మాత్రం పండుతోంది.

కేఎస్‌బీ లిమిటెడ్‌కు రూ.43 కోట్ల లాభాలు

హైదరాబాద్ : పంపుల తయారీ కంపెనీ కేఎస్‌బీ లిమిటెడ్ 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 7.75 శాతం వృద్ధితో రూ.43.1 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.40 కోట్ల లాభాలు నమోదు చేసింది. కేఎస్‌బీ జనవరి నుంచి డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా భావిస్తుంది. గడిచిన మార్చి త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ రూ.489.6 కోట్ల నుంచి రూ.544.2 కోట్లకు పెరిగింది.

ఎంఎఫ్ జాయింట్ ఖాతాలకు
నామినీ తప్పనిసరి కాదు

- సెబీ కొత్త నిర్ణయం

ముంబయి : మ్యూచువల్ ఫండ్‌లో సంయుక్తంగా నిర్వహించే ఖాతాలకు నామినీ ఎంపిక తప్పనిసరి ఏమీ కాదని సెబీ స్పష్టం చేసింది. ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులను మరింత సులభతరం చేసే ఉద్దేశంతో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎవరైనా ఒకరికి జరగకూడనిది జరిగిన సమయంలో నిధుల బదిలీ సహా ఇతర ప్రక్రియలు సులువవుతాయని పేర్కొంది. జీవించి ఉన్న సభ్యుడిని నామినీగా చేర్చడాన్ని ఈ నిబంధన అవకాశం కల్పిస్తుందని సెబీ పేర్కొంది. అదే విధంగా కమొడిటీ, విదేశీ పెట్టుబడుల పర్యవేక్షణకు ఒకే ఫండ్ మేనేజర్ ఉండటానికి ఫండ్ హౌస్‌లకు అనుమతించింది.

తగ్గిన యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో డిజిటల్ నగదు చెల్లింపు (యూపీఐ) లావాదేవీలు 0.7 శాతం తగ్గి రూ.19.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం మార్చిలో విలువ పరంగా రూ.19.78 లక్షల కోట్ల లావాదేవీలు చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా అంటూ ఊదరగొడుతున్న నేపథ్యంలో నిజంగా ఇది ప్రాధాన్యత గల అంశమే. సంఖ్యా పరంగా ఏప్రిల్‌లో 1330 కోట్లు, మార్చిలో 1344 కోట్ల చొప్పున లావాదేవీలు జరిగాయి. మరోవైపు గత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఏటీఎంల నుంచి నెలవారీ నగదు ఉపసంహరణల సగటు రూ.1.43 కోట్లుగా ఉందని ప్రముఖ క్యాష్ లాజిస్టిక్స్ కంపెనీ సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ ఇటీవల తెలిపింది. 2022-23తో పోల్చితే 2023-24లో ఎటిఎంల్లో 5.51 శాతం నగదు ఉపసంహరణలు పెరిగాయి.

టాటా మోటార్స్ అమ్మకాల్లో 12 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ 2024 ఏప్రిల్‌లో 11.5 శాతం వృద్ధితో 77,521 యూనిట్ల అమ్మకాలు చేసింది. 2023 ఇదే మాసంలో 69,599 యూనిట్ల విక్రయాలు చేసింది. ఇదే నెలలో దేశీయ దేశీయంగా 68,514 యూనిట్లు సరఫరా చేయగా.. గడిచిన నెలలో 12 శాతం వృద్ధితో 76,399 యూనిట్లకు చేరింది. మొత్తం ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 2 శాతం, వాణిజ్య వాహన అమ్మకాల్లో 31 శాతం వృద్ధిని కనబర్చింది.

మారుతి అమ్మకాల్లో 5శాతం పెరుగుదల

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి 2024 ఏప్రిల్‌లో 4.7 శాతం పెరుగుదలతో 1,68,089 యూనిట్ల అమ్మకాలు చేసింది. గతేడాది ఇదే నెలల్లో 1,37,952 యూనిట్ల విక్రయాలు చేసింది. దేశీయ అమ్మకాలు స్వల్పంగా పెరిగి 1,37,952 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

హ్యుందాయ్ ఎగుమతులు భళా

హ్యుందాయ్ మోటార్ గడిచిన ఏప్రిల్‌లో 9.5 శాతం వృద్ధితో 63,701 యూనిట్ల విక్రయాలు నమోదు చేసింది. 2023 ఇదే నెలలో 58,201 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గడిచిన ఏప్రిల్‌లో హ్యుందాయ్ ఎగుమతులు 59 శాతం పెరిగి 13,500 యూనిట్లకు చేరాయి. గతేడాది ఇదే నెలలో 8,500 యూనిట్ల ఎగుమతులు చేసింది.

ఎంజీ మోటార్స్ ఇవిల దూకుడు

ఎంజీ మోటార్స్ ఇండియా గడిచిన నెల అమ్మకాల్లో 1.45 శాతం తగ్గి 4,485 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. 2023 ఇదే నెలలో 4,551 యూనిట్ల విక్రయాలు చేసింది. గడిచిన నెల మొత్తం అమ్మకాల్లో కంపెనీ విద్యుత్ వాహనాల వాటా 34 శాతానికి చేరింది.

టొయాటో అమ్మకాలు 32% పెరిగాయ్..

ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టొయాటో 2024 ఏప్రిల్‌లో 32 శాతం పెరుగుదలతో 20,494 యూనిట్ల అమ్మకాలు చేసింది. ఇందులో దేశీయంగా 18,700 యూనిట్లు, ఎగుమతులు 1,794 యూనిట్లుగా ఉన్నాయి. గడిచిన నెలలో మెరుగైన ప్రగతిని కనబర్చామని టికెఎం వైస్ ప్రెసిడెంట్ సబరి మనోహర్ పేర్కొన్నారు.

స్మైల్‌లో ఏఐతో డాబర్ జట్టు

హైదరాబాద్ : దంత సమస్యలపై అవగాహన పెంచడానికి డాబర్ రెడ్ ఫెస్ట్ ఓరల్ కేర్ ఫెస్ట్‌లో భాగంగా డెంటల్ క్యాంప్‌లను ప్రారంభించినట్లు తెలిపింది. స్మార్ట్‌బజార్ సహకారంతో స్మైల్.ఎఐ ద్వారా డెంటల్ స్క్రీనింగ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. "ప్రపంచంలోని ప్రముఖ ఆయుర్వేద టూత్‌పేస్ట్, డాబర్ రెడ్ పేస్ట్. లవంగం, పుదీనా, తోమర్ వంటి పదార్థాలతో వైద్యపరంగా తయారు చేయబడింది. ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేయడం, ప్రతి 6 నెలలకు దంతవైద్యుడిని సందర్శించడం, వైద్యపరంగా నిరూపితమైన ఆయుర్వేద టూత్‌పేస్ట్‌ను ఉపయోగించడం ద్వారా సమస్యల నుంచి బయట పడవచ్చు.." డాబర్ హెడ్ ఆఫ్ మార్కెటింగ్ ఓరల్ కేర్ అగస్టస్ డేనియల్ పేర్కొన్నారు. డాబర్ పేస్ట్, స్మార్ట్‌బజార్‌లతో భాగస్వామ్యం సంతోషంగా ఉందని స్మైల్.ఎఐ వ్యవస్థాపకురాలు డాక్టర్ పద్మ గడియార్ పేర్కొన్నారు.

ఐఏపీఏ నూతన అధ్యక్షుడిగా
డాక్టర్ రాజా నర్సింగ్‌రావు




హైదరాబాద్ : నగరంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లోని సీనియర్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ రాజా నర్సింగ్ రావు వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తాల్మిక్ అనస్థీషియా (ఐఏపీఏ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బ్రెజిల్‌లో జరిగిన సావోపాల్‌లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తాల్మిక్ అనస్థీషియా (డబ్ల్యూసీఓఏ)లో ఆయన ఎంపిక జరిగింది. డబ్ల్యూసీఓఏ అనేది ఒక అంతర్జాతీయ ఆప్తాల్మిక్ అనస్థీషియా నిపుణుల వేదిక. తుదపరి డబ్ల్యూసీఓఏ సమావేశాన్ని 2028లో హైదరాబాద్‌లో నిర్వహించాలని ఆ సంస్థ నిర్ణయించింది.

ఖరీదైన భోజనం



- ఐదేండ్లలో 71శాతం పెరిగిన వ్యయం
- 37 శాతమే పెరిగిన వేతనాలు



> మహారాష్ట్రంలో ఒక వ్యక్తి రోజువారీ సగటు జీతం 2019లో రోజుకు రూ.218గా వుండగా, 2024లో అది రూ.365గా వుంది. 30రోజులకు లెక్కిస్తే నెలవారీ ఆదాయాలు వస్తాయి. అదే సమయంలో ఒక వ్యక్తి సగటు వేతనం రూ.17,189 నుండి రూ.23,549కి పెరిగింది.

ఇంట్లో వండుకునే శాకాహార భోజనం సగటు వ్యయం గత ఐదేండ్లలో 71శాతం పెరిగింది. అదే సమయంలో, రాష్ట్రంలో రెగ్యులర్ ఉపాధి ద్వారా ఒక వ్యక్తి సంపాదించే సగటు నెలవారీ వేతనం కేవలం 37శాతమే పెరిగింది. ఇదే కాలంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా క్యాజువల్ కార్మికుల వేతనాలు 67 శాతం పెరిగాయి. అయితే, ఆహారంపై తమ నెలవారీ వేతనాల్లో అధిక వాటాను కార్మికులు ఇప్పటికే ఖర్చు చేస్తున్నారన్న అంశం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం కీలకం.

> ఒక భోజనం తయారు చేయడానికి అయ్యే ఖర్చు గత ఐదేళ్లలో 71శాతం పెరిగింది. అదే సమయంలో నెలవారీ వేతనాలు మాత్రం కేవలం 37శాతం పెరిగాయి. క్యాజువల్ కార్మికుల వేతనాలు, ధరల పెరుగుదలతో పాటూ పెరిగినా వారు ఇప్పటికే ఆహారంపై తమ ఆదాయాల్లో 20శాతం ఎక్కువగా ఖర్చు చేస్తుండడంతో వాటి వ్యయం కూడా గణనీయంగా పెరిగిపోయింది.

దీనిపై విశ్లేషణ చేయడం కోసం మనం ఇక్కడ సగటు భారతీయ కుటుంబం బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లు మూడింటి కింద రోజుకు రెండు భోజనాలు తిన్నట్లైతే వారి రోజువారీ ఆహార అవసరాలు తీరగలవని భావిద్దాం. గతంలోని డేటా సరిగా లేనందున మాంసాహార భోజనాలను ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం లేదు. అలాగే సరుకుల ధరలకు సంబంధించి స్థిరమైన డేటా అందుబాటులో వున్న కారణంగా మహారాష్ట్రను ఒక ఉదాహరణగా తీసుకున్నారు. పోల్చి చూసేందుకు మహారాష్ట్రలో కార్మికుల సగటు వేతనాలను, ఉద్యోగుల జీతాలను పరిగణనలోకి తీసుకున్నారు.

రెండు భోజనాలకు సగటున ఎంత ఖర్చు అవుతుందో నిర్ణయించడానికి ముందుగా, ఆ భోజనానికి వాడిన పదార్థాలను చూసినట్లైతే, బియ్యం, కందిపప్పు, ఉల్లి, వెల్లుల్లి, పచ్చిమిరప, అల్లం, టమోటా, బంగాళాదుంప, బఠాణీలు, గోధుమపిండి, కేబేజీ, సన్‌ఫ్లవర్ నూనె, ఉప్పు ఇవన్నీ రెండు సార్లు తినడానికి ఎంత మొత్తం కావాలో ఆ గ్రాములను కూడా లెక్కలోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో ఆ వస్తువులన్నీ కొనేందుకు సగటు రిటైల్ ఖర్చు ఈ ఏడాది మార్చి నాటికి ఎంత అవుతోంది, ఏడాది క్రితం అంటే 2023లో ఎంత అయింది, ఐదేళ్ల క్రితం 2019లో ఎంత అయిందో చూసేందుకు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ ఉద్యానవన బోర్డుల నుండి సేకరించిన సమాచారాన్ని ఆధారంగా తీసుకున్నారు. కొన్ని కూరగాయలకు డేటా అందుబాటులో లేదు. ముంబయిలో ధరలను పరిగణనలోకి తీసుకున్నారు.

ఉదాహరణకు, రెండు భోజనాలకు సరిపడా 125 గ్రాముల కందిపప్పు కొనుగోలు వ్యయం గత ఐదేళ్లలో రూ.9.30 నుండి రూ.20.1కి పెరిగింది. అలాగే 300గ్రాముల బంగాళాదుంపల వ్యయం రూ.6.8 నుండి రూ.8.6కి పెరిగింది.

మహారాష్ట్రలో రెండు థాలీలకు అవసరమైన పదార్థాల సగటు వ్యయం ఈ ఏడాది రూ.79.2గా వుండగా, గతేడాది రూ.64.2గా వుంది. 2019లో అయితే ఈ మొత్తం రూ.46.2గా వుంది. అంటే మహారాష్ట్రలో ఒక కుటుంబంలో రెండు భోజనాలు వండేందుకు అయ్యే వ్యయం నెలకు 2019లో రూ.1386గా వుండగా, 2024కు వచ్చేసరికి రూ.2377కి పెరిగింది.

నెలలో ప్రతిరోజూ రెండు భోజనాలకయ్యే వ్యయాన్ని, వేతనాలు లేదా జీతాల్లో ఒక వాటాగా పరిగణించినపుడు, క్యాజువల్ కార్మికుని నెలవారీ ఆదాయాల్లో 2019లో 21.1శాతంగా వున్న ఈ వాటా 2024లో 21.7శాతానికి పెరిగింది. విశ్రాంతి దినాలతో సహా అన్ని రోజులకూ కార్మికునికి జీతం చెల్లిస్తారని భావిస్తేనే ఇదంతా లెక్కలోకి వస్తుంది. ఇక రెగ్యులర్ వేతనాలు పొందే కార్మికుల విషయంలో ఇదే కాలంలో 8.1 శాతం నుండి 10.1శాతానికి గణనీయంగా పెరిగింది.

వేతనాల్లో, వ్యయాల్లో ఈ అసమానతల వల్ల రెగ్యులర్ వేతన జీవుల కుటుంబాలు నిత్యావసరం కాని ఇతర వస్తువులపై, విలాసవంతమైన ఉత్పత్తులపై పెట్టే ఖర్చును తగ్గించుకోవాల్సి వస్తుంది. ఇక రోజువారీ కూలీల కుటుంబాలైతే అలాంటి ఖర్చు అనేది వారికి కేవలం భ్రమగానే మిగిలిపోతుంది. ఎందుకంటే ఆహారంపై వారు పెట్టే ఖర్చు అసలే అధికంగా వుండేది ఇప్పుడు ఇంకా గణనీయంగా పెరిగిపోయింది.

నేడు కవిత బెయిల్ పిటిషన్ పై తీర్పు

- సీబీఐ కేసులో బెయిల్ కోరిన కవిత
- సుదీర్ఘ వాదనల తర్వాత నేటికి తీర్పును రిజర్వ్ చేసిన ట్రయల్ కోర్టు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్ పై గురువారం రౌస్ ఎవెన్యూ కోర్టు(ట్రయల్ కోర్టు) తుది తీర్పు వెలువరించనుంది. లిక్కర్ స్కాం వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 15న ఈడీ, ఏప్రిల్ 11న సీబీఐలు కవితను అరెస్ట్ చేశాయి. అనంతరం ఆమెకు ట్రయల్ కోర్టు జ్యూడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం జైల్లో ఉన్న తనకు రెగ్యూలర్ బెయిల్ మంజూరు చేయాలని కవిత రౌస్ ఎవెన్యూ కోర్టును ఆశ్రయించారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదని కవిత తరపున న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. అలాగే పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం%% కవిత మహిళ కాబట్టి బెయిల్ కు అర్హురాలని కోర్టుకు నివేదించారు. అప్రూవర్ల స్టేట్మెంట్లే తప్ప%% సరైనా ఆధారాలు లేనందున కవితకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అయితే, లిక్కర్ స్కాంలో కవితదే కీలకపాత్రని సీబీఐ తరపు న్యాయవాది పంకజ్ గుప్తా ఆరోపించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఆమె బయటికి వస్తే కేసును ప్రభావితం చేస్తారని%% అందువల్ల బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఇరువైపు వాదనలు విన్న స్పెషల్ జడ్జ్ కావేరి బవేజతీర్పును నేటికి రిజర్వ్ చేశారు. మరోవైపు ఈడీ కేసులోనూ కవిత బెయిల్ కోరగా%% ఈ పిటిషన్ పై వాదనలు ముగించిన ట్రయల్ కోర్టు తీర్పును మే 6 న వెల్లడిస్తామని స్పష్టం చేసింది. కాగా, కవిత జ్యుడిషియల్ కస్టడీ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కవితకు బెయిల్ వస్తుందా? లేదా అన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒకవేళ ట్రయల్ కోర్టు కవితకు బెయిల్ తిరస్కరిస్తే%% ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని ఆమె తరపు న్యాయవాదులు యోచిస్తున్నట్లు తెలిసింది.

మణిపూర్‌లో
ఆర్మీతో మెయిటీ మహిళా గ్రూపు ఘర్షణ

- అదుపులో ఉన్న 11 మంది సాయుధ దుండగులను తీసుకెళ్లిన వైనం
- రాష్ట్ర పోలీసుల వెల్లడి



ఇంఫాల్ : మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలో భారత సైన్యం నిర్బంధించిన 11 మంది సాయుధ దుండగులను భద్రతా దళాలతో ఘర్షణ పడిన మహిళలు లాక్కెళ్లారు. ఈ విషయాన్ని మణిపూర్ పోలీసులు తెలిపారు. ఆర్మీకి చెందిన మహర్ రెజిమెంట్.. పోలీసు యూనిఫారం ధరించిన 11 మంది సాయుధ దుండగులను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నది. వారి నుంచి తుపాకులు, గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నది. అయితే, మీరా పైబిస్ అనే మెయిటీ మహిళా సమూహం సైన్యంతో ఘర్షణ పడింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న ఆయుధాలను విడుదల చేయాలని మీరా పైబిస్ డిమాండ్ చేసినట్టు సమాచారం. దీంతో ఆర్మీ.. జిల్లా పోలీసులకు పరిస్థితిని తెలియ జేసింది. అక్కడికి చేరి ఎంత ప్రయత్నించినప్పటికీ దూకుడుగా జరిగిన ఘర్షణలో 11 మంది వ్యక్తులను లాక్కెళ్లారని రాష్ట్ర పోలీసులు చెప్పారు. బిష్ణుపూర్ పోలీసు సూపరింటెండెంట్ రవికుమార్, తంగా ఎమ్మెల్యే టి రాబింద్రో నేతత్వంలోని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత భద్రతా దళాలు గుంపును చెదరగొట్టాయి.

స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సురక్షిత కస్టడీలో ఉంచినట్టు పోలీసులు తెలిపారు. తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చిందనీ, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మణిపూర్‌లో గతేడాది మే ప్రారంభం నుంచి గిరిజన కుకీ, ఆధిపత్య మెయిటీ కమ్యూనిటీల మధ్య జాతి ఘర్షణలు చోటుచేసుకొని అది సుదీర్ఘంగా కొనసాగిన విషయం విదితమే. ఈ హింసాకాండలో ఏడాది కాలంలో కనీసం 224 మంది మరణించగా.. 60,000 మంది ప్రజలు తమ ఇండ్లను విడిచిపెట్టి వెళ్లిపోయినట్టు సమాచారం.

కొవిషీల్డ్ ముప్పు కారణాలపై దర్యాప్తునకు మెడికల్ ప్యానెల్

- సుప్రీంలో పిటిషన్



న్యూఢిల్లీ : కొవిషీల్డ్ వ్యాక్సిన్ భద్రతా అంశాలపై వివాదం బుధవారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ వ్యాక్సిన్ వేసుకున్నందు వల్ల తలెత్తే రిస్క్ కారణాలపై అధ్యయనం చేసేందుకు నిపుణులతో కూడిన మెడికల్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. "దేశంలో 175కోట్లకు పైగా కొవిషీల్డ్ డోస్‌లు వేశారు. కోవిడ్ వచ్చిన తర్వాత గుండెపోటుతో, అకస్మాత్తుగా వ్యక్తులు కుప్పకూలి మరణించడం వంటి సంఘటనలు పెరిగాయి. యువకుల్లో కూడా గుండెపోటు కేసులు పెరిగాయి. తాజాగా కొవిషీల్డ్ డెవలపర్ బ్రిటన్ కోర్టులో దాఖలు చేసిన డాక్యుమెంట్ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలకు వేసిన కొవిషీల్డ్ వ్యాక్సిన్ ప్రమాదకర పర్యవసానాల ముప్పుపై ఆలోచించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. "అని న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్ పేర్కొంది.

అత్యంత అరుదైన కేసుల్లో రక్తంలో ప్లేట్‌లెట్‌ల సంఖ్య తగ్గిపోవడం, రక్తం గడ్డ కట్టడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం వుండవచ్చని ఈ వ్యాక్సిన్‌ను రూపొందించిన ఆస్ట్రాజెనికా కంపెనీ పేర్కొందని ఆ పిటిషన్ తెలిపింది. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత రక్తం గడ్డ కట్టడం, గుండెవాపు వంటి సమస్యలు పెరిగాయని అంతర్జాతీయంగా జరిగిన అధ్యయనాల్లో వెల్లడైంది. ఎయిమ్స్‌కి చెందిన నిపుణుడి నేతృత్వంలో మెడికల్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని, రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ సాగాలని పిటిషన్ పేర్కొంది. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు లేదా మరణించిన వారి కుటుంబాలకు లేదా ఆ వ్యక్తులకు వ్యాక్సిన్ నష్టపరిహార చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని తివారీ కోరారు.

క్రిషాంక్ అరెస్టు అక్రమం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్రిషాంక్ అరెస్టు అక్రమం, అన్యాయం, దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. బీఆర్ఎస్ అంటే ఉద్యమ గొంతుక, చైతన్య ప్రతీక, యువతరానికి ప్రతిబింబమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్లీ కాంగ్రెస్ వైఫల్యాలపై ఢిల్లీ బీజేపీ అరాచకాలపై గళమెత్తినందుకే ఈ దౌర్జన్యమనీ, ప్రశ్నించినందుకే ఈ దుర్మార్గమని పేర్కొన్నారు. కాంగ్రెస్-బీజేపీ కలిసి చేస్తున్న ఈ కక్షసాధింపులకు మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ నియంతృత్వ, నిర్బంధాలకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని తెలిపారు. నాడు ఎమర్జెన్సీని చూశామనీ, నేడు అప్రకటిత ఎమర్జెన్సీని చూస్తున్నామని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాసినందుకు ఆనాడు పాలక పక్షానికి పట్టిన గతే ఈనాడు కాంగ్రెస్-బీజేపీలకు పట్టడం ఖాయమని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతనెల ఏడో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించామనీ, 62,983 మంది దరఖాస్తు చేస్తే 51,877 (82.37 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థుల మార్కులు, ర్యాంకుల telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. సంబంధిత మోడల్ స్కూళ్లలో రిజర్వేషన్ విధానం ద్వారా ప్రవేశాలను చేపడతామని తెలిపారు.

తెలంగాణకు ఇచ్చింది గాడిదగుడ్డే

- మోడీ పదేండ్ల పాలనపై రేవంత్ ఎద్దేవా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడీ పదేండ్ల పాలనలో తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగామనీ, వాళ్లు ఇచ్చింది ఏమీ లేదని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బుధవారం పోస్టు చేశారు. 'తెలంగాణ అడిగింది బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ. బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు. తెలంగాణ అడిగింది రైల్వే కోచ్ ఫ్యాక్టరీ. బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు. తెలంగాణ అడిగింది కృష్ణా, గోదావరిలో వాటాల పంపకం.. బీజేపీ ఇచ్చిరంది గాడిద గుడ్డు, తెలంగాణ అడిగింది మేడారం జాతరకు జాతీయ హోదా.. బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డు. పదేండ్ల మోడీ పాలనలో తెలంగాణకు ఇచ్చింది పెద్ద గాడిద గుడ్డు.' అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- పీఆర్టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేండ్లుగా వివిధ రకాల బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు జమ చేసిన జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులు మంజూరు చేయకుంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య అవసరాలు, పిల్లల పెండ్లికి కూడా సకాలంలో డబ్బులు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లుల పట్ల సానుకూలంగా స్పందించి దశలవారీగానైనా చెల్లించాలని కోరారు.

ఐఐటీ, నీట్‌పై ఉచిత గైడెన్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, నీట్ పరీక్షలపై ఉచిత గైడెన్స్ అందిస్తామని మెటామైండ్ అకాడమి చైర్మెన్ ఏ మనోజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఐఐటీయన్లు, డాక్టర్లతో ప్రతిరోజూ హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో తమ అకాడమీలో ఈ కేరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9090898928, 9090898902 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐసెట్ దరఖాస్తు గడువు 7 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ దరఖాస్తు గడువును ఈ నెల ఏడో తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఐసెట్ కన్వీనర్ ఎస్ నర్సింహాచారి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు స్వీకరణ గడువు గతనెల 30వ తేదీతో ముగిసిందని తెలిపారు. అభ్యర్థుల నుంచి వచ్చిన డిమాండ్ దృష్ట్యా ఆలస్య రుసుం లేకుండా ఈనెల ఏడో తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించామన్నారు. జూన్ నాలుగు, ఐదు తేదీల్లో ఐసెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు https://icet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రేడ్-2 భాషా పండితులకు
టెట్ నుంచి మినహాయింపు

- హైకోర్టు తీర్పుపై ఆర్‌యూపీపీటీఎస్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రేడ్-2 భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందడానికి టెట్ నుంచి మినహాయింపునిస్తున్నట్టు హైకోర్టు తీర్పునివ్వడం పట్ల ఆర్‌యూపీపీటీఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, కోశాధికారి కట్టా గిరిజారమణశర్మ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదోన్నతులకు సంబంధించి 2010 కన్నా ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపును రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చుకోవచ్చంటూ ఎన్‌సీటీఈ నిబంధనలున్నాయని తెలిపారు. కానీ రాష్ట్రంలో పదోన్నతుల వ్యవహారంలో విద్యాశాఖ అధికారులు ఈ విషయంలో తగు స్పష్టతను ఇవ్వకుండా దీర్ఘకాలికంగా సమస్యను నాన్చుతూ వచ్చారని పేర్కొన్నారు. ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షులు సి జగదీశ్‌తో పాటు ఇతరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. తమ తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారని తెలిపారు. 2010 కన్నా ముందు నియామకమైన గ్రేడ్-2 భాషా పండితులకు టెట్ రాయాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు నివేదించారని తెలిపారు. వాదనలు విన్న తర్వాత 2010కి ముందు నియామకమైన భాషా పండితులకు టెట్ రాయాల్సిన అవసరం లేదంటూ హైకోర్టు తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. పండితులు పదోన్నతి పొందడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.